

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 30-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 225 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా.9.30 తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.1.11 తదుపరి రేవతి, వర్జ్యం: ఉ.11.29-1.00, దుర్ముహూర్తం: సా.4.06-4.50, అమృతఘడియలు: రా.8.37-10.08, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.32, సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





రాష్ట్రంలో టీడీపీ కార్యాలయంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ప్రాంతీయ జోన్లు

మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు

- రాజధాని రైతులు జేఏసీగా ఏర్పడాలి
- సమస్యలపై చర్చలకు అదే మార్గం
- క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపుపై నిర్మలతో చర్చించా.. ప్రధానికీ చెబుతా
- రాజధాని రైతుల పట్ల గౌరవంగా మెలగాలి
- సీఆర్డీయే అధికారులకు స్పష్టం చేస్తాం
- రైతుల విషయంలో అవినీతిని సహించను
- 2029లో గెలుపే లక్ష్యంగా క్యాడర్‌కు శిక్షణ
- టీడీపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులు, పార్టీ నాయకులతో సీఎం చంద్రబాబు భేటీ
- మహిళల జోలికెళితే ఉపేక్షించను: సీఎం
- పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించొద్దు
- మంత్రి సంధ్యారాణి పీఏ వ్యవహారంపై సీరియస్

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేయనున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు. అభివృద్ధి ఏదో ఒక ప్రాంతానికే పరిమితం కావడం సరికాదని అభిప్రాయపడ్డారు. అందువల్లే ప్రాంతీయ జోన్లను తెస్తున్నామని వివరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయానికి శనివారం మధ్యాహ్నం చంద్రబాబు వచ్చారు. ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో జరిపిన చిట్‌చాట్‌లో, పార్టీ నాయకులతో నిర్వహించిన భేటీలో పలు అంశాలపై

మిగతా 13వ పేజీలో...

దిత్వా డేంజర్!

ముంచుకొస్తున్న మరో తుఫాన్ ముప్పు

- నేడు తమిళనాడు, కోస్తాంధ్ర తీరాలకు సమీపంగా రానున్న దిత్వా తుఫాన్
- దక్షిణ కోస్తా, సీమ జిల్లాలపై ప్రభావం
- నాలుగు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్
- సముద్రంలోనే బలహీనపడే అవకాశం
- తీరం దాటుతుందన్న ఇస్రో నిపుణుడు
- రాష్ట్ర అధికార యంత్రాంగం అప్రమత్తం
- పరిస్థితిపై హోంమంత్రి, సీఎస్ సమీక్షలు
- సహాయ చర్యల కోసం బృందాలు సిద్ధం

అమరావతి/విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుఫాన్ ఏపీ వైపు దూసుకొస్తోంది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లోని పలు జిల్లాలకు ముప్పు పొంచి ఉందని, ఆది, సోమవారాల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ సంస్థలు ప్రకటించాయి. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీచేసింది. తుఫాన్ ప్రభావంతో శనివారం రాత్రి నుంచి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం

మిగతా 12వ పేజీలో...

నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు



చెన్నైలోని కసిమేడు హార్బర్‌లో బోటును సురక్షిత ప్రాంతానికి చేరుస్తున్న దృశ్యం

తుఫాన్ వేళ.. కల్లాల్లోనే ధాన్యం

- కృష్ణా, గోదావరి డెల్టాలో గోనె సంచుల కొరత
- ఖరీఫ్‌లో 6.70 కోట్ల సంచులు సిద్ధం చేస్తున్నామన్న ప్రభుత్వం
- సగం కూడా సరఫరా కాని వైనం
- ధాన్యం తడుస్తుందేమోనని రైతన్నల ఆందోళన

2

శ్రీలంకలో విధ్వంసం

153 మంది మృతి.. 191 మంది గల్లంతు

- అనేక ఇళ్లు ధ్వంసం.. నిరాశ్రయులైన వేలమంది
- శిబిరాలకు లక్ష మందికి పైగా తరలింపు
- తీవ్ర తుఫాన్‌తో అత్యవసర పరిస్థితి ప్రకటన
- 27 టన్నుల సహాయ సామగ్రి పంపిన భారత్
- కొలంబోలో 300 మంది భారతీయులు
- విమానాల రద్దుతో 3 రోజులుగా అక్కడే

12

- తమిళనాడులోని 9 జిల్లాలకు రెడ్ అలర్ట్
- కేరళ, కర్ణాటక, తెలంగాణల్లోనూ భారీ వానలు



2

■ ఆ స్లీపర్ బస్సులను పక్కన పెట్టండి

- నిబంధనలు పాటించని వాటిపై ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు
- వరుస బస్సు ప్రమాదాలపై కమిషన్ ఆందోళన



14

■ సిమ్ ఉన్న ఫోన్లోనే వాట్సాప్ లాగిన్!

- ఇకపై వాట్సాప్‌కు సిమ్ బైండింగ్ నిబంధన
- 6 గంటల తర్వాత వెబ్ వాట్సాప్ దానంతటదే లాగౌట్.. మళ్లీ క్యూఆర్ స్కాన్ చేస్తేనే లాగిన్
- సైబర్ నేరాల్ని అరికట్టేందుకు కేంద్రం నిర్ణయం



14

■ గగనయానం గందరగోళం

- ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యలు.. నిలిచిపోయిన 6 వేల విమానాలు
- భారత్‌లోనూ 250 వరకూ నిలిపివేత
- సౌర రేడియోధార్మికతతోనే సమస్యలు

■ కర్ణాటకానికి తెర!

- సిద్దరామయ్య, శివకుమార్ అల్పాహార భేటీ
- మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాల్లేవు
- 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం: సిద్దూ
- అధిష్ఠానం ఆదేశాలు పాటిస్తాం: శివకుమార్

14

■ సర్‌పైనే సమరం!

- రేపటి నుంచి డిసెంబరు 19వ తేదీ వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

14

■ గంజాయి బ్యాచ్ బరితెగింపు

- నెల్లూరు జిల్లాలో మళ్లీ రెచ్చిపోయిన ముఠా
- హెడ్‌కానిస్టేబుల్‌పై కత్తితో దాడి.. గాయాలు
- సీపీఎం నేత హత్య కేసులో పట్టుకునేందుకు వెళ్లినపుడు ఘాతుకం
- కామాక్షి బ్యాచ్ అరాచకం.. వైసీపీతో సంబంధాలు

11

■ లిక్కర్ సొమ్ముతో ఆస్తులు

- తెలంగాణలో భారీగా ఆస్తుల కొనుగోలు
- జగన్ మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి నిర్వాకం

12

భోగాపురం సిద్ధం!

రెక్కలు విప్పనున్న విమానాశ్రయం.. వచ్చే నెల ఎగరనున్న తొలి విమానం

టెస్ట్ ఫ్లైట్‌కు సిద్ధమైన విమానయాన శాఖ

- ఇక మిగిలింది ఎనిమిది శాతం పనులే
- గడువుకు ముందే పూర్తిచేసే ప్రయత్నం
- వ్యక్తిగతంగా శ్రద్ధపెట్టిన రామ్మోహన్‌నాయుడు
- 15 రోజులకు ఒకసారి కేంద్రమంత్రి పర్యవేక్షణ
- జూన్‌నుంచి తాత్కాలికంగా విమాన రాకపోకలు



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

చివరి దశకు చేరుకున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు

శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం టెస్ట్ ఫ్లైట్‌కు సిద్ధమైంది. డిసెంబరు చివరి వారం లేక జనవరి తొలి వారంలో ఈ ఎయిర్‌పోర్టు నుంచి తొలి విమానం ఎగరనుంది. ఇప్పటివరకూ 92 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు కూడా జూన్ నాటికి పూర్తిచేసి తాత్కాలికంగా విమాన రాకపోకలను

మిగతా 13వ పేజీలో...



కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్

1991 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్

- మార్చి 1న బాధ్యతలు.. అప్పటి వరకూ విజయానంద్ కొనసాగింపు
- సర్వీసు 3 నెలలు పొడిగింపు.. సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్‌ను నూతన ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వచ్చే ఏడాది మార్చి 1వ తేదీన ఆయన సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అప్పటి వరకూ ప్రస్తుత సీఎస్ విజయానంద్ పదవిలో కొనసాగనున్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన సాయిప్రసాద్ ఇది వరకే సీఎస్ కావాల్సి ఉంది. కానీ అప్పట్లో వివిధ కారణాల వల్ల సీఎం చంద్రబాబు సీఎస్‌గా విజయానంద్‌ను ఎంపిక చేశారు. తొమ్మిది నెలలుగా ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ నెల 30వ తేదీన

మిగతా 2వ పేజీలో...

కబళించిన మృత్యువు

- రెండు కార్లు ఢీకొని ఐదుగురి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మంత్రాలయం దర్శనానికి వెళ్తుండగా దారుణం

3



సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డి డిప్యుటేషన్ రద్దు

- చిత్తూరు 'ఆడిటింగ్'కే పరిమితం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన మంత్రి అనగాని.. వెంటనే చర్యలు
- ఏం జరుగుతోంది: చంద్రబాబు ఆరా
- బాధ్యులపై చర్యలకు ఆదేశించిన సీఎం



అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిర్ణయాలను ధిక్కరించే సాహసం చేస్తారా? అంటూ ఇద్దరు అధికారుల తీరును తప్పుబట్టింది. అసలు రిజిస్ట్రేషన్‌శాఖలో ఏం జరుగుతోందంటూ స్వయంగా సీఎం చంద్రబాబు ఆరాతీశారు. రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా ఆనందరెడ్డికి డిప్యుటేషన్ ఇస్తూ ఆదేశాలు ఇవ్వడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తక్షణ చర్యలు తీసుకునేందుకు గాను దీనికి బాధ్యులైన వారిని గుర్తించాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. కాగా, ఆనందరెడ్డిని రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా నియమిస్తూ చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీ ఇచ్చిన డిప్యుటేషన్ ఉత్తర్వులను తక్షణమే రద్దుచేయాలని

మిగతా 2వ పేజీలో...



టీటీడీలో అక్రమార్కులు

'కల్తీ నెయ్యి' నిందితుల్లో 12 మంది అధికారులు

- ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసిన సిట్
- వారిలో ఇప్పటికే అరెస్టయిన సుబ్రమణ్యం
- ఈ జాబితాలో ఐదుగురు డెయిరీ నిపుణులు
- ప్లాంట్లు తనిఖీ చేయకుండానే అనుకూల నివేదికలు
- ఈ కేసులో ఫిర్యాదుదారే నిందితుడైన వైనం
- కల్తీని దాచిన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్యానల్ సభ్యుడు
- క్రమశిక్షణ చర్యల సెక్షన్ ఉద్యోగే క్రమశిక్షణ తప్పారు
- లంచంగా నగదు, వెండి నాణేలు, మొబైల్ ఫోన్లు

తిరుపతి/తిరుపతి(నేర విభాగం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసు దర్యాప్తులో సిట్ దూకుడు పెంచింది. ఇప్పటికే 24 మంది నిందితులపై కేసు నమోదు చేయగా ఇప్పుడు మరో 12 మందిని నిందితులుగా చేరుస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది. ఈ నెల 23న సిట్ మెమో దాఖలు చేయగా ఆ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కొత్తగా చేర్చిన 12 మందిలో టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం పూర్వ జీఎం సుబ్రమణ్యం ఇప్పటికే అరెస్టయ్యారు. మిగిలిన 11 మందిలో ఆరుగురు

మిగతా 13వ పేజీలో...

కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్

(మొదటి పేజీ తరువాయి)



విజయానంద్ పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ సీఎం చంద్రబాబు మరో మూడు నెలల పాటు విజయానంద్‌ను సీఎస్‌గా కొనసాగించాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగా ఆయన సర్వీసు మూడు నెలలు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి సీఎం విజ్ఞప్తి చేశారు. సీఎం విజ్ఞప్తి మేరకు కేంద్రం విజయానంద్‌కు మూడు నెలల పొడిగింపు ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎస్‌గా విజయానంద్‌కు మూడు నెలలు పొడిగింపు ఇస్తూ సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన అదే ఉత్తర్వుల్లోనే 2026 మార్చి 1వ తేదీ నుంచి సాయిప్రసాద్ సీఎస్‌గా కొనసాగుతారని స్పష్టం చేసింది. ముందుగానే సీఎస్‌ను నియమించడం గతంలో కూడా ఒకసారి జరిగింది. 2017లో అజయ్‌కల్లాంను సీఎస్‌గా నియమించారు. ఆయన పదవీ కాలం నెల రోజులే ఉన్నప్పటికీ సీనియార్టీ ప్రాతిపదికన అవకాశం ఇస్తూ.. అదే జీవోలో నెల తర్వాత దినేశ్ కుమార్ సీఎస్‌గా పనిచేస్తారని పేర్కొన్నారు.

216... ప్రత్యేకం

- జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌లుగా ఆదిత్యనాథ్ దాస్, జవహర్‌రెడ్డి, సాయిప్రసాద్

వెలగపూడి సచివాలయంలోని జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ, ఒకే గది నుంచి సేవలందించిన ముగ్గురు అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. సచివాలయంలోని నాలుగో బ్లాకులో జల వనరుల శాఖకు కేటాయించిన 216 నంబరు గదిలో నుంచే జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌లుగా ఆదిత్యనాథ్ దాస్, కేఎస్ జవహర్‌రెడ్డి గతంలో విధులు నిర్వహించారు. వీరిద్దరికీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.సాయిప్రసాద్ తాజాగా సీఎస్‌గా నియమితులయ్యారు. ఒకే శాఖ.. ఒకే గది.. నుంచి ముగ్గురు సీఎస్‌లు అయ్యారని ఐఏఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఈ గది ప్రత్యేక సెంటిమెంట్‌గా మారుతుందేమోనని కొందరు ఐఏఎస్‌లు అంటున్నారు.

చేనేత, గిరిజన ఉత్పత్తులన్నీ ఒకేచోట!

- దేశంలోని 5 ప్రధాన నగరాల్లో ఎగ్జిబిషన్లు: మంత్రి సవిత

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలు.. హస్త కళలు.. గిరిజన ఉత్పత్తులు.. అన్నీ ఒకే చోట లభించేలా దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో వాణిజ్య సముదాయాలు(ఎగ్జిబిషన్లు) ఏర్పాటు చేయబోతున్నట్లు చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా డిసెంబరు 20నుంచి 2026 జనవరి 10వరకు.. 22రోజుల పాటు ఎగ్జిబిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు, లేపాక్షిలోని హస్తకళాఖండాలు, అరకు కాఫీతో కూడిన ఇతర ఉత్పత్తులు ఒకే ఆవరణలో లభించేలా చర్యలు చేపట్టి ఆయా వర్గాలకు భరోసా ఇవ్వాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. దేశంలోనే తొలిసారిగా మన స్థానిక ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి సవిత తెలిపారు.

తుఫాన్ వేళ.. కల్లాల్లోనే ధాన్యం

- కృష్ణా, గోదావరి డెల్టాలో గోనె సంచుల కొరత
- విక్రయానికి, ఇళ్లకు తరలించడానికి ఇబ్బందులు
- ధాన్యం తడుస్తుందేమోనని రైతన్నల ఆందోళన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓ వైపు తుఫాన్ ముంచుకొస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యం కల్లాల్లోనే ఉంది. తుఫాన్ సమయంలో గోతాల్లేక, ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచలేక, ధాన్యం రాశుల్ని ఇళ్లకు తరలించలేక రైతులు సతమతమవుతున్నారు. ధాన్యం తడిసిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో పండించిన ధాన్యాన్ని నింపే గోనెసంచుల (గన్నీ బ్యాగులు)కు డిమాండ్ వచ్చింది. నూర్చిన, ఆరబోసిన ధాన్యం నింపడానికి గోనె సంచులు తగినన్ని అందుబాటులో లేక చాలా గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్‌లో పండించిన వరిని కోసి, కుప్పలేసి, నూర్చిన ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబోశారు. బస్తాలకు ఎత్తడానికి గోనె సంచులు సకాలంలో ఇవ్వడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 17 లక్షల హెక్టార్లలో వరి సాగు చేయగా, 113 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. దీంతో ప్రజాపంపిణీ, ఇతర అవసరాలకు ఈ సీజన్‌లో 50 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ధాన్యం సేకరణకు 6.32 కోట్ల గోనె సంచులు అవసరమవుతాయని, అయినా 6.70 కోట్ల సంచులు సిద్ధం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ప్రకటించారు. కానీ ఇందులో సగం కూడా రైతులకు సరఫరా కాలేదని సమాచారం. ధాన్యం రైతులకు గోనె సంచులు సరఫరా చేయడానికి జిల్లాల వారీగా పౌరసరఫరాల సంస్థ టెండర్లు పిలిచినా.. తగినన్ని సరఫరా కావడం లేదని తెలుస్తోంది. పాత గోనె సంచులు చిరిగిపోవడం, కొత్తవి కుట్టించి తెప్పించడం కష్టంగా మారుతున్నందున సీజన్‌కు ముందే గోనె సంచుల్ని సేకరించి, రైతులకు సరఫరా చేయడంపై పౌరసరఫరాల సంస్థ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో గోనె సంచుల విషయంలో గందరగోళం ఏర్పడుతోంది.



బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వరి కోతలు సగానికిపైగా పూర్తయ్యాయి. కొందరు రైతులు వరి కుప్పలు వేయగా, మరికొందరు కల్లాల్లో నూర్చి, ఖాళీ జాగాల్లో ఆరబోస్తున్నారు. ధాన్యం ఆరితేనే నాణ్యత ఉంటుంది. కానీ ఇప్పుడు తుఫాన్ ముప్పు ఉండటంతో ఆరిన ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపాలని రైతులు ఆదుర్దా పడుతున్నారు. దీంతో గోనె సంచుల కోసం రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదిస్తున్నారు. 'ఇంకా రాలేదు.. కొద్దిగానే ఉన్నాయి.. ఉన్నవి కూడా ముందుగా ధాన్యం లోడెత్తే వాళ్లకే ఇస్తాం' అని అంటున్నారని కొందరు రైతులు చెప్తున్నారు. కృష్ణా జిల్లా అయినంపూడి రైతు సేవా కేంద్రానికి తక్షణం 8 వేల గన్నీ బ్యాగులు అవసరం కాగా... గోతాలేవీ లేవంటున్నారని అక్కడి రైతులు వాపోతున్నారు. ఇప్పటికిప్పుడు పెద్ద సంఖ్యలో గోనెసంచులు కావాలంటే బయట దొరికే పరిస్థితి లేదు. దీంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.

మొత్తం ధాన్యం కొంటాం

- 51 లక్షల టన్నుల సేకరణకు అంచనా
- బాపట్ల జిల్లా చెరుకుపల్లి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి నాదెండ్ల మనోహర్

రేపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నదాతల నుంచి పంట మొత్తం కొనుగోలు చేసేలా 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అంచనాలు రూపొందించినట్లు పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి పరిశీలించారు. "ఇప్పటికే 11 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లోకి 2,300 కోట్ల నగదును జమ చేశాం. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి మూడు, నాలుగు నెలలకుకూడా రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేవాళ్లు కాదు. కూటమిప్రభుత్వం వచ్చాక కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతోంది. రైతుల నుంచి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందవద్దు. తేమ శాతం తక్కువగా ఉందని మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు." అని మంత్రి స్పష్టం చేశారు.

సబ్‌రిజిస్ట్రార్.. ఆనందరెడ్డి డిప్యుటేషన్ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్‌ను ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయాలను ధిక్కరించేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీంతో ఈ నెల 27న ఆనందరెడ్డికి ఇచ్చిన డిప్యుటేషన్ ఉత్తర్వులను రద్దుచేస్తూ సాయిప్రసాద్ శనివారమే మెమో జారీ చేశారు. అదేసమయంలో ఆనందరెడ్డికి పాత పోస్టు అయిన చిత్తూరు రిజిస్ట్రేషన్ శాఖలోని ఆడిట్ విభాగానికే పరిమితం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారి ఆనందరెడ్డిని రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై నియమించాలన్న ఆ శాఖ ఐజీ ప్రతిపాదనలను ప్రభుత్వం ఈ నెల 26నే తిరస్కరించింది. అయినా, మరుసటి రోజు ఆనందరెడ్డిని రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా నియమిస్తూ చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీ డిప్యుటేషన్ ఆర్డర్ ఇచ్చారు. ఈ పరిణామాలు రిజిస్ట్రేషన్‌శాఖలో పెనుప్రకంపనలు సృష్టించాయి. ఈ పరిణామాలపై 'మంత్రి చెబితే మాకేంటి' శీర్షికతో ఆంధ్రజ్యోతి శనివారం ఓ కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వ స్థాయిలో ఫైలు తిరస్కరించినా అధికారులు బరితెగించి పోస్టింగ్ ఇచ్చారా?. అసలు ఆ శాఖలో అధికారులు ఏం చేస్తున్నారు?. అనే చర్చ మొదలైంది. మంత్రి అనగాని సత్యప్రసాద్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ధిక్కరించినందుకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన సదరు అధికారిని హెచ్చరించినట్లు తెలిసింది. మరోవైపు ఈ పరిణామంపై సీఎం చంద్రబాబు కూడా ఆరాతీశారు. అసలు రిజిస్ట్రేషన్ శాఖలో ఏం జరుగుతోంది?. ఆనందరెడ్డి ఎవరు?. ఆయన కోసం అధికారులు ఇంతలా బరితెగించి అడ్డగోలు పోస్టింగ్‌లు ఎలా ఇచ్చారు?. ఆయన ఎందుకు సస్పెండ్ అయ్యారు?. మళ్లీ తిరిగి పాత పోస్టునే ఎందుకు ఇచ్చారు?. దీనిలో ఎవరి ప్రయోజనాలు ఏమిటన్న కోణంలో సీఎం ఆరా తీశారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో గంటల వ్యవధిలో సీన్ మారిపోయింది. ఆనందరెడ్డిని డిప్యుటేషన్‌పై రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా నియమిస్తూ చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీ ఇచ్చిన ఆదేశాలను రద్దుచేయాలని కోరుతూ.. ఆ శాఖ కమిషనర్, ఐజీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆ ఫైలు రాగానే స్పెషల్ సీఎస్ జి. సాయిప్రసాద్ ఆమోదించారు.

ఇన్‌చార్జి డీఐజీకి తాఖీదు

ప్రభుత్వ ఆదేశాలతో సంబంధం లేకుండా ఆనందరెడ్డికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చిన చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీగా ఉన్న నెల్లూరు డీఐపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన అందుబాటులో లేరని తెలిసింది. దీంతో సోమవారం తన ముందు హాజరవ్వాలని మంత్రి అనగాని ఆదేశించినట్లు తెలిసింది. ఆ పోస్టు ఎలా ఇచ్చారు?: ఒకసారి సస్పెండ్ అయి తిరిగి విధుల్లో చేరిన అధికారికి వెంటనే కీలక పోస్టులు ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయినా, వాటిని తోసిపుచ్చి.. ఆనందరెడ్డిని ఏరికోరి రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై నియమించారు. నిబంధనలను బుట్టదాఖలు చేస్తూ కీలకపోస్టును ఆనందరెడ్డికి ఇవ్వాలన్న పెద్ద అధికారులు ఎవరన్నది ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఆరోపణలు

- నా కొడుకుని అనవసరంగా ఇరికించారు
- నా జోలికొస్తే ఊరుకోను: మంత్రి గుమ్మిడి



అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నాపైనా, నా కొడుకుపైన అసత్య ఆరోపణలు చేస్తున్నారు. నా కొడుకుకు ఎలాంటి సంబంధం లేని విషయంలో ఇరికించారు' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'ఎలాంటి పాపం తెలియని తన కుమారుడి జోలికొస్తే ఊరుకునేది లేదు. రాజకీయంగా నా ఎదుగుదల చూసి ఓర్వలేక నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. జగన్ మీడియా నన్ను, నా కుమారుడిని లక్ష్యంగా చేసుకొని గతంలోనూ తప్పుడు వార్తలు రాసింది. విజయవాడలో నా కుమారుడు పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటే తిరుపతిలో చిందులు అని రాశారు. నేను కేసు పెట్టేందుకు సిద్ధమవ్వడంతో నా కాళ్లు పట్టుకుని బలిమలాడుకుని క్షమాపణలు చెప్పారు. ఇప్పుడు మళ్లీ నా కుమారుడిని లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు వచ్చిన వెంటనే నా వ్యక్తిగత సిబ్బందిని పక్కన పెట్టాను. పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఆరోపణల్లో నిజాలను నిగ్గుతేల్చాలని కోరాను. వారం రోజుల్లో వాస్తవం ఏమిటనేది ప్రజలకు తెలుస్తుంది' అని మంత్రి సంధ్యారాణి తెలిపారు.

లోకం తీరు



15 ఏళ్ల తర్వాత ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు

- ఆరుగురిని ఎన్నుకోనున్న ఫార్మసిస్టులు
- 4 నుంచి ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌కు ఎట్టకేలకు ఎన్నికలు జరగబోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్ష మంది ఫార్మసిస్టులు ఈ ఎన్నికల కోసం 15 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. కోర్టు కేసులు, కొంత మంది చేసిన రాజకీయాల కారణంగా రాష్ట్ర విభజన తర్వాత నుంచి ఫార్మసీ కౌన్సిల్‌కు ఎన్నికలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అండతో కొంత మంది తమ స్వార్థం కోసం ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలకు అడ్డుపడుతూ వచ్చారు. ప్రభుత్వ ఫార్మసిస్టు అసోసియేషన్, మరికొన్ని అసోసియేషన్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఎన్నికల్లో 60 వేల మంది ఫార్మసిస్టులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. డిసెంబరు 4వ తేదీ నుంచి ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ పత్రాలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిస్తారు. ఓటర్లు తమ నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి డిసెంబరు 24వ తేదీ నాటికి తిరిగి ఎన్నికల నిర్వహణ కమిటీకి పంపించాల్సి ఉంటుంది. డిసెంబరు 26 లేదా 27వ తేదీన వాటిని లెక్కించి, అత్యధిక ఓట్లు సాధించిన ఆరుగురిని సభ్యులుగా ఎన్నుకుంటారు. మొత్తం 15 మంది సభ్యులకుగాను, మరో ఐదుగురిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. వీరు కాకుండా డీఎంఈ, డీహెచ్, ప్రభుత్వ అనలిస్ట్‌తో పాటు డ్రగ్స్ డీజీలు ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ఉంటారు. ఈ 15 మంది కలిపి ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఇప్పటి వరకూ కౌన్సిల్ రిజిస్ట్రార్ ద్వారానే ఫార్మసీ కౌన్సిల్ నిర్వహిస్తూ వచ్చారు. దీని వల్లే అనేక అవకతవకలు జరుగుతూ వచ్చాయి. కొత్త కౌన్సిల్ ఏర్పడితే ఫార్మసీ కౌన్సిల్‌లో అడ్మినిస్ట్రేషన్ చక్కబడుతుందని ఫార్మసిస్టులు భావిస్తున్నారు. ఎన్నికల కోసం పోరాటం చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ప్యానెల్ కొంత మందిని ఎంపిక చేసి ఎన్నికల్లో బరిలోకి దించింది. వీరిలో కోల శ్రావణ్‌కుమార్, కోటిపాటి రాధాకృష్ణ, నాగకృష్ణరాజు, నల్లమిల్లి ఆదిరెడ్డి, లుక్కా నరేష్, ప్రభుత్వ ఫార్మసిస్టుల తరపున వేమూరి మాలతి ఎన్నికల బరిలో దిగారు.

రియల్ మాఫియా చేతుల్లోకి రాజధాని అమరావతి: షర్మిల



అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ మాఫియా చేతుల్లోకి రాజధాని నగరం అమరావతి వెళ్లిపోతోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'అదానీ, అంబానీల కోసమే రెండో విడతలో సుమారు 17,000 ఎకరాలను సేకరిస్తున్నారు. రాజధాని కోసం సేకరించిన 34 వేల ఎకరాల్లో రాజధాని ఎక్కడుందో సీఎం చెప్పాలి. తొలి దశ భూసేకరణలో పనులు పూర్తికాకుండానే, రైతుల్లో భరోసా రాకుండానే రెండో దశ భూసేకరణ చేపట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోంది. చంద్రబాబు తీరు చూస్తుంటే మింగ మెతుకు లేదు, మీసాలకు సంపంగి నూనె అన్నట్లుగా ఉంది. భూ సేకరణలో తీసుకున్న భూముల్లో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఎన్నిచ్చారు? ఎన్ని కంపెనీలకు ఎంత భూమినిచ్చారు? వంటి వివరాలతో శ్వేతపత్రం ప్రకటించాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

అప్పుల రాజధానిగా మార్చొద్దు: సీపీఐ

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అమరావతిని అప్పుల రాజధానిగా మార్చొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వానికి సూచించారు. రూ.లక్ష కోట్లు అప్పు చేసి నిర్మిస్తే.. అమరావతి అప్పుల రాజధానే అవుతుందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న భూములను అభివృద్ధి చేయకుండా, రాజధాని కోసమంటూ కొత్తగా భూసమీకరణ చేయడం తగదన్నారు. ఇప్పటికే సేకరించిన 54 వేల ఎకరాలకు అదనంగా మరో 16,666 ఎకరాల భూమిని సమీకరించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అభివృద్ధి అంతా అమరావతిలోనే కేంద్రీకృతం చేస్తున్నారనే వాదన ప్రజల్లో బలంగా ఉందని ఈశ్వరయ్య పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని.. స్లీపర్ బస్సులను పక్కన పెట్టండి

- అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేట్ బస్సుల్లో భద్రతపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు కీలక సూచనలు చేసింది. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులను పక్కన పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. తెలంగాణ, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాలపై అందిన ఫిర్యాదులపై ఎన్‌హెచ్‌ఆర్సీ స్పందించింది. ఇందులో ఓ పిటిషన్‌పై మానవ హక్కుల రక్షణ చట్టం-1993, సెక్షన్ 12 కింద మానవ హక్కుల కమిషన్ సభ్యుడు ప్రియాంక్ కనూంగో విచారణ చేపట్టారు. ఈ పిటిషన్‌లో, "ప్రైవేట్ స్లీపర్ బస్సుల రూపకల్పనలో లోపాల వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. కొన్ని బస్సుల్లో డ్రైవర్ క్యాబిన్ ప్రయాణికుల కంపార్ట్‌మెంట్ నుంచి పూర్తిగా వేరు చేయబడి ఉంటోంది. దీనివల్ల ప్రమాదాల సమయంలో డ్రైవర్ తప్పించుకుంటుండగా.. ప్రయాణికులు మాత్రం మంటల్లో చిక్కుకుని మరణిస్తున్నారు. ప్రమాదాన్ని ప్రయాణికులు సకాలంలో గుర్తించకుండా అడ్డంకిగా మారుతోంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం.. జీవించే ప్రాథమిక హక్కును కాలరాయడమే. ఈ ఘటనలు బస్సులను తయారుచేసే కంపెనీలు, వాటి ఫిట్‌నెస్‌ను ఆమోదించే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం." అని పిటిషనర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర పరిహారం

» వ్యవస్థలన్నీ ఆ బాధ్యత తీసుకోవాలి: జస్టిస్ రవినాథ్ తిల్హారి

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర పరిహారం అందించడం అన్ని వ్యవస్థల బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ జ్యూడీషియల్ అకాడమి బోర్డు ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్, ఏపీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి స్పష్టం చేశారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని ఏపీ జ్యూడీషియల్ అకాడమీలో మోటారు వాహనాల చట్టంపై న్యాయాధికారులు, పోలీసు అధికారులకు జరిగిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మోటారు వాహన చట్టం పటిష్టంగా అమలు పరచాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు దర్యాప్తును వేగంగా పూర్తి చేయాలన్నారు. గోహర్ మొహమ్మద్ వర్సెస్ యూపీ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ కేసును ఈ సందర్భంగా ఆయన వివరించారు. అకాడమీ సభ్యురాలు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం అమలుల్లో బీమా కంపెనీల పాత్ర, దర్యాప్తు, ఆధారాల సేకరణలో పోలీసులు వ్యవహరించాల్సిన తీరు, క్లెయిమ్‌ల పరిష్కారంతో సహా పలు అంశాలను వివరించారు. ఆచరణాత్మక, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార ప్రక్రియలు, మోటారు ప్రమాద క్లెయిమ్‌ల దర్యాప్తు, క్లెయిమ్‌ల దాఖలు తదితర సమస్యలను అకాడమీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ సభ్యుడు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ హరిహరనాథ శర్మ వివరించారు.

కబళించిన మృత్యువు

రెండు కార్లు ఢీకొని ఐదుగురి దుర్మరణం


సతీశ్


మీనాక్షి


వెంకటేశప్ప


బన్నిత్‌గౌడ, రిత్విక్

కర్నూలు/ఎమ్మిగనూరు/ఆదోని రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబం ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు మృత్యుఒడికి చేరారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులంతా కర్ణాటకలోని ఓలార్ జిల్లా బంగారుపేట తాలుకా చిక్కహోసళ్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు... బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్న ఎన్.సతీశ్, మీనాక్షి దంపతులకు మూడేళ్ల కుమారుడు రుత్విక్ ఉన్నాడు. ఈ నెల 27న వీరి పెళ్లి రోజుకావడంతో మామగారైన వెంకటేశప్ప స్వగ్రామం చిక్కహోసళ్లికి వచ్చారు. అక్కడినుంచి మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రి బయలుదేరారు. కోటేకల్లు గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న మరో కారును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఎన్.సతీశ్ (34), మీనాక్షి (32), వారి కుమారుడు రుత్విక్ (3), మీనాక్షి మేనల్లుడు (సోదరుడి కుమారుడు) బన్నిత్‌గౌడ్ (5), ఆమె తండ్రి వెంకటేశప్ప(76) అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటేశప్ప భార్య గంగమ్మ, కారు డ్రైవింగ్ చేస్తున్న చేతన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆదోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. కాగా, వాహనం నడుపుతున్న చేతన్ నిద్రమత్తులో మలుపులో రాంగ్ రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో చేతన్‌తో పాటు వీరు ఢీకొన్న కారులో ప్రయాణిస్తున్న వారంతా ప్రాణాలతో బయటపడ్డారు. ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి తెలిపారు.

సీఎం చంద్రబాబు దిగ్ర్భాంతి

కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసులు ఐదురుగు దుర్మరణం చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ఏ.సిరి, డీఐజీ కోయ ప్రవీణ్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా, మంత్రి టీజీ భరత్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ప్రమాదంపై తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన ఇండిగో విమానం

రేణిగుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్‌కు ముందు విమానాన్ని నిలిపివేశారు. హైదరాబాదు నుంచి శనివారం ఉదయం 10.35 గంటలకు తిరుపతికి చేరుకున్న ఇండిగో విమానం తిరిగి 11 గంటలకు బయల్దేరాల్సి ఉంది. అయితే టేకాఫ్ ముందు సాంకేతిక సమస్య తలెత్తడంతో విమానాన్ని వెంటనే ఆపివేశారు. ప్రయాణికులను దింపి, విమానాశ్రయం లోపలకు తరలించారు. విమానం రిపేరు కాకపోవడంతో కొందరని మధ్యాహ్నం, మరి కొందరిని సాయంత్రం 6.20 గంటలకు మరో విమానంలో హైదరాబాదుకు తరలించారు.

17 నుంచి తిరుమలలో తిరుప్పావై

» ధనుర్మాసం నేపథ్యంలో సుప్రభాతం రద్దు

తిరుమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో నిత్యం జరిగే సుప్రభాత సేవ రద్దు కానుంది. ధనుర్మాసం నేపథ్యంలో డిసెంబరు 17 నుంచి సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై పఠించనున్నారు. డిసెంబరు 16, మధ్యాహ్నం 1.23 గంటల నుంచి ధనుర్మాస ఘడియలు ప్రారంభంకానున్నాయి. దీంతో మరుసటి రోజు వేకువజాము నుంచి సుప్రభాతసేవను రద్దు చేసి, తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. జనవరి 14న ధనుర్మాస ఘడియలు ముగియడంతో, 15వ తేదీ వేకువజాము నుంచి సుప్రభాత సేవ తిరిగి ప్రారంభమవుతుంది. శ్రీవారిని స్తుతిస్తూ గోదాదేవి రచించిన 30 పాశురాలను తిరుప్పావై అంటారు. తిరుమల ఆలయంలో నెల రోజులపాటు రోజుకో పాశురాన్ని అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంగా భోగ శ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణ స్వామికి ఏకాంత సేవ నిర్వహిస్తారు.

గూడూరును నెల్లూరులో కలపాలి

» మంత్రి వర్గ ఉపసంఘానికి సోమిరెడ్డి లేఖ

నెల్లూరు (వైద్యం) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంత్రి వర్గ ఉపసంఘానికి శనివారం లేఖ రాశారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియలో నెల్లూరు జిల్లా ఎంతో నష్టపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేసిన విభజనతో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం, శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లతోపాటు అనేక ప్రముఖ అధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటక కేంద్రాలను నెల్లూరు జిల్లా ప్రజలు కోల్పోయారన్నారు. తిరుపతి జిల్లాలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల క్షేత్రం ఉందని తెలిపారు. దక్షిణ కాశీగా పిలవబడే శ్రీకాళహస్తి కూడా తిరుపతి జిల్లాలోనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి గూడూరును వేరు చేసినా వచ్చే నష్టమేమిలేదని ఆయన తెలిపారు. గూడూరు ప్రజలు కూడా నెల్లూరు జిల్లాలో కలపాలని కోరుతున్నారని తెలియచేశారు. 2024 ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కందుకూరు డివిజన్ ప్రకాశం జిల్లాలో కలిసిపోతున్న నేపథ్యంలో రామాయపట్నం పోర్టు కూడా నెల్లూరుకు దూరమైపోతుందని చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. గూడూరును కలిపితే దుగరాజపట్నంలో నిర్మించే నౌకా కేంద్రమైనా జిల్లాకు దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాకు లేని విధంగా 147 టీఎంసీల సామర్థ్యం కలిగిన సోమశిల, కండలేరు, జలాశయాలు నెల్లూరు జిల్లాలోనే ఉన్నాయని.. తెలుగుగంగ ప్రాజెక్టులోనూ ఈ రెండు జలాశయాలు అంతర్భాగమని తెలిపారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన 'శ్రీ భాగ్య' అతిథి గృహం

తిరుమలలో మరో అతిథి గృహం

» రూ.25 కోట్లతో నిర్మించిన పారిశ్రామికవేత్త శేఖర్ రెడ్డి

» నేడు 'శ్రీభాగ్య'ను ప్రారంభించనున్న తమిళనాడు గవర్నర్



చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో 'శ్రీ భాగ్య' పేరుతో మరో అతిథి గృహం అందుబాటులోకి రానుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ సభ్యులు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏజే శేఖర్ రెడ్డి రూ.25 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ అతిథి గృహాన్ని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆదివారం ఉదయం 10.30 గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, ఈవో, ఏఈవో తదితరులు పాల్గొననున్నారు.

శ్రీవారి సేవలో శేఖర్ రెడ్డి

తమిళనాడుకు చెందిన ఏజే శేఖర్ రెడ్డి అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో తరిస్తున్నారు. సనాతన ధర్మంలో గోమాత వైశిష్ట్యాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు శ్రీవారి పాదాల చెంత రూ.15 కోట్లతో గోమందిరం నిర్మించి, నిర్వహణ బాధ్యతలను ఇప్పటికీ తానే నిర్వర్తిస్తున్నారు. చెన్నై నడిబొడ్డున అలనాటి నటి కాంచన ఇచ్చిన రూ.40 కోట్ల విలువైన స్థలంలో పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం రూ.1.25 కోట్లు విరాళం ఇవ్వడంతో పాటు ఆలయ నిర్మాణం కోసం శేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారు. ఈ ఆలయంలో భక్తులకు సౌకర్యాల కల్పనకు, ఆలయ విస్తరణకు రూ.150 కోట్ల వ్యయంతో ఆయన బృహత్తర ప్రణాళికలను రూపొందించారు. వేలూరులో శ్రీవారి ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.1.25 కోట్లు విరాళంగా ఇప్పించారు. తమిళనాడులోని ఉళుందూరుపేటలో రూ.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయానికి టీటీడీ రూ.5 కోట్లు కేటాయిస్తే, దాతలతో రూ.25 కోట్లు విరాళంగా ఇప్పించారు. ఆయన స్వస్థలం వేలూరులో 800 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు రూ.కోటి వెచ్చించి 2015లో పూర్తిచేశారు. రూ.1.40 కోట్లు వెచ్చించి కాట్పాడిలోని అమ్మవారి ఆలయ రాజగోపురం నిర్మించారు. తిరుమల శ్రీవారి కైంకర్యాలకు వినియోగించేందుకు బంగారు గంగాళం అందించారు. గత 13 ఏళ్లుగా ప్రతిరోజూ స్వామివారికి పుష్పకైంకర్యం కోసం 20 కిలోల సంపంగి పూలను బెంగుళూరు నుంచి రప్పిస్తున్నారు. ఇప్పుడు తిరుమలలో అతిథి గృహం నిర్మించి స్వామివారి పట్ల భక్తిని చాటుకున్నారు.

దేశమనేది పాత మాట. విశ్వం అనేది నేటి మాట. విశ్వవిపణిలో మాయలఫకీరు చేతిలో పక్షి దేశమిపుడు. విశ్వవిపణికి విరుగుడు కావాలి తండ్రీ. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అని ఎవురి మీద కోపంతో అన్నావో గానీ, నీ మాట విని యెంత నష్టపోయామో గదా అని నొచ్చుకుంటన్నారు నేతలు.

ఇది దిద్దుబాటుకు వొల్లగాని దేశం బావూ!

నా చిన్నపుడు మా ఊరిలో ఎడ్ల పోతినాయుడు అనే పెద్దాయన ఉండేవాడు. నెత్తి మీద జుట్టు నుంచి మూతి మీద మీసం దాక తెల్లగా పండిపోయినాయి. మనిసీ తెల్లగా ఉండీవోడు. తెల్లటి లాల్చీ, పంచే కట్టుకునేవోడు. 'బాపనోళ్ళ ఇంటిల పుట్టవొలసినోడు, కాపోడి ఇంటిల పుట్టినాడు' అని మా ఊరి జెనాలు నొచ్చుకునేవోరు. పోతినాయుడు అదేటీ పట్టించుకునేవాడు కాదు, ఊరి జెనాలకి యేవేవో దిద్దుబాట్లు చెప్పేవాడు. మొగుడూ, పెళ్ళాలను జగడాలు ఆడొద్దని, వయసు మాయకు కుర్రకారుని లోబడొద్దని, రైతుల్ని పొలాలు వొదిలేసి, మార్కెట్లంట తిరగొద్దని, ఎవురికీ అపకారం సెయ్యొద్దని, కుదిరితే ఉపకారం సెయ్యమని... సుద్దులు సెప్పీవోడు. ఎందరు అతగాని సుద్దులు యిని, బతుకులు దిద్దుబాటులు చేసుకున్నారో నేను లెక్కెయ్యలేదు, అంత వొయసు కాదు నాది.

ఇపుడు మా ఊరిల పోతినాయుడు లేడు. చిన్న నాటి ఊరు మారిపోనాది. పూరిల్ల వాసాలు, ప్రహరీల గేట్లతోటి డాబాలయినాయి. కట్టు, బొట్టు మారింది. భూమ్మీద పంటకి ధర తగ్గి, భూమికి ధర పెరిగింది. ఊరి చుట్టూ, ఉరిలోకీ ఆఫీసులు, కంపెనీలు, కాన్వెంట్లు కొత్తవేవేవో రాక! ఉపిరి ఆడక ఎందరో ఎక్కడెక్కడికో వలస పోక! చెప్పొచ్చేదేటంటే– ఒక మారుమూల పల్లెలోని ప్రజలకే... జీవితానుభవం పండిన ఒక పెద్దమనిసి చెప్పిన దిద్దుబాటు సుద్దులు జీర్ణం కాకపోతే, లోకం మొత్తానికి దిద్దుబాటు సుద్దులు చెపితే జీర్ణమవుతాయా... అప్పారావు బావూ? పోతినాయుడు కంటే నీకు మీసాలు పెద్దవి ఉండొచ్చు. నువ్వు పెద్ద చదువులు చదివి ఉండొచ్చు. నువ్వు పెద్ద ఇంటిల పుట్టి ఉండొచ్చు. పెద్ద కోటల కొలువు చేసుండొచ్చు గానీ, గురువా గురజాడా! లోకం సేనా పెద్దది. నీ దిద్దుబాటు సుద్దులు దానికి అజీర్ణం.



తప్పుదోవల నడిచే పురుషుడ్ని నువ్వు దిద్దుబాటు చేసుకోమన్నావు. ఇపుడసలు రెండు దోవలు లేవు, ఉన్న దొకటే దోవ. అది తప్పుడు దోవ. ఆడోరిని అర్ధరేతిరి తిరగొద్దని, అందమైన బట్టేసుకోవొద్దని, వొంట గది దాటవొద్దని శాసిస్తున్నాడు. శాసనాలను దిద్దుబాటు కాదు, చెరిపేయాల. అప్పుడు గానీ నీ సుద్దులు అమలు కావు. 'మతములన్నియు మాసిపోవున్, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగున'ని అన్నావుగానీ, అగ్యానం రాజ్యమేలతాంది బావూ. ఒక ఊరిలోని దేవుని మాన్యానికీ, దద్దోజినం, పులిహోరలకే శరబయ్యలు, ఆచార్లూ అంతలేసి అగ్గిగుండాలు లేపారని రాసినావే... ఇపుడు దేశమంతా దేవుడి మాన్యమే. పీరుసాయిబులూ, నాంచారమ్మలూ నిప్పుల గుండం చేసారు దేశాన్ని. ఆ దేవుళ్ళని పీనుగులన్నావు గానీ ఇపుడు మనుషుల్ని పీనుగులు చేస్తన్నారు. తగలేసే దారి చెప్పు బావూ.

కళలు అన్నీ నేర్చుకొని దేశీ సరుకులు నింపమన్నావు... అన్ని కళలు నేర్చుకొని బతుకు లేక జెనం ఎన్నో దేశాల దిమ్మరులయితే, నేతలేమో విదేశీ సరుకులు నింపమని ప్రపంచకమంతా తిరగతన్నారు. దేశమనేది పాత మాట. విశ్వం అనేది నేటి మాట. విశ్వవిపణిలో మాయలఫకీరు చేతిలో పక్షి దేశమిపుడు. విశ్వవిపణికి విరుగుడు కావాలి తండ్రీ. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అని ఎవురి మీద కోపంతో అన్నావో గానీ, నీ మాట విని యెంత నష్టపోయామో గదా అని నొచ్చుకుంటన్నారు నేతలు. కొండలు, కోనలు, అడవులు, పొలాలు, అటిలోని ఔషధాలు, పంటలు, గనులు, ఖనిజాలు... సముద్రాలు ఆటి జలాలు... ఇసక దానిలోని ఖనిజాల గురించి ఎందుకు చెప్పలేదని, అవేవీ ముఖ్యం కావని, మనుషులే ముఖ్యమని అన్నందుకు నువ్వు లేవుగానీ, ఇపుడు గానీ వుంటే రాజద్రోహం కాదు, దేశద్రోహం కేసు ఎదుదురు నేతలు. సౌజన్యారావు వకీలయినా నిన్ను కాపాడలేడు. తిండి తినమని, ఈసురోమని ఉండొద్దని ఎన్నెన్నో సుద్దులు చెప్పావు గానీ, దిద్దుబాటుకు వొల్లగాని దేశమిది. బుచ్చెమ్మను గిరీశాలు దేశదేశాలు తిప్పతన్నారు. సౌజన్యారావు చాలడు, మధురవాణి మంత్రాంగం చెల్లదు. గురజాడా– నీ పాత్రలేవీ ఈ మాయను ఛేదించలేవు. నీ కలానికి అందని రైతులు, కూలీలు, కార్మికులు, ఆదివాసులు, దళితులూ కలగలసిన బహుజన ప్రస్థానం సాగాల, అది ఈ దేశాన్ని దిద్దుబాటు సెయ్యాల. ఏటంటావు అప్పారావు బావూ?

◆ **అట్టాడ అప్పల్నాయుడు**

(నేడు గురజాడ వర్ధంతి)

టెంబా టీమ్ : దక్షిణాఫ్రికా క్రికెట్‌కు జేజేలు



■ రామచంద్ర గుహ

నేను చదివిన అత్యుత్తమ స్పోర్ట్స్ పుస్తకాలలో ఒకటి జాన్ కార్లిన్ రాసిన 'ప్లేయింగ్ ది ఎనిమీ: నెల్సన్ మండేలా అండ్ ది గేమ్ దట్ మేడ్ ఎ నేషన్'. దక్షిణాఫ్రికా ఆతిథ్యమివ్వడంతో పాటు విజయం సాధించిన చరిత్రాత్మక 'రగ్బీ వరల్డ్ కప్–1995' గురించిన విపుల కథనమిది. రగ్బీ అనేది దక్షిణాఫ్రికాలో అమానుష జాతి వివక్షా వ్యవస్థకు కారకులైన జాత్యహంకార, ఆధిపత్యవాద ఆఫ్రికానర్ల(దక్షిణాఫ్రికాలో నివసించే డచ్ మూలాలున్న శ్వేతజాతి సమూహం) ఆట. మనకు నమ్మడానికి కష్టంగా అనిపించే ఓ వ్యక్తి, ఆ ఆటకు అభిమానిగా ఉన్నారు. ఆయన ఎవరో కాదు, నెల్సన్ మండేలా! ఆఫ్రికానర్ల వివక్షాపూరిత పాలనలో దశాబ్దాల పాటు జైలులో మగ్గిపోయిన మండేలా రగ్బీకి ఎలా అభిమాని అయ్యారనే విషయాన్ని కార్లిన్ చాలా సున్నితంగా వివరించారు. జైలు నుంచి విడుదలైన తరువాత దక్షిణాఫ్రికా అధ్యక్షుడుగా మండేలా ఎన్నికయ్యారు. దేశాధ్యక్షుడి హోదాలో ఆయన శ్వేత జాతీయుల ప్రాబల్యంలో ఉన్న రగ్బీ టీమ్‌కు అనధికారిక చిహ్నం (మస్కట్) అయ్యారు. టీమ్ కెప్టెన్ ఆఫ్రికానర్ అయిన ఫ్రాంకోయిస్ పియెనార్‌తో ఆయన ప్రత్యేక స్నేహ సంబంధాలు నెలకొల్పుకున్నారు.

కార్లిన్ పుస్తకం (దీని ఆధారంగా నిర్మించిన 'ఇన్విక్టస్' అనే ఫీచర్ ఫిల్మ్‌లో మండేలాగా మోర్గాన్ ఫ్రీమన్ నటించారు) రగ్బీ ఆటను దాని సామాజిక, రాజకీయ సందర్భంతో చక్కగా మేళవించింది. మహోన్నత దార్శనిక నేత అయిన నల్లజాతి రాజకీయవేత్త, పక్షపాత రహితంగా ఆలోచించే శ్వేతజాతి క్రీడాకారుల మధ్య సన్నిహిత స్నేహ సంబంధాలు– గతంలో పరస్పర విరోధులుగా ఉన్న వేర్వేరు జాతి సమూహాలను ఎలా సమైక్యపరిచాయో సవివరంగా వెల్లడించింది. క్రికెట్ గ్రౌండ్స్‌లో అత్యంత పవిత్రమైనది, ప్రతిష్ఠాత్మకమైనదిగా భావించే 'లార్డ్స్'లో దక్షిణాఫ్రికా జట్టు ఈ ఏడాది 'వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్' (డబ్ల్యూటీసీ)ను గెలుచుకున్న సందర్భంలో కార్లిన్ పుస్తకాన్ని జ్ఞాపకం చేసుకున్నాను. ఈ క్రికెట్ విజయానికి 1995 నాటి రగ్బీ విజయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యం గానీ, సామాజిక ప్రభావం గానీ లేవు. ఇది పూర్తిగా క్రికెట్ విజయం. అయినప్పటికీ ఇది, జాతీయవాద ఆర్భాటాలు, ఉన్మాదాలు లేని క్రికెట్ ప్రేమికులకు ఎల్లెడలా ఎనలేని ఆనందోత్సాహాలను ఇచ్చింది. ఇందుకొక కారణమున్నది. తమను తాము క్రికెట్ ప్రపంచ గొప్ప అగ్రత్రయంగా భావించుకునే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్‌లు– దక్షిణాఫ్రికా క్రికెటర్లు అంతగా గౌరవించదగినవారు కాదని విశ్వసించడం కద్దు. ఈ మూడు దేశాలు వారికి రెండు లేదా మూడు టెస్ట్‌ల సిరీస్ కంటే ఎక్కువ ఇచ్చేవి కావు. దక్షిణాఫ్రికా తన డబ్ల్యూటీసీ విజయాన్ని డిఫెండింగ్ ఛాంపియన్స్ ఆస్ట్రేలియాపై సాధించడం నన్ను ఎంతో ఉద్వేగపరిచింది. అందునా విజేత జట్టుకు నల్లజాతీయుడు అయిన టెంబా బవుమా నేతృత్వం వహించడం నాకు ప్రత్యేకంగా అమితానందాన్ని కల్పించింది. జట్టును విజయానికి నడిపించడంతో పాటు జాతిపరంగా వైవిధ్య నేపథ్యాలు ఉన్న 11 మంది ఆటగాళ్లు విజయానికి పోరాడేలా చేయడంలో బవుమా వ్యవహరించిన తీరు ప్రశంసార్హమైనది.

డబ్ల్యూటీసీ ఫైనల్‌ను దాదాపు పూర్తిగా టెలివిజన్‌లో వీక్షించాను. అది టెస్ట్ క్రికెట్ కావడం ఒక కారణమైతే, దక్షిణాఫ్రికా జటిల చరిత్రలో నాకు ఎంతో కాలంగా ఆసక్తి ఉండడం మరొక కారణం. ఎయిడెన్ మార్క్‌క్రమ్, టెంబా బవుమాలు తమ పరుగుల వేటను జయప్రదంగా పూర్తి చేయడాన్ని చూసిన తరువాత ఎంతో సంతృప్తితో ఆనందంతో భోంచేసి నిద్రపోయాను. ఆ మరుసటి ఉదయం నా ఫోన్‌పై వార్తలు చూసినప్పుడు క్రితం రాత్రి నేను పొందిన ఆనందోత్సాహాల అనుభూతులు ఒక్కసారిగా రోతపుట్టే తీరులో అణగారిపోయాయి.. సౌందర్యపరంగా, రాజకీయంగా అవి ఉల్లంఘనకు గురయ్యాయి. ఈ నా చేదు అనుభవాన్ని మరికొంచెం వివరిస్తాను. డబ్ల్యూటీసీ ఫైనల్‌ను గౌరవించే పేరిట అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఒక వీడియోను సామాజిక మాధ్యమాలలో పెట్టింది. అందులో ప్రధాన పాత్రలు వహించింది టెంబా, ఆయన సహచర ఆటగాళ్లు అనుకుంటున్నారా? కానే కాదు. మరి ఎవరో ఊహించగలరా? జై షా! అవును, ఐసీసీ అధ్యక్షుడు. 45 సెకన్ల ఆ వీడియోలో కన్పించే 23 షాట్‌లలో 11 పూర్తిగా షాను ఒక స్టార్‌గా చూపిస్తున్నవేనని ఒకరు లెక్క వేశారు. క్రికెట్ బ్యాట్‌ను ఎలా పట్టుకోవాలో లేదా 22 గజాల పిచ్‌పై ఎలా బౌలింగ్ చేయాలో జై మహాశయునికి తెలీదు. అయితే ఆయన ఐసీసీ అధ్యక్షుడు కదా. ప్రపంచ క్రికెట్‌ను సమర్థంగా నడిపిస్తున్నది బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి). మరి బీసీసీఐని (తద్వారా ఐసీసీని) అమోఘంగా నడిపిస్తున్నది భారతీయ జనతా పార్టీ. బీజేపీలో (ఆ కారణంగా భారత్‌లో) అత్యంత శక్తిమంతుడైన రెండవ వ్యక్తి జై షా తండ్రి.

బవుమా, మార్క్‌క్రమ్, రబాడ, మహరాజ్, తదితర దక్షిణాఫ్రికా జట్టు సభ్యుల విజయోత్సాహాన్ని ఒక భారతీయ రాజకీయవేత్త కుమారుడి వినయరాహిత్యం, మొరటుతనం, తనను తాను గొప్ప చేసుకునే స్వభావం భగ్నం చేసింది, భ్రష్టపరిచింది. జై షా తీరును అనేక మంది ఆక్షేపించారు. అయితే బీసీసీఐ పెత్తందారులు చాలా కాలంగా దక్షిణాఫ్రికా క్రికెటర్లను చులకనగా చూస్తున్న తీరుతెన్నులకు జై షా అభ్యంతరకర వ్యవహారం కేవలం పరాకాష్ఠ మాత్రమే అన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. దక్షిణాఫ్రికాలో ఇండియా 2012లో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఆడవలసి ఉంది. వెస్టిండీస్‌తో ఒక సిరీస్‌ను హడావుడిగా ముంబైలో ఏర్పాటు చేశారు. కారణమేమిటి? సచిన్ టెండూల్కర్ తన 200వ టెస్ట్ మ్యాచ్‌ను ముంబైలో ఆడే వీలు కల్పించేందుకే. 2025 సంవత్సరాంతంలో కూడా మన దేశంలో పర్యటించిన దక్షిణాఫ్రికా జట్టుకు రెండే రెండు టెస్ట్‌ల సిరీస్ ఇచ్చారు. ఇది దక్షిణాఫ్రికా క్రికెటర్లను తక్కువగా చూడడమే కాదూ? రెండే రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను ఆఫర్ చేసినా టెంబా, ఆయన సహచర ఆటగాళ్లు 'మేము వచ్చాము, మేము ఆడాము, మేము గెలిచాము' అన్న వీరోచిత రీతిలో విజయం సాధించారు. భారతీయ స్పిన్నర్స్‌కు తోడ్పడే విధంగా ఉండే కోల్‌కతా పిచ్‌పై దక్షిణాఫ్రికా ఆటగాళ్లు మన జట్టు కంటే మెరుగ్గా బౌలింగ్, బ్యాటింగ్ చేశారు. ముఖ్యంగా కెప్టెన్ బవుమా తన శక్తియుక్తులు అన్నిటినీ వినియోగించి ఆడారు. గౌహతిలో ఆడిన రెండో టెస్ట్‌లో కూడా టెంబా, ఆయన సహచరులు దీటుగా ఆడారు. ముఖ్యంగా మార్కో యాన్సెన్ మన జట్టుపై సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించారు.

అంతర్జాతీయ రగ్బీలో 1995 దక్షిణాఫ్రికా సంవత్సరమైతే అంతర్జాతీయ క్రికెట్‌లో 2025 దక్షిణాఫ్రికా సంవత్సరం, సందేహం లేదు. ఐదు రోజుల క్రికెట్ మ్యాచ్ చాలా కష్టమైన క్రీడ. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లు గెలవడమనేది టీ20, వన్‌డే, టెస్ట్ మ్యాచ్‌లలో గెలవడం కంటే గొప్ప క్రీడా విజయంగా పరిగణన పొందుతోంది. ఐసీసీ ట్రోఫీని గెలుచుకున్న దక్షిణాఫ్రికా క్రీడాకారులు మన దేశానికి వచ్చారు. మిగతా ప్రపంచం మొత్తం మీద కంటే అధిక క్రికెటర్లు, అత్యధిక క్రికెట్ అభిమానులు ఉన్న మన దేశంలో టీమ్ ఇండియాతో పోటీపడటమనేది ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లాంటి దేశాలకే చాలా కష్టంగా ఉంటుంది. అటువంటిది దక్షిణాఫ్రికా ఆటగాళ్ల చరిత్ర, పరిస్థితులను ధిక్కరిస్తూ రెండు టెస్టులలోను గొప్పగా ఆడి, మన జట్టును చిత్తుగా ఓడించారు.



ఈ అనూహ్య ఓటమి భారతీయ క్రికెట్ అభిమానులను ఎనలేని ఆందోళనకు గురి చేసింది. 'తమ పోటీదారుల కంటే తమకే బాగా తెలిసిన పిచ్‌పై మన జట్టు అంత ఘోరంగా ఎందుకు ఓడిపోయింది?' అని అసంఖ్యాక అభిమానులు మథన పడ్డారు. స్వదేశంలోని పిచ్‌లపై అసాధారణ రికార్డులను సాధించిన సర్ఫరాజ్ ఖాన్‌ను ఎందుకు టీమ్ ఇండియాలో చేర్చలేదు అని ఎంతోమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఉద్వాసన చెప్పనున్నారా అని కూడా చాలామంది ఊహాగానం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌ల పట్ల మితిమీరిన మక్కువ మూలంగా టెస్ట్ క్రికెట్‌లో మనం సమర్థంగా పోటీపడలేకపోతున్నామా? అని మెరుగైన అవగాహన ఉన్న అభిమానులు ప్రశ్నించారు. దక్షిణాఫ్రికా క్రికెటర్లకు బీసీసీఐ సరైన గుర్తింపు, సమున్నత గౌరవం ఇవ్వడంలో ఇప్పటికే క్షమార్హం కాని రీతిలో చాలా జాప్యం జరగలేదా? కోల్‌కతాలోనూ, గౌహతిలోనూ దక్షిణాఫ్రికా క్రికెటర్ల చేతుల్లో టీమ్ ఇండియా పరాజయం పాలయిన తీరుతెన్నుల దృష్ట్యా ఆ కఠిన ప్రశ్నను సైతం భారతీయ క్రికెట్ అభిమానులు అడిగి తీరాలి.

> **దక్షిణాఫ్రికా క్రికెటర్ల పట్ల గతంలో మన అహంకారపూరిత ప్రవర్తనకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. దక్షిణాఫ్రికాలో టీమిండియా నాలుగు లేదా ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడడమే ఆ ప్రాయశ్చిత్తానికి మంచి పద్ధతి అని నేను భావిస్తున్నాను. అది మన క్రీడా పాటవానికి నిజమైన పరీక్ష అవుతుంది. మనం ఎంతగానో మెచ్చుకుంటున్న, ఆరాధిస్తున్న ఆటగాళ్ల సామర్థ్యాల నిగ్గుతేల్చేందుకు అది మనకొక అవకాశమిస్తుంది.**

దక్షిణాఫ్రికా క్రికెటర్ల పట్ల గతంలో మన అహంకారపూరిత ప్రవర్తనకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. తగు సమయం ఆసన్నమైన వెంటనే దక్షిణాఫ్రికాలో టీమ్ ఇండియా నాలుగు లేదా ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడడమే ఆ ప్రాయశ్చిత్తానికి మంచి పద్ధతి అని నేను భావిస్తున్నాను. ఇది మన క్రీడా పాటవానికి నిజమైన పరీక్ష అవుతుంది. మనం ఎంతగానో మెచ్చుకుంటున్న, ఆరాధిస్తున్న ఆటగాళ్ల సామర్థ్యాల నిగ్గు తేల్చేందుకూ అది మనకొక అవకాశమిస్తుంది.

దక్షిణాఫ్రికాలో జాతివివక్షా పాలన ముగిసి, ప్రప్రథమ ప్రజాస్వామిక ఎన్నికలు జరిగిన వెన్వెంటనే ఆ దేశ రగ్బీ ఆటగాళ్లు సాధించిన విజయాలు పుస్తకం రూపేణా, ఒక అద్భుత సినిమాగాను క్రికెట్ అభిమానుల మనసుల్లో కలకాలం జ్ఞాపకముండేలా నిలిచిపోయాయి. మూడు దశాబ్దాల అనంతరం ఇప్పుడు ఒక 'ఇంద్రధనస్సు దేశం' (రెయిన్‌బో కంట్రీ)గా దక్షిణాఫ్రికా పట్ల శ్రద్ధాసక్తులు, ఆనందోత్సాహాలు చెప్పుకోదగ్గ విధంగా లేవు. అందునా నెల్సన్ మండేలా కీర్తిశేషుడయి కూడా చాలా కాలమయింది. 2025లో దక్షిణాఫ్రికా క్రికెటర్లు ఆడిన టెస్ట్ మ్యాచ్‌లపై టెంబా బవుమా ప్రధాన పాత్రగా ఒక ఫీచర్ ఫిల్మ్ రావడమనేది చాలా అసంభవం. అయితే యువతరానికి చెందిన దక్షిణాఫ్రికా రచయిత (లేదా యువ భారతీయ రచయిత) ఎవరైనా ఈ టెస్ట్ మ్యాచ్‌ల గురించి ఒక స్ఫూర్తిదాయక పుస్తకం రాయాలని ఆశిస్తున్నాను. ఒక కీలక విషయంలో 2025 క్రికెటర్లు 1995 నాటి రగ్బీ ఆటగాళ్ల కంటే మరింత ముఖ్యమైన విజయాన్ని సాధించారనే వాస్తవాన్ని ఆ సంభావ్య రచయిత తప్పక గుర్తిస్తాడని నేను భావిస్తున్నాను. 2025 దక్షిణాఫ్రికా క్రికెట్ టీమ్‌లో మూడు దశాబ్దాల నాటి రగ్బీ టీమ్‌లో కంటే జాతిపరమైన వైవిధ్యం మరింతగా ఉన్నదనేదే ఆ వాస్తవం. పైగా ఈ నిజమైన 'ఇంద్ర ధనస్సు జట్టు'ను నల్లజాతీయుడు అయిన కెప్టెన్ ప్రతిభావంతంగా విజయ శిఖరాలకు నడిపించాడు.

టెస్ట్ క్రికెట్ నా తరం వారు అభిమానించిన క్రికెట్ ఫార్మాట్. ఇప్పుడు నేను వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. జాతీయవాద సంకుచితత్వాలు లేని క్రికెట్ అభిమానిగా టెంబా బవుమా జట్టును అభినందిస్తున్నాను. ఈ అభినందనలో భాగంగా జాతి వివక్షా పాలనానంతర దక్షిణాఫ్రికా క్రికెటర్లలో 11 మంది సార్వకాలిక అత్యుత్తమ ఆటగాళ్ల జాబితాను ప్రతిపాదిస్తున్నాను: 1. గ్రేమ్ స్మిత్ 2. హెర్షల్ గిబ్స్ 3. హషీమ్ ఆమ్లా (వైస్ కెప్టెన్) 4. జాక్వెస్ కలిస్ 5. టెంబా బవుమా (కెప్టెన్) 6. ఏబీ డివిల్లీర్స్ (వికెట్ కీపర్) 7. షాన్ పొలాక్ 8. డేల్ స్టెయిన్ 9. కేశవ్ మహరాజ్ 10. కగిసో రబాడ 11. అలెన్ ఆంథోనీ డొనాల్డ్. 12వ ఆటగాడు: జాంటీ రోడ్స్.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

గమ్యం చేరని స్వప్నాల గమనం

"జీవితాన్ని సమర్థించే కలలు కనకుండా మానవజాతి జీవించజాలదు"

– జోసెఫ్ కాంబెల్
("Mythes to live by" గ్రంథ రచయిత)

గత 25 సంవత్సరాల కాలక్రమంలో ఈ దేశంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను పరిశీలిస్తే, వివిధ రంగాల్లో జరిగిన అభివృద్ధిని నిరాకరించలేం. అయితే ఈ అభివృద్ధి, దేశంలోని పేదరికాన్ని నిర్మూలించి, శ్రమదోపిడీని అరికట్టి, కనీసం ఒక సంక్షేమ రాజ్యాన్ని కూడా స్థాపించలేదు. మరోవైపు పోరాడుతున్న సామాజిక పురోగామి శక్తులను అణచివేస్తున్న మతతత్వ ఫాసిస్టు పాలకుల మూలంగా, తిరిగి అవే ప్రశ్నలు మన ఎదుట నిలుస్తున్నాయి. ఈ దేశం ఎక్కడికెడుతున్నది? భారతీయులు కలలుగన్న సమసమాజ స్వేచ్ఛాయుత వ్యవస్థ ఏర్పడిందా? సామాజిక భద్రత, విద్య–వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చే ప్రజాతంత్ర వ్యవస్థ ఇంకా ఎంత దూరంలో ఉన్నది?

ప్రస్తుతం ఈ దేశంలో కొనసాగుతున్న Despotic rule ఏకపక్ష నియంతృత్వ పాలనకు ప్రజలు కూడా కారణం! కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వైఫల్యం వల్ల ఓటర్లు బీజేపీ వైపు మొగ్గుతున్నారు. దేశంలోని మెజారిటీ హిందువులు ఐక్యత పేరిట 'హిందుత్వ'ను ఆమోదిస్తున్నారు. సమాంతరంగా కార్పొరేట్ ధనిక వర్గాలకు అనుకూలంగా ఉన్న చట్టాల మూలంగా, పేదరికం– నిరుద్యోగం విస్తరిస్తున్నాయి. 2014 తర్వాత క్రమంగా మూఢనమ్మకాల మతవాద దృక్పథం వ్యాపించి, ఒక కొత్త విశృంఖల మూక, పాలక వర్గానికి వత్తాసుగా ఉంది.

ఈ దేశ సామాజిక వ్యవస్థలో అస్తిత్వ ఉద్యమాల తీరుతెన్నులు పరిశీలిస్తే, కులరహిత ఆదర్శ సమాజానికి చాలా దూరంలో ఉన్నాం. ఏ కులానికి ఆ కులం ఒక అభద్రతా భావంతో తమ ప్రత్యేక ఉనికిని చాటుకుంటూ రాజ్యాధికారంలో తమ భాగాన్ని కోరుకుంటున్నది. ఆధునికంగా సాంకేతిక పారిశ్రామిక అభివృద్ధి ఫలితంగా కులవృత్తులు చెల్లాచెదురైపోయాయి. విద్యావకాశాలు చేజిక్కించుకున్న కులాల్లోని విద్యావంతులు (రిజర్వేషన్ల మూలాన కొందరు) ఆయా కులాల ముద్రలతో మేధావుల, ప్రొఫెసర్ల, ఉపాధ్యాయ, విద్యార్థి తదితర సంఘాలతో సంఘటితమవుతున్నారు. ఈ పరిణామంతో ఆరెస్సెస్ ఆశిస్తున్న 'హిందుత్వ సంఘటిత శక్తి'కి దగ్గరవుతున్నారు.

బీసీలు, దళిత, షెడ్యూల్ తదితర కులాల సంఘాలన్నీ జనాభా దామాషా ప్రకారం ఉద్యోగాలలో, మంత్రివర్గంలో రిజర్వేషన్లు శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నాయి. దేశంలోని పెట్టుబడిదారీ దళారీ ఆర్థిక వ్యవస్థకు లోబడి ఈ సంఘాలన్నీ తమ ఉద్యమాలను నిర్వహిస్తున్నాయి. ఆర్థికంగా సామాజికంగా తమ కులానికి లేదా మతస్థులకు మేలు జరిగితే చాలుననే మనస్తత్వం (మరోవైపు తరతరాలుగా అగ్రకులాల ఆధిపత్య చరిత్ర ఉండనే ఉంది)– మౌలికంగా ఈ దేశంలోని రైతాంగాన్ని, శ్రామికులను, చేతివృత్తికారులను, కార్పొరేట్ పెట్టుబడి దళారీ విధానం ఎంతో సజావుగా దోచుకుంటూ సంపన్నులను పెంచి పోషిస్తున్న యదార్థాన్ని విస్మరిస్తున్నారు. తమ మతం–కులం–శాఖ చెక్కుచెదరకుండా ఇలానే నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థగానే కొనసాగాలనే తిరోగమన సంస్కరణ వాదంతో తృప్తిపడుతున్నారు. సకలజన ఉద్యమాలకు దూరంగా ఉంటున్నారు.



రాజకీయంగా ఇప్పుడు రావలసిన ప్రత్యామ్నాయ ప్రజాశక్తిగా కమ్యూనిస్టు పార్టీలు ఎర్రజెండా–నీలిజెండా మైత్రి కోసం ప్రయత్నిస్తున్నాయి. భవిష్యత్తులో ఐక్య సంఘటనగా ఇదొక ప్రయోగం. అయితే అంబేడ్కర్, పూలే అనుయాయులు మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథానికి, సిద్ధాంతాలకు అనుకూలంగా సమన్వయించుకోగలిగితేనే లాల్–నీల్ మైత్రి సుస్థిరం అయ్యే అవకాశాలున్నాయి.

> **స్వాతంత్ర్యం పొందిన తర్వాత కొన్ని తరాలు వెనక్కి పోగా, చైనాను మించిపోయిన జనాభాతో ఈ దేశం తను కలలు కంటున్న సమసమాజ, స్వేచ్ఛాయుత గమ్యం వైపు చూస్తున్నది. ఒక తత్వవేత్త చెప్పిన నిజం– "గుడ్డును వెలుపలి నుంచి పగులగొడితే జీవితం అంతం, కానీ లోపలి నుంచి పగిలితే జీవితం ప్రారంభం."**

1947లో దేశ విభజన జరిగి, స్వాతంత్ర్యం పొందిన తర్వాత కొన్ని తరాలు వెనక్కి పోగా, చైనాను మించిపోయిన జనాభాతో ఈ దేశం తను కలలు కంటున్న సమసమాజ, స్వేచ్ఛాయుత గమ్యం వైపు చూస్తున్నది. ఒక తత్వవేత్త చెప్పిన నిజం– "గుడ్డును వెలుపలి నుంచి పగులగొడితే జీవితం అంతం, కానీ లోపలి నుంచి పగిలితే జీవితం ప్రారంభం."

వేల సంవత్సరాల పురాతన సంస్కృతి–చరిత్ర ఉన్న భారత్‌లో వివిధ భాషలు, కులాలు, మతాలు అనేక సమస్యల మధ్య సహజీవనం సాగిస్తున్నాయి. మధ్యయుగాల నాటి అంధ విశ్వాసాలు, రాచరికాలను ప్రశ్నిస్తూ ఆయా దశల్లో మేల్కొన్న వారు– 'ఎక్కడికీ గమనం?' అని ప్రశ్నించుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికీకరణ విస్తరించిన దశలో ఆయా దేశ కాల పరిస్థితుల్లో ప్రజా విప్లవాలు వచ్చాయి. ఉదాహరణకు– ఫ్రెంచి, రష్యన్, బోల్షివిక్, జనచైనా విప్లవాలు– ఇప్పుడు సాంకేతికంగా డిజిటల్ యుగంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) కార్యకలాపాల తీరుతెన్నులను మార్చేస్తున్నాయి. అయితే ఆయా ఆలోచనలు– పాత సంస్కారాల ఒత్తిడిలో ఉన్న మనుషుల స్వార్థచింతన, అక్రమార్జన హింసా ప్రవృత్తి మారగలదా? ఇది నిరంతరంగా ఎదురు తిరిగే ప్రశ్న!


చారిత్రకంగా– రాజకీయంగా ఈ దేశంలో వచ్చిన పరిణామాలను పరిశీలిస్తే ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఈ దేశ ప్రజలు చేరవలసిన గమ్యం వైపు దిశానిర్దేశం చేసింది. తర్వాత నక్సల్బరీ–శ్రీకాకుళ పోరాటాలు గత 55 సంవత్సరాల కాలంలో రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రారంభమై, క్రమంగా అడవులకే పరిమితమై, కేవలం తుపాకీని మాత్రమే నమ్ముకుని దిశను కోల్పోయింది. ఈ చారిత్రక గుణపాఠాలు ఈ దేశంలో ఏనాటికైనా రానున్న ప్రజావిప్లవానికి సంకేతాలు. ఇక్కడి ప్రజలు, మారుతున్న తమ దేశ కాల పరిస్థితుల కనుగుణంగా ప్రజా పోరాటలతో మమేకమైన విప్లవ శక్తులతో, తమదైన రీతిలో ప్రజా విప్లవాన్ని సాధించగలరనేది ఒక చారిత్రక ఆశావాదం. చివరిగా జార్జి లూకాచే (హంగేరియన్ మార్క్సిస్టు తత్వవేత్త, విమర్శకుడు) ఈ ప్రపంచంలోని మనిషి పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేసిన వ్యాఖ్యలతో ముగిస్తున్నాను.

"మనిషి తన ప్రపంచాన్ని గుర్తించక తప్పదు. ఈ మానవాళిలో ఒకడిగా పాక్షికంగా తాను కూడా ఈ ప్రపంచాన్ని నిర్మించాడు. అందులో భాగంగానే తనదిగా దానిని అనుభవిస్తాడు. ఈ ప్రపంచమనే క్రమాన్ని కొనసాగించడానికి మనిషి తన వంతు ప్రత్యేకతను సంతరింపజేస్తాడు. నష్టం కానటువంటి సృజనాత్మక కళను శాశ్వతం చేస్తాడు. దాని అమేయమైన ప్రాభవం ఒక కళాఖండంగా (గొప్ప రచనగా) పరిఢవిల్లుతూ, మనిషి ప్రపంచ స్వరూపాన్ని తీర్చిదిద్దుతూ ఉంటుంది."

○ **నిఖిలేశ్వర్**

'క్రీమీలేయర్' కుట్రని ఛేదిద్దాం..!

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ వర్తింపజేయాలనే అభిప్రాయాన్ని అదేపనిగా వ్యక్తపరుస్తున్నారు. గత ఏడాది దేవేందర్‌సింగ్ వర్సెస్ పంజాబ్ స్టేట్ గవర్నమెంటు కేసులో, ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో ఉన్న జస్టిస్ గవాయి ఎస్సీ, ఎస్టీ క్రీమీలేయర్ అమలు చేయాలని తీర్పు కూడా రాశారు. బీజేపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి ఎస్సీ, ఎస్టీలలో వర్గీకరణను అమలు చేయాలని, క్రీమీలేయర్ వద్దని విన్నవించారు. వర్గీకరణ అంశంలో క్రీమీలేయర్ అమలు కాదని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. దీంతో, తీర్పులో క్రీమీలేయర్ అంశం మోదీ హామీతో కనుమరుగయింది. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు చేసిన ఎస్సీ వర్గీకరణ చట్టంలో క్రీమీలేయర్ లేకుండా రెండు ప్రభుత్వాలు జాగ్రత్తపడ్డాయి. అయినా గవాయి పట్టువదలని విక్రమార్కుడిలాగా ప్రతివేదిక మీద క్రీమిలేయర్ మంత్రాన్ని జపిస్తున్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 75 ఏళ్ళ తరువాత కూడా ఎస్సీ, ఎస్టీ, ఇతర ఉన్నతోద్యోగుల కుమారులకు రిజర్వేషన్లు అవసరం లేదని, వారినీ ఒక వ్యవసాయ కూలీ కుమారుడినీ ఒకేలా చూడటం సమంజసం కాదని, తరతరాలుగా కొన్ని కుటుంబాలవారే రిజర్వేషన్ల ఫలాలను అనుభవిస్తున్నారని అభియోగాలు మోపుతున్నారు. భారత పౌరసమాజం, రిజర్వేషన్ల వ్యతిరేకులు ఈ అభియోగాలకు మూక మద్దతు ఇస్తున్నారు.




న్యాయమూర్తిగా విశేష అనుభవం ఉన్న జస్టిస్ గవాయికి 'క్రీమీలేయర్' విధానం అశాస్త్రీయం, రాజ్యాంగ వ్యతిరేకం అనే విషయం తెలియదనుకోవటం భ్రమ. 'కోర్టు ముందున్న పత్రాల ఆధారంగా మా తీర్పులు ఉంటాయి' అని చెప్పిన గవాయి, రాజ్యాంగ వ్యతిరేక క్రీమిలేయర్ గురించి ఎవరి ప్రయోజనాల కొరకు తన తీర్పులో రాశారు? ఇక్కడ ప్రామాణికం రాజ్యాంగ పత్రమా, స్వీయ అభిప్రాయమా? ఆలోచనలు, ఆశయాలు చెప్పటానికి పనికి వస్తాయి. వాస్తవ పరిస్థితులను అనుసరించే ఆచరణ ఉంటుంది. ఎస్సీ ఉద్యోగి తన సంతానాన్ని ఎలాంటి ప్రభుత్వ సహాయం లేకుండా తన జీతం డబ్బులతో చదివిస్తాడు. ఉద్యోగం లేని ఎస్సీ, ఎస్టీల సంతతికి ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్ళు, ఉచితవిద్య, హాస్టళ్ళు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు, పోటీపరీక్షలకు ఉచితశిక్షణ అందిస్తుంది. రాజ్యాంగంలోని 16వ అధికరణ భారత పౌరులందరకూ ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకాలకు సమాన అవకాశాలు కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగానికి పోటీపడే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు విధిగా తమ సమూహంలో ప్రతిభను నిరూపించుకోవాల్సిందే. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తమ సంతానాన్ని చదివించి పెళ్ళి చేసేంతవరకే పోషిస్తారు. వివాహం అనంతరం తన కుటుంబ భారం సదరు క్రీమిలేయర్ ఉద్యోగి కుమారుడే మోయాలి. తండ్రి 'క్రీమీలేయర్' అనే సాకుతో కుమారులకు జన్మతః లభించిన రిజర్వేషన్ హక్కును తొలగించటం సహజ న్యాయసూత్రాలకు, రాజ్యాంగ మూలసూత్రాలకు విరుద్ధం. క్రీమీలేయర్ ఐఏఎస్ అధికారులకు పదవీ విరమణ అనంతరం 80 వేల రూపాయల వరకూ పెన్షన్ లభిస్తుంది. క్రీమీలేయర్ కుమారులు రిజర్వేషన్ హక్కు కోల్పోయి, ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందే పరిస్థితి లేనప్పుడు వీరంతా 80 వేల పెన్షన్‌తో బతకటం సాధ్యమా?

ఈ ఏడాది మే నెలలో విడుదల చేసిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్' గణాంకాల ప్రకారం దేశంలో ఎస్సీ ఐఏఎస్ అధికారులు 7.65శాతం, ఎస్టీ అధికారులు 3.80శాతం మాత్రమే ఉన్నారు. సెక్రటరీ హోదాలో 4.9శాతం మాత్రమే కొనసాగుతున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల సంఖ్య 2 కోట్ల 15 లక్షలని గణాంకాలు తెలుపుతున్నాయి. దాని ప్రకారం ఎస్సీ ఉద్యోగులు 30 లక్షలమంది ఉండాలి. కానీ, 5 లక్షల 47 వేలమంది మాత్రమే ఉన్నారు. ఎస్సీల పట్ల పాలకవర్గాల వివక్షకు ఈ గణాంకాలు నిదర్శనం.

> **తండ్రి 'క్రీమీలేయర్' అనే సాకుతో సంతానానికి జన్మతః లభించిన రిజర్వేషన్ హక్కును తొలగించటం సహజ న్యాయసూత్రాలకు, రాజ్యాంగ మూలసూత్రాలకు విరుద్ధం.**

బీసీలలో మాదిరిగా ఎస్సీలలో కూడా ఎ, బి, సి, డి వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో సుప్రీంకోర్టు ఏకీభవించి తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేస్తున్నాయి. వర్గీకరణవాదులు, వారి మద్దతుదారులు ఆశించినట్లుగా ఏ మేరకు అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందుతాయో భవిష్యత్ తెలుపుతుంది. అయితే బీసీలలో 1992 నుంచి వర్గీకరణ, క్రీమీలేయర్ అమలవుతోంది. అనధికారిక సమాచారం ప్రకారం కేంద్ర జాబితాలలో 2,639 బీసీ కులాలున్నాయి. వీటిలో కేవలం 40 కులాలు మొత్తం రిజర్వేషన్‌లో 50 శాతం అవకాశాలు దక్కించుకున్నాయి. 994 కులాలు ఒక్క ఉద్యోగాన్ని, ఒక్క విద్యాసీటునూ పొందలేదు. 1400 కులాలకు ఒక శాతం కంటే తక్కువ ప్రాతినిధ్యం లభించింది. ఎస్సీ కులాలలో కూడా వర్గీకరణ, క్రీమీలేయర్ అమలు వలన మరింత దిగజారుడు ఫలితాలు మాత్రమే లభిస్తాయి. షెడ్యూలు కులాల పురోగతి అడ్డుకోవడానికి, అందుతున్న ఆ అరకొర అవకాశాలు కూడా దక్కకుండా చేయడానికి పాలకవర్గాలు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అందులో భాగంగా 1965 లోకూర్ కమిటీ మొదలు, నేటి వరకూ ఎస్సీల రిజర్వేషన్లు విచ్ఛిన్నం చేయటానికి వివిధ రాష్ట్రాలలో 11 కమిషన్లు వేశారు. 1951లో చంపకమ్ దొరైరాజన్ కేసు నుంచి నేటి వరకు 28 కేసులు వ్యతిరేకంగా నడిచాయి. షెడ్యూల్డు కులాల ప్రజల, విద్య, ఉద్యోగ, సంక్షేమ, రక్షణ చట్టం, పదోన్నతులలో ఉన్న రాజ్యాంగ అవకాశాలను అణచివేయటానికి సహోదర భారతీయ హిందూ అగ్రకులాల వాళ్ళు అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు అసలు రిజర్వేషన్లే ఉండకూడదనే ఆలోచన హిందూ పౌర సమాజంలో నెలకొంది. దానికి నాందీ ప్రస్తావనగా జస్టిస్ గవాయి తీర్పు వ్యాఖ్యలు పరిగణించవచ్చు. రానున్న కాలంలో రిజర్వేషన్ వ్యతిరేక వాదనలు మరింత విస్తృతమవుతాయి. ఎస్సీ, ఎస్టీలు తమ రాజ్యాంగ హక్కులు కాపాడుకోవడం కోసం, అంబేడ్కర్ బాటలో మరింత చైతన్యం, మరింత పోరాటం, మరింత ఐక్యతతో ముందుకు సాగాలి.

● **మల్లెల వెంకట్రావు**
వ్యవస్థాపకులు, మాల మహాసభ





జంగిల్ జర్నీ

ఆహ్లాదకరంగా మూలపాడు బటర్ ఫ్లై పార్కు

- సిద్ధమవుతున్న జిప్‌లైన్.. సఫారీ వాహనాలు
- ఎనిమిది కి.మీ. అడ్వెంచర్ టూర్ కోసం ఏర్పాట్లు



జిప్‌లైన్ ఏర్పాటు పనులు

మూలపాడు బటర్ ఫ్లై పార్కు అందంగా ముస్తాబవుతోంది. అడ్వెంచర్ టూర్ కోసం అటవీ ప్రాంతంలో ఏర్పాట్లు చకాచకా జరిగిపోతున్నాయి. ఇప్పటికే పచ్చదనాన్ని పెంపొందించి, చిన్నారుల ఆటపరికరాలను సిద్ధం చేశారు. అలాగే ట్రెక్కింగ్ ఏర్పాట్లు కూడా చేశారు. అయితే పర్యాటకులకు మరింత అనుభూతిని పంచేందుకు భూమికి 100 మీటర్ల ఎత్తులో ఉండే రెండు కొండల మధ్య 350 మీటర్ల పొడవున జిప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు కొండల మధ్య లైన్‌పై రాకపోకలు సాగించేందుకు రెండు వరుసలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఇవి ప్రయోగాత్మక దశలో ఉన్నాయి. మరో పది రోజుల్లో పర్యాటకులకు అందుబాటులోకి వస్తాయి. అలాగే, పర్యాటకులను అడవుల్లోకి తీసుకెళ్లేందుకు రెండు సఫారీలను అందుబాటులో ఉంచారు. బటర్ ఫ్లై పార్క్ నుంచి ఘాట్‌రోడ్ల మీదుగా ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని అభయాంజనేయస్వామి దేవస్థానం వరకు తీసుకెళ్తారు. మార్గంమధ్యలో అడవుల అందాలను కనులారా వీక్షించవచ్చు. వాటర్ ఫాల్స్‌ను చూడొచ్చు. - **ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ**



సిద్ధమైన సఫారీలు



కృష్ణాజిల్లాలోని తోట్లవల్లూరులో ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు



దిత్వా టెన్షన్

నేడు, రేపు జిల్లాలో మోస్తరు వర్షాలు

అన్నదాతల్లో ఆందోళన • జిల్లాలో పూర్తికాని వరికోతలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను కారణంగా జిల్లావ్యాప్తంగా ఆది, సోమవారాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాతీరం వెంబడి 45-65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర శ్రీలంక మీదుగా కొనసాగుతున్న దిత్వా ఉత్తరం వైపునకు కదులుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఆందోళన చెందుతున్న రైతులు

తుఫాను హెచ్చరికలతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ దశలో వర్షాలు పడి, గాలులకు పంట నేలవాలితే పాడయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటి వరకు ఒక్క తిరువూరులోనే 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. గంపలగూడెం, రెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో 30 శాతం మాత్రమే ముగించారు. కోసిన పంటను ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించారు. మరో వారంలో కోతలు ముమ్మరంగా కొనసాగే అవకాశం ఉంది. ఈ దశలో దిత్వా ముప్పు నుంచి బయట పడితే చాలని అన్నదాతలు భావిస్తున్నారు.

ఆ భూమి ఎవరిది?

ట్రాన్స్‌కోకు చెందిన రూ. 100 కోట్ల ఆస్తిహక్కుపై సందిగ్ధం

- 35 ఏళ్ల కిందట కొన్న భూమి.. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ లేదు
- నాడు కేవలం చేతి రశీదుతో 25 ఎకరాలు కొన్న ట్రాన్స్‌కో
- నాడు దాని విలువ రూ.17 లక్షలు.. నేడు రూ.వంద కోట్లు
- ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలనే డిమాండ్

నున్నలో రూ.100 కోట్ల విలువచేసే ట్రాన్స్‌కో స్థలానికి ఏ దిక్కూ లేకుండా పోయింది. మూడున్నర దశాబ్దాల కిందట ట్రాన్స్‌కో (అప్పట్లో ఏపీఎస్‌ఈబీ) కొన్న 27 ఎకరాలకు ఇప్పటికీ చేతి రశీదు తప్ప మరో ఆధారం లేకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం.. పీజీసీఎల్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఆ భూమి పరిస్థితి ఏమిటి? అనే సందిగ్ధం నెలకొంది.



నున్నలో అప్పట్లో ఏపీఎస్‌ఈబీ కొన్న 25 ఎకరాల భూమి (పసుపు రంగు)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) 1989, జూలై 15న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నున్నలో సర్వే నెంబర్లు 589, 590, 591, 592, 593, 594, 672, 673, 674, 675లోని పలు సబ్ డివిజన్ల పరిధిలో 127.86 ఎకరాలను రూ.79.15 లక్షలకు కొనింది. అలాగే, 1990లో ఏపీఎస్‌ఈబీ (ట్రాన్స్‌కో) రూ.17 లక్షలకు ఎన్‌టీపీసీ భూముల్లో 27 ఎకరాలు కొనింది. అప్పట్లో ఎన్‌టీపీసీకి ఏపీఎస్‌ఈబీ (ట్రాన్స్‌కో) డబ్బు ఇచ్చి భూములను స్వాధీనం చేసుకుంది. ఆ భూముల్లో 27 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. కొన్న భూములకు సంబంధించి అప్పట్లో కేవలం రశీదును మాత్రమే పొందింది. ఎన్‌టీపీసీ నుంచి ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునే విషయంలో అప్పట్లో ఏపీఎస్‌ఈబీ (ట్రాన్స్‌కో) అధికారులు అలసత్వం చూపారు. నాటి నుంచి ఇప్పటి వరకు ట్రాన్స్‌కోకు డాక్యుమెంట్ల పరంగా బదలాయింపు జరగలేదు.

నాడు కొన్నది రూ.17 లక్షలు..

నేడు రిజిస్ట్రేషన్‌కు రూ.4 కోట్లు

నున్నలోని ఈ 27 ఎకరాల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.100 కోట్లు. ఆ రోజుల్లో ఏపీఎస్‌ఈబీ (ట్రాన్స్‌కో) రూ.17 లక్షలతో ఈ 27 ఎకరాలు కొన్నది. అప్పుడే రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే రూ.లక్షలలోపే ఖర్చయ్యేది. అప్పట్లో జరిగిన నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించు కోవాలంటే సుమారు రూ.4 కోట్లకు పైగా ఖర్చు అవుతుంది.

ఎన్‌టీపీసీ నుంచి పీజీసీఐఎల్‌కు బదలాయింపు

కేంద్ర ప్రభుత్వం ఎన్‌టీపీసీ స్థానంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)ను తీసుకొచ్చింది. 1992లో ఎన్‌టీపీసీ కొన్న 127.86 ఎకరాలను పీజీసీఐఎల్‌కు బదలాయించింది. ఈ భూముల్లో 27 ఎకరాలు ఏపీఎస్‌ఈబీ (ట్రాన్స్‌కో) కొన్నప్పటికీ ఆ భూములను ఎన్‌టీపీసీ మాత్రం పీజీసీఐఎల్‌కు బదలాయింపు చేసింది. కనీసం అప్పుడైనా ఏపీఎస్‌ఈబీ (ట్రాన్స్‌కో) అధికారులు తాము కొన్న భూములను బదలాయించమని అడగలేదు. ఇలా 1990 నుంచి 2025 వరకు 35 ఏళ్లపాటు ట్రాన్స్‌కోకు ఆ భూములు అధికారికంగా దాఖలు కాలేదు. ఇప్పటికీ ఎఫ్‌ఎంబీ, అడంగల్, పాస్‌బుక్, 1బీ వంటివి లేవు.

బంగారం మోసం

వన్‌టౌన్‌లో ఓ వ్యాపారి రూ.2.60 కోట్లకు కుచ్చుటోపీ

- పలువురు వ్యాపారుల వద్ద బంగారం తీసుకుని..
- మొహం చాటేసిన వ్యాపారి..
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని ఓ హోల్‌సేల్ వ్యాపారి సుమారు రూ2.60 కోట్లకు పైగా విలువచేసే రెండు కేజీలకు పైగా బంగారం తీసుకుని ఎగనామం పెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటపడింది. ప్రస్తుతం సదరు వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. వివరాలు.. భవానీపురంలో నివాసముంటున్న బాధితుడు నరేంద్రసింగ్ వన్‌టౌన్ పులిపాటివారి వీధిలో బంగారం హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి రాంగోపాల్ వీధిలో ఉన్న ప్రకాశ్ జ్యూయలరీ దుకాణం యజమాని ప్రకాశ్‌తో వ్యాపారంపరంగా పదేళ్లుగా పరిచయం ఉంది. ప్రకాశ్ పలువురు వ్యాపారుల వద్ద హోల్‌సేల్‌గా బంగారం తీసుకుని ధరతో సంబంధం లేకుండా తీసుకున్నంత బంగారం రోజుల వ్యవధిలో వారికి ఇస్తుంటాడు. ఈ క్రమంలో ప్రకాశ్ గతనెల 12న నరేంద్రసింగ్ వద్ద 59 గ్రాముల బంగారం తీసుకెళ్లాడు. నాటి నుంచి ప్రకాశ్.. బంగారం కానీ, డబ్బు కానీ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. నరేంద్రసింగ్ గట్టిగా ప్రశ్నిస్తే తీసుకున్న బంగారం ఇవ్వను, ఏం చేసుకుంటావో చేసుకోమంటూ మిగతా 6లో..

బీపీఎస్ చేసుకోకపోతే చిక్కులే

భవిష్యత్తులో రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరగవు

కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారుల హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : అనుమతి లేని నిర్మాణాలకు చట్టబద్ధత చేసుకునే వెసులుబాటును కల్పించామని, దీన్ని శాశ్వత భవనాలు కలిగిన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సూచించారు. అమల్లోకి వచ్చిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) ద్వారా చట్టబద్ధత చేసుకోని భవనాలకు భవిష్యత్తులో అనేక చిక్కులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'బీపీఎస్ తుస్' కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు అప్రమత్తమై కార్యాలయంలో సమావేశమయ్యారు. బీపీఎస్ అవకాశాన్ని అనుమతి లేని, అక్రమ నిర్మాణదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెగ్యులరైజ్ చేయని భవనాల రిజిస్ట్రేషన్ లావాదేవీలను బ్లాక్ చేస్తామని, దీని కారణంగా విక్రయాలు నిలిచిపోతాయని, మ్యూటేషన్ నమోదు కాదని, ఎలాంటి ఆస్తి అయినా ట్రాన్స్‌ఫర్ పోర్టల్‌లో బ్లాక్ అవుతుందని హెచ్చరించారు. ఆమోదిత ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్న అనధికార అదనపు నిర్మాణాలు వెంటనే కూల్చివేస్తామని సూచించారు. వెంటనే బీపీఎస్ చేయించుకుంటే కూల్చివేతల నుంచి తప్పించుకోవచ్చని, భవనానికి శాశ్వత చట్టబద్ధత లభిస్తుందని, రిజిస్ట్రేషన్ లావాదేవీలు సాఫీగా జరుగుతాయని సూచించారు.

జడ్పీ సమావేశంలో హైడ్రామా

4 గంటల పాటు వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీల రచ్చరచ్చ

ప్రజలు, రైతుల సమస్యలపై పోరాడాల్సిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఆ విషయాన్ని పక్కనపెట్టి ఆందోళనకు దిగారు. తమకు, జడ్పీ చైర్‌పర్సన్‌కు సీఈవో విలువ ఇవ్వట్లేదని, జడ్పీ నిధులతో చేపట్టే 424 పనులను అకారణంగా నిలుపుదల చేశారని, ఈ పనులు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ నానా యాగీ చేశారు. వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు జడ్పీ సమావేశంలో పోడియం ఎదుట బైఠాయించడంతో 4 గంటల పాటు హైడ్రామా నడిచింది.

- జడ్పీ పనులు ఎలా రద్దు చేస్తారని యాగీ
- సీఈవోపై విరుచుకుపడిన చైర్‌పర్సన్, సభ్యులు
- కలెక్టర్ ఎంత వారించినా వినకుండా నినాదాలు
- వీడెవడు.. వాడెవడంటూ సీఈవోపై వ్యాఖ్యలు
- నిలిపివేసిన పనులకు అనుమతులివ్వాలని పట్టు
- తమాషాగా ఉందా.. అంటూ ఎమ్మెల్సీ మొండితోక మండిపాటు
- జరిగిన పనులకు బిల్లులిస్తామనడంతో గప్‌చుప్..!

జడ్పీ సర్వసభ్య సమావేశంలో పోడియం ఎదుట బైఠాయించిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శనివారం మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాల్లో జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతిపాదించిన అంశాలపై చర్చ జరగకుండానే సమావేశం ఆద్యంతం హైడ్రామా మధ్య నడిచింది. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులంతా ఖాళీగా కూర్చుండిపోయారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పెద్దల అండతో, ఎంపీలు, ఎమ్మెల్యేల సూచనతో జడ్పీ అధికారులు పరిపాలన సాగిస్తున్నారన్నారు. జడ్పీ నిధులు 24.37 కోట్ల అంచనాతో చేపట్టనున్న 424 పనులను నిధుల కొరత, పనులు ఇంకా ప్రారంభించలేదనే కారణంతో నిలిపివేస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారని మండిపడ్డారు. చైర్‌పర్సన్‌గా ఉన్న తనకు, సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండానే పాలన సాగుతోందన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు మిగతా 6లో..

అధికారులపై ఎమ్మెల్సీ ఫైర్

జిల్లా పరిషత్ నిధులను ఎమ్మెల్యేలు, ఎంపీలు సూచించిన పనులకు కేటాయించి, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సూచించిన పనులను నిలిపివేయటం ఎంతవరకు సబబని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. జడ్పీ నిధులతో చేపట్టే పనులను జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సూచించిన విధంగా కాకుండా, వాటిని నిలుపుదల చేయటంతో పాటు ఇంతసేపు వారు పోడియం ఎదుట బైఠాయించినా తగిన విధంగా స్పందించకపోవటం సమంజసం కాదని, అధికారులు తమాషాలు చేసున్నారని కలెక్టర్, జడ్పీ సీఈవోలను ఉద్దేశించి ఆగ్రహంగా అన్నారు. కలెక్టర్ కల్పించుకుని భావోద్వేగంగా మాట్లాడవద్దని హితవు పలికారు.

నాలుగు గంటల పాటు బైఠాయింపు

జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో పనులు రద్దు చేసిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావిస్తుండగానే, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పోడియం ఎదుటకు వచ్చి ఆందోళనకు దిగారు. సీఈవోను సస్పెండ్ చేయాలని, ఆయన నిరంకుశ వైఖరి నశించాలని, చైర్‌పర్సన్‌కు క్షమాపణ చెప్పాలని నినదించారు. అన్ని పనులు చేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సాయంత్రం 4.12 గంటల వరకు ఈ ఆందోళన సాగింది.

సమావేశంలో పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులు



41 అంశాలకు ఆమోదం

వీఎంసీ స్టాండింగ్ కమిటీలో నిర్ణయాలు

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 55 అంశాలకు గానూ 41 అంశాలకు ఆమోదం లభించింది. మూడు తిరస్కరణకు గురయ్యాయి. 8 అంశాలను ర్యాటీపై చేయగా, ఒక అంశాన్ని వాయిదా వేసి, మరో అంశాన్ని రికార్డు చేసి, ఇంకో అంశాన్ని ధ్రువీకరించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది.

టెండర్లపై తర్జనభర్జనలు

వన్‌టౌన్ బీఆర్పీ రోడ్డు పార్కింగ్, గవర్నరుపేట ఎన్టీఆర్ కాంప్లెక్స్ సెల్లార్ పార్కింగ్ టెండర్లను ఖరారు చేసేందుకు స్టాండింగ్ కమిటీ, సభ్యులు తర్జనభర్జనలు పడ్డారు. అక్టోబరులో జరిగిన దసరా ఉత్సవాల సమయంలో నగరపాలక సంస్థ ఎస్టేట్ విభాగం అధికారులు హడావిడిగా వన్‌టౌన్ బీఆర్పీ రోడ్డు పార్కింగ్‌కు టెండర్ పిలిచారు. ఒకే టెండర్ పడటంతో ఆమోదానికి గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో పెట్టారు. ఈ పార్కింగ్ టెండర్ పై అనేక ఆరోపణలు రావటంతో వాయిదా వేశారు. బీఆర్పీ రోడ్డు పార్కింగ్ టెండర్‌కు దాఖలు చేసిన కాంట్రాక్టర్ సుమారు రూ.49 లక్షలకు కోడ్ చేశారు. నిబంధనల ప్రకారం సింగిల్ టెండర్‌ను ఆమోదించకూడదు. తాజాగా జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ సింగిల్ టెండర్‌ను తిరస్కరించారు. ఇకముందు కూడా కనీసం ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసినట్లయితేనే స్టాండింగ్ కమిటీకి పంపాలని తీర్మానించారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు శీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమ్‌తున్నీసా, పుప్పాల కుమారి, సంబంధిత విభాగ అధికారులు పాల్గొన్నారు.

5 రోజులు..7 లక్షల మంది!
• భవానీ దీక్షల విరమణ 11 నుంచి.. 6

సీఎం చంద్రబాబు చొరవతో కంపెనీల వెల్లువ
• పట్టభద్రులు ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దాల్సింది ఉపాధి కల్పనాధికారులే : మంత్రి సుభాష్ 6

టైలర్ ప్రాణం తీసిన పోలీసుల అత్యుత్సాహం?
• తనయుడు ఇప్పించిన అప్పునకు తండ్రి వద్దకు పోలీసులు • ప్రాణాలు కోల్పోయిన తండ్రి

తిరుమలలో చిరుజల్లులు

▸ దట్టమైన మేఘాలతో పగలే చీకట్లు

తిరుమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో తిరుమలలో శనివారం వేకువజాము నుంచి చిరుజల్లులు కురిశాయి. ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పగలే చీకట్లు కమ్ముకున్నాయి. స్వామి దర్శనానికి వెళ్లేవారితో పాటు దర్శనం చేసుకుని వెలుపలకు వచ్చిన యాత్రికులు వానలో తడవక తప్పలేదు. మరోవైపు చలి విపరీతంగా పెరిగింది. కంపార్టుమెంట్లలో దర్శనం కోసం వేచివున్న భక్తులు చలికి ఇబ్బంది పడ్డారు. వీరికి టీటీడీ నిరంతరాయంగా వేడివేడి అన్నప్రసాదాలను అందిస్తోంది.

58 అడుగుల 'అమరజీవి' కాంస్య విగ్రహం

▸ ఏర్పాటుకు సన్నాహాలు: డూండీ రాకేశ్

వినుకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం అమరావతిలో 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోందని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ డూండీ రాకేశ్ తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలోని వాసవి కల్యాణ మండపంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎన్డీఏ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అమరావతిలో సుమారు 6.8 ఎకరాల విస్తీర్ణంలో పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని, భారీ కాంస్య విగ్రహం ఏర్పాటును ప్రతిపాదించడం హర్షణీయం. పెనుగొండను వాసవి పెనుగొండగా మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ పక్షం రోజుల్లో అమల్లోకి వస్తుంది' అని రాకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా స్మృతివనం లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.

ఈ వెండి కుక్కర్... డబుల్ డెక్కర్!

▸ తయారు చేసిన 'కోనసీమ' జిల్లా వాసి బ్రహ్మాజీ



అతిచిన్న డబుల్ డెక్కర్ ప్రెషర్ కుక్కర్

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిచిన్న డబుల్ డెక్కర్ ప్రెషర్ కుక్కర్ ఇది. దీనిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన తాళాబత్తుల బ్రహ్మాజీ తయారు చేశారు. వెండితో చేసిన ఈ కుక్కర్ బరువు 20గ్రాములు మాత్రమే. దాని ఎత్తు 4సెంటీమీటర్లు, వెడల్పు 2 సెంటీమీటర్లు. పది రోజుల వ్యవధిలో ఈ కుక్కర్‌ను ఆయన సిద్ధం చేశారు. ఇప్పటి వరకు బ్రహ్మాజీ 36 సూక్ష్మ వస్తువులను తయారు చేసి, పలు అవార్డులు దక్కించుకున్నారు. హర్యానాకు చెందిన సుఖ్‌జీ మాన్యుఫ్యాక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని సుఖ్‌బీర్‌సింగ్ బచ్చన్ దేశంలో డబుల్ డెక్కర్ ప్రెషర్ కుక్కర్ తయారీకి పేటెంట్ హక్కులు పొందారు. ఆయన సూచనల మేరకు బ్రహ్మాజీ ఈ సూక్ష్మ డబుల్‌డెక్కర్ ప్రెషర్ కుక్కర్‌ను తయారుచేశారు.

ఆపరేషన్ చేశారు.. బ్లేడ్ మర్చిపోయారు!

▸ తుని ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్వాకం


కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నా.., యువకుడికి తీసిన ఎక్స్‌రే

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సర్జరీ కోసం వచ్చిన ఒక యువకుడి కాలులో సర్జికల్ బ్లేడ్ మర్చిపోయి వైద్యులు కుట్లు వేశారు. ఆపరేషన్ అనంతరం యువకుడు తీవ్రమైన నొప్పితో బాధపడుతుండగా సర్జరీ చేసిన కాలుకు ఎక్స్‌రే తీయగా సర్జరీ చేసిన చోట బ్లేడ్ కనిపించడంతో అంతా అవాక్కయ్యారు. వెంటనే ఆపరేషన్ చేసి ఆ బ్లేడ్‌ను తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తుని మండలం ఎస్.అన్నవరం రామకృష్ణానగర్ ప్రాంతానికి చెందిన కొప్పిరెడ్డి చిన్నా అనే యువకుడు రెండేళ్ల క్రితం ప్రమాదానికి గురి కావడంతో విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సర్జరీ చేయించుకున్నాడు. ఆ సమయంలో వేసిన ప్లేట్‌లకు సంబంధించి బోల్ట్‌ను తీసివేయాలని వైద్యులు సూచించడంతో తుని ఏరియా ఆసుపత్రిలో సర్జరీ చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ తప్పిదం జరిగింది. దీంతో యువకుడికి మళ్లీ ఆపరేషన్ చేసి సర్జికల్ బ్లేడ్ తొలగించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణను వివరణ కోరగా వివరాలు తెలుసుకుంటున్నామని తెలిపారు.


నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పిన యువకుడిని చితకబాదిన యువతి బంధువులు

స్టేషన్ గేట్లకు తాళాలు వేసి యువకుడిని రక్షించిన పోలీసులు

నూజివీడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆ యువకుడికి గతంలోనే పెళ్లయింది. త్వరలో పెళ్లి కాబోతున్న ఓ యువతికి మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. అంతేగాక ఆ యువతితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను పెళ్లికొడుకు, ఇతర బంధువులకు పంపాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువతి బంధువులు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోనే ఆ యువకుడిని చితకబాదారు. దీంతో స్టేషన్ గేట్లకు తాళాలు వేసి పోలీసులు ఆ యువకుడిని రక్షించారు. ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. నూజివీడుకు చెందిన యువతికి ఆమె తల్లిదండ్రులు డిసెంబరు 25న వివాహం నిశ్చయించారు. అయితే ఇదే ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల డానియేల్ సోషల్ మీడియాలో ఆమెకు పరిచయం అయ్యాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మూడు రోజుల క్రితం ఇంటి నుంచి తనతో తీసుకెళ్లిపోయాడు. దీంతో యువతి తల్లిదండ్రులు నూజివీడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్, కాకినాడ, తణుకు తదితర ప్రాంతాలకు ఆ యువతిని డానియేల్ తీసుకెళ్లాడు. ఆమెతో సన్నిహితంగా దిగిన ఫొటోలను యువతి బంధువులకు, కాబోయే వరుడికి పంపినట్టు యువతి బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే ఆ యువకుడి జాడను గుర్తించిన పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని నూజివీడు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సమాచారం తెలుసుకున్న యువతి బంధువులు స్టేషన్ ప్రాంగణానికి చేరుకుని డానియేల్‌ను చితకబాదారు. హఠాత్తుగా జరిగిన దాడితో అప్రమత్తమైన పోలీసులు అతన్ని కాపాడేందుకు యువతి బంధువులను బయటకు పంపి స్టేషన్ గేట్లకు తాళాలు వేశారు. గతంలోనే వివాహమైన ఆ యువకుడు ప్రేమ పేరుతో మానసికంగా, శారీరకంగా తమ కుమార్తెను హింసించాడని యువతి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ వివరణ ఇస్తూ.. నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చే క్రమంలో ఆగ్రహానికి గురైన యువతి బంధువులు దాడి చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం వారిద్దరూ తమ సంరక్షణలోనే ఉన్నట్టు తెలిపారు.

బంగారం మోసం

(5వ పేజీ తరువాయి)

బెదిరిస్తున్నాడు. దీంతో నరేంద్రసింగ్ ఇటీవల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో మరికొందరు వ్యాపారుల వద్ద కూడా ప్రకాశ్ సుమారు రెండు కేజీల బంగారం తీసుకుని తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. నరేంద్రసింగ్ పోలీసులను ఆశ్రయించటంతో మరికొందరు బాధితులు కూడా ముందుకొచ్చి ప్రకాశ్‌పై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కాగా, పోలీసులు ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకుని ఎవరెవరి దగ్గర ఎంతెంత బంగారం తీసుకున్నాడు, ప్రకాశ్‌కు ఎవరైనా డబ్బు కానీ, బంగారం కానీ ఇవ్వాలా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. నగరంలోనే కాకుండా.. ముంబయితో పాటు పలు ప్రాంతాల్లో ప్రకాశ్ ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నాడని బంగారం వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ప్రకాశ్ తీసుకున్న సమయంలో బంగారం ధర తక్కువగా ఉంటోందని, తిరిగి ఇచ్చే సమయంలో బంగారం ధర పెరగటంతో నష్టపోతున్నాడని బాధితుడు పోలీసులకు చెబుతున్నట్లు తెలిసింది.

5 రోజులు..7 లక్షల మంది!

● భవానీ దీక్షల విరమణ 11 నుంచి ● ఆర్జిత సేవలు రద్దు ● 15వ తేదీన మహా పూర్ణాహుతితో ముగింపు


సమీక్షా సమావేశంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరిగే భవానీ దీక్షల విరమణకు ఏడు లక్షల మంది భవానీలు వస్తారని అంచనా అని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఈవో వి.కె. శీనా నాయక్ అన్నారు. ఆలయ ఉద్యోగులతో శనివారం భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

> భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, విశ్రాంతి హాళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రసాదం, అన్నదానం పంపిణీ కౌంటర్లు

భవానీ దీక్షల విరమణకు అనుసరించాల్సిన విధివిధానాలు, భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు అవగాహన కల్పించారు. అధికారులు సమన్వయంతో పని చేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. భవానీ దీక్షల విరమణ డిసెంబరు 11వ తేదీ ఉదయం 8 గంగలకు ప్రారంభమై 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతితో ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రతిష్ఠాపన, శత చండీయాగం, గిరి ప్రదక్షిణలు వంటి ప్రధాన అంశాలుంటాయన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, విశ్రాంతి హాళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రసాదం, అన్నదానం పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్ఠమైన భద్రత చేయాలన్నారు. భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో డిసెంబరు 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలను తాత్కాలికంగా రద్దు చేసి, ఏకాంతంగా నిర్వహిస్తారు. భవానీ మండల దీక్షలు నవంబరు 1 నుంచి 5 వరకు, అర్ధ మండల దీక్షలు నవంబర 21 నుంచి 25 వరకు జరిగాయన్నారు. డిసెంబర్ 4వ తేదీన కలశజ్యోతి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భవానీ దీక్షల విరమణలో భాగం గా మూడు హోమగుండాలు ఏర్పాటు చేస్తారు. గత సంవత్సరం 18 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేయగా, ఈసారి సుమారు 30 లక్షల ప్రసాదాలు తయారు చేయాలని అంచనా వేశారు. బస్సుస్టేషన్, రైల్వే స్టేషన్లతో కలిపి మొత్తం 19 ప్రసాదం విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. కేశఖండనశాలలో ఈ సేవలకు 950 మంది క్షురకులు (బార్బర్లు) అందుబాటులో ఉంటారు. ఈసారి దోబీ ఘాట్ వద్ద అదనంగా కేశఖండనశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురుభవానీలను ప్రత్యేకంగా నమోదు చేస్తారు. విధుల్లో ఉండే సిబ్బందికి, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చే సిబ్బందికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు జారీ చేస్తామన్నారు. తొమ్మిది కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు మార్గదర్శనం కోసం బోర్డులు ఏర్పాటు చేస్తారు. అన్నదానం మెనూ బోర్డును ప్రదర్శిస్తారు. ఇంజనీరింగ్ విభాగం చేపట్టాల్సిన అన్ని పనులు పండుగకు ఒక వారం ముందుగానే పూర్తి చేస్తారు. చేసిన పనులన్నింటినీ ఒక మ్యాప్‌లో ప్రదర్శిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూడు వేల మందికి పైగా పోలీసులు, 300లకు పైగా సీసీటీవీ కెమెరాలతో పటిష్ఠమైన భద్రత ఏర్పా టు చేస్తారు. భక్తుల సౌకర్యార్థం దర్శనం, ప్రసాదం కౌంటర్లు, గిరి ప్రదక్షిణ మార్గం వివరాలతో కూడిన భవానీ దీక్ష - 2025 మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ఈ సమావేశంలో కార్యనిర్వాహక ఇం జనీర్లు 1, 2, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్-1, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఆరుగురు, సూపరింటెండెంటు-13 మంది, గుమస్తాలు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బాలకోటయ్య

ప్రజా రాజధాని అభివృద్ధి కోసమే రెండో విడత భూసమీకరణ

అమరావతిపై మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదు : బాలకోటయ్య

గాంధీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిని మరింతగా అభివృద్ధి చేసేందుకే రెండో విడత భూసమీకరణను ప్రభుత్వం చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య స్పష్టం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మొదటి విడత మాదిరిగానే రాజధాని ప్రాంతంలోని ఏడు గ్రామాల పరిధిలో రైతులను ఒప్పించి 16,666 ఎకరాల భూసమీకరణ చేస్తుందన్నారు. అమరావతిలో ఏదో జరిగిపోతుందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. అమరావతిపై మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. రాజధానిలో రైతు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీనికోసమే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో త్రి సభ్య కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. తొలివిడత, రెండో విడతలో భూములిచ్చిన రైతులకు నష్టం జరగదన్నారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు గంధం సంపత్‌కుమార్, అమరావతి రైతు నాయకుడు కుమ్మరి కోటేశ్వరరావు, బహుజన జేఏసీ నేతలు మామిడి సత్యం, వజ్రాల రవిశంకర్ పాల్గొన్నారు.


రక్త మార్పిడి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, డాక్టర్ సమరం

రెడ్‌క్రాస్ సేవలు అమోఘం

గాంధీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సంస్థ తలసేమియా వ్యాధిగ్రస్తులకు అమ్మలాంటిదని, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రోటరీ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తమార్పిడి కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉన్నతమైన ఆరోగ్య జీవితాన్ని అందించేందుకు రెడ్‌క్రాస్ నిస్వార్థంగా కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర గవర్నర్ దార్శినికతకు అనుగుణంగా సమిష్టి కృషితో రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. తలసేమీయా వ్యాధిగ్రస్తులకు రక్త మార్పిడితో పాటు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించి వైద్య నిపుణులు వివరించారు. ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ డాక్టర్ సమరం, వైస్ చైర్మన్ వి.జోషి, కార్యదర్శి చిట్టిబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్, హెమటాలజిస్ట్ అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలకు అవగాహన

గాంధీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిశ్రమ కేంద్రం ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ తయారీదార్లకు జెడ్ (జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్) పథకంపై అవగాహన శనివారం నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈ జెడ్ కోఆర్డినేటర్లు కనపర్తి అరుణ, దేశమాల ప్రియాంక మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈల అభివద్ధికి ఈ పథకం ఎంత కీలకమన్నారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లభించే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, నాణ్యాతాప్రమాణాలు, ఉత్పాదకత పెంపు అవకాశాలు తదితర అంశాలను వివరించారు. పరిశ్రమలను మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామన్నారు. జెడ్ సర్టిఫికేషన్ ద్వారా మార్కెట్‌లో పోటీ సామర్థ్యం పెంచుకునే విధానాన్ని తెలియజేశారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ గడువు పొడిగింపు

కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ప్ర దే శ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్ విజయవాడ వారి ఆదేశాల మేరకు సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను స్వీకరించుటకు గడువును పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తులను డిసెంబరు 3వ తేదీ లోగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు సాధికారత అధికారి, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ కార్యాలయంలో సమర్పించాలన్నారు. డిసెంబరు 7వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి శిక్షణకు ఎంపిక చయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థినీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇతర వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, ఏపీ బీసీ స్టడీ సర్కిల్, అశోక్‌నగర్, డోర్ నెం.74-2-1/5, పండరీపురం, రోడ్డు నెం.8, విజయవాడ, ఫోన్ నెంబర్లు 9966849937, 9505094349, 8688855255లో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

టైలర్ ప్రాణం తీసిన పోలీసుల అత్యుత్సాహం?

● పేట పోలీసులపై ఆరోపణలు ● తనయుడు ఇప్పించిన అప్పునకు తండ్రి వద్దకు పోలీసులు ● ప్రాణాలు కోల్పోయిన తండ్రి


అపార్ట్‌మెంటుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన వెంకటరావు

విజయవాడ/నందిగామ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : సివిల్ వివాదంలో జగ్గయ్యపేట పోలీసులు అత్యుత్సాహం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఓ రాజకీయ నాయకుడు చేసిన సిఫార్సుతో ఫిర్యాదు అందగానే పోలీసులు ఆగమేఘాల మీద స్పందించారు. ఫోన్ చేసి స్టేషన్‌కు విచారణ రమ్మనే అవకాశాన్ని పక్కన పెట్టేశారు. నేరుగా పరిధి దాటి వెళ్లి పోలీసు ఇజం చూపించారు. ఇదిప్పుడు కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

నందిగామలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద గల అపార్టుమెంట్ ఐదో అంతస్తులో వెంకటరావు (53) టైలరింగ్ చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమారుడు రాజేష్ హైదరాబాద్‌లో సినీపరిశ్రమలో ఉన్నా డు. వెంకటరావు కుమార్తె విజయవాడ మొగల్రాజపురంలో ఉంటోంది. జగ్గయ్యపేటకు చెందిన పుండరీకాక్షుడు అనే వ్యక్తి వద్ద వెంకటరమణ కుమారుడు రాజేష్ రూ.1.50 లక్షలు అప్పును తనకు పరిచయం ఉన్న వ్యక్తికి ఇప్పించాడు. ఇటీవల అప్పు ఇచ్చిన పుండరీకాక్షుడు మృతి చెందాడు. అతని కుమారుడు జస్వంత్ పలు మార్లు అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయన జగ్గయ్యపేట పోలీసులను ఆశ్రయిం చాడు. సాధారణంగా ఇటువంటి కేసుల్లో పోలీసులు ఫిర్యాదు తీసుకోగానే అవతలి వ్యక్తులకు ఫోన్ చేసి, విచారణ రావాలని స్టేషన్‌కు పిలిపిస్తారు. ఈ కేసులో మాత్రం జగ్గయ్యపేట పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శనివారం ఉదయం జగ్గయ్యపేట నుంచి పోలీసులు నందిగామలో ఉంటున్న వెంకటరావు ఇంటికి వెళ్లారు. ఆయన నుంచి ఫోన్‌ను లాక్కునే క్రమంలో పెనుగలాట జరిగిందని, ఆయన కాలు జారి పైనుంచి కింద పడిపోయాడని భార్య ఆరోపిస్తోంది. తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారని చెబుతోంది. ఐదో అంతస్తు నుంచి వెంకటరావు పడిపోవడంతో ఆయన రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. అంతర్గత అవయవాలకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆయనను వెంటనే అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాసుపత్రి తరలించారు. అత్యవసర విభాగంలో కొద్దిసేపు చికిత్స పొందిన వెంకటరావు మధ్యాహ్నం ప్రాణాలు కోల్పోయాడు. వెంకటరావు ఇంటికి రైటర్ భానుప్రసాద్ వెళ్లినట్టు సమాచారం. అయితే, జగ్గయ్యపేటలో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే పోలీసులు నందిగామ వెళ్లారని, వెంకటరావు పడిపోగానే హడావిడిగా వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **నందిగామ పోలీసుల వివరణ**
> దున్నా వెంకటరమణ మరణించిన ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నందిగామ పోలీసు లు చెబుతున్నారు. మృతుడి భార్య చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం ఏమిటన్నది దర్యాప్తులో తేలుతుందన్నారు


మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, హాజరైన వివిధ కళాశాలల ఉపాధి శిక్షణాధికారులు

సీఎం చంద్రబాబు చొరవతో కంపెనీల వెల్లువ

పట్టుభద్రులు ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దాల్సింది ఉపాధి కల్పనాధికారులే : మంత్రి సుభాష్

మొగల్రాజపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఏపీలో భారీగా పెట్టుబడులతో కంపెనీలు వస్తున్న తరుణంలో పట్టభద్రులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో ఉపాధి కల్పనాధికారుల పాత్ర ఎంతో కీలకమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఏపీ శిక్షణ, ఉపాధి అధికారుల సమాఖ్య, వీబీ సిద్ధార్థ కళాశాల సంయుక్తంగా శనివారం ప్లేస్‌మెంటార్- 2025 నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. దానిలో ఉపాధి అధికారుల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు డిసెంబరు 12, 13, 14 తేదీల్లో ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించే బిజినెస్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అన్నే ఇంద్రజిత్, ఇన్ఫోసిస్ విశాఖపట్నం సెంటర్ హెడ్ నర్రా సురే ష్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ విజయవాడ ఏఐ క్లబ్ అధ్యక్షుడు బొర్రా సురేష్ బాబు ప్రాంగణఎంపికల్లో విజయం సాధించడానికి అనుసరించడాల్సిన వ్యూహాలను మార్గనిర్దేశనం చేశారు. వీబీ సిద్ధార్థ కళాశాల డీన్ ఆచార్య రాజేష్ జంపాల, ఏపీ శిక్షణాధికారుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వి.సురేంద్రబాబు, కార్యదర్శి జగదీష్, సంయుక్త కార్యదర్శులు కావూరి శ్రీధర్ హిమబిందు, సభ్యులు శివ నాగేశ్వరరావు, 80 కళాశాలల ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ సమావేశంలో హైడ్రామా

(5వ పేజీ తరువాయి)

సూచించిన పనులకు జడ్పీ నిధులు రూ.8 కోట్లకు పైగా కేటాయించి, మరో పది నెలల్లో పదవీకాలం పూర్తికానున్న జడ్పీటీసీ సభ్యులు సూచించిన 424 పనులను నిలిపివేశారని ఆమె మండిపడ్డారు.

కలెక్టర్‌పై విమర్శలు

జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు కలెక్టర్ బాలాజీ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిధుల కొరత కారణంగానే పనులను నిలుపుదల చేస్తున్నట్టుగా చూపారని, ఈ ఏడాది జడ్పీకి రూ.8 కోట్లలోపే వివిధ రూపాల్లో నిధులు సమకూరాయని, నిధులు అందుబాటులో లేకుండా పనులు చేయిస్తే, కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో ఇవ్వడానికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయిస్తే సీఈవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దీనికి సభ్యులు మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు సూచించిన పనులను రద్దు చేయాలని, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సూచించిన పనులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ మరోమారు కలగజేసుకుని జడ్పీ సీఈవోకు, పంచాయతీరాజ్ విభాగం అధికారులకు మద్దతుగా కలెక్టర్ మాట్లాడుతున్నారని, ప్రజలతో నేరుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కలెక్టర్ విలువ ఇవ్వట్లేదని చెప్పడంతో సభ్యులు మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. జడ్పీ సీఈవో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తీర్మానం చేసి తనకు పంపాలని, ఆ తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపుతానని కలెక్టర్ తెలిపారు. తనకు 15 రోజులు సమయం ఇస్తే విజిలెన్స్ అధికారులతో మాట్లాడి ప్రాధాన్యతాక్రమంలో బిల్లులు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. అయినా సభ్యులు వినలేదు.

జడ్పీ సీఈవోపై పరుష పదజాలం

సభ్యుల్లో ఒకరిద్దరు.. జడ్పీ నిధులతో చేపట్టిన పనులను నిలిపివేయడానికి జడ్పీ సీఈవోకు ఏం అధికారాలు ఉన్నాయని, పనులు రద్దు చేయటానికి వీడెవడు, వాడెవడు అంటూ పరుష పదజాలాన్ని ఉపయోగించారు. దీంతో జడ్పీ సీఈవో కన్నమనాయుడు మాట్లాడుతూ సభా మర్యాదను ప్రతి ఒక్కరూ పాటించాలని, తనపట్ల పరుష పదజాలం ఉపయోగించటం భావ్యం కాదని, జడ్పీలో నిధులు అందుబాటులో లేని కారణంగానే పనులను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని, ఈ అంశంపై ఏమైనా అభ్యంతరాలుంటే నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని, తాను తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి పొరపాటు లేదన్నారు.

పనులు జరిగితే సరిదిద్ది అనుమతులు ఇస్తాం

జడ్పీ నిధులు రూ.24.37 కోట్లతో గతంలో అనుమతిచ్చిన పనులు కొనసాగుతాయని, ఇంజనీరింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం జరిగిన పనులకు బిల్లులు మంజూరు చేస్తామని జడ్పీ సీఈవో తెలిపారు. దీంతో సభ్యులు పోడియం ఎదుట నుంచి వెళ్లిపోయారు. అనంతరం జరిగిన చర్చలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ జడ్పీ సీఈవో మాటపై తమకు నమ్మకం లేదని, కలెక్టర్ ఈ అంశంపై పూర్తిస్థాయి బాధ్యత వహించాలని కోరారు.

పనులకు అనుమతులు ఇస్తున్నట్లు జారీచేసిన ఉత్తర్వులను సభ్యులకు చూపాలన్నారు. దీనికి జడ్పీ సీఈవో స్పందిస్తూ.. జడ్పీ నిధులతో చేపట్టిన పనులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీచేశామని, పనులు జరిగితే వాటికి బిల్లులు మంజూరు చేస్తామని జారీచేసిన ఉత్తర్వులను చదివి వినిపించారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

నేడు ఆటోనగర్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సెక్షన్ 11కేవీ ఐలా ఫీడర్ పరిధిలో పాత విద్యుత్ లైన్లు తీసి కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా ఆదివారం ఆటోనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ పి. హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్ ఒకటి, రెండు క్రాస్ మధ్య 4, 5, 6 రోడ్లు, రెండు, మూడు క్రాస్ మధ్య 4, 5, 6 రోడ్లు, మూడో క్రాస్ 4, 5, 6 రోడ్లు, నాల్గో క్రాస్, ఐదో క్రాస్, కాటారోడ్డు, 4, 5 క్రాస్ ఐదో రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దాసాంజనేయ స్వామికి విరాళం



గుణదల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాచవరంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో గుణదల నివాసి కామినేని సుబ్రహ్మణ్యేశ్వరరావు, మారుతీబాయ్ దంపతులు లక్ష రూపాయల విరాళం ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరికి శనివారం అందజేశారు. ఆలయం దినదినాభివృద్ధి చెందడానికి భక్తుల నుంచి సహాయ సహకారాలు అందడమే కారణమని ఈవో తెలిపారు.

4న హుండీల లెక్కింపు

మాచవరంలోని దాసాంజనేయస్వామి ఆలయంలోని హుండీలను డిసెంబరు 4న ఉదయం 9గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. హుండీల లెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తిగల భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని కోరారు.

వేమన సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రాణిగారితోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట సుందరయ్య గ్రంథాలయంలో శనివారం వేమన సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన సాంస్కృతిక వేదిక కన్వీనర్ ఎస్.హరినారాయణ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే మంచి వైద్యం అందుబాటులో ఉందని, ఈ క్యాంప్‌లో రూ.4500విలువగల క్యాన్సర్ టెస్టులు ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీజీ వైద్య బృందం, వేదిక కో కన్వీనర్ టి.చంద్రశేఖర్, వై.కృష్ణ, కోటిరెడ్డి, ఈశ్వర్, మోహనరావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

108 భవనంలో టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభం

రాణిగారితోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట 18వ డివిజన్ సిమెంట్ గోడౌన్ ఎదురు 108 భవనంలో టాయిలెట్ల నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. గత రెండున్నర సంవత్సరాలుగా 108ఉద్యోగులు ఎదురు చూస్తున్న టాయ్‌లెట్‌ల నిర్మాణం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చొరవతో ప్రారంభమైంది. 108 ఉద్యోగులు టాయిలెట్ లేక ఇబ్బందులు పడుతున్న విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే ఇచ్చిన మాటీ ప్రకారం టాయ్‌లెట్స్ నిర్మాణాన్ని శనివారం ప్రారంభించారు. ఈ మరుగుదొడ్ల నిర్మాణ పనులను టీడీపీ డివిజన్ నాయకులు పరిశీలించారు.



కృష్ణలంక శ్మశానవాటిక, పనిచేయని మార్చురీ బాక్సులు, ధ్వంసమైన చితి దహన సంస్కార ఘాట్లు

సమస్యల సుడిలో కృష్ణలంక స్వర్గపురి

● పనిచేయని మార్చురీ బాక్సులు, మినరల్ వాటర్ ప్లాంట్‌లు ● పంపులకు షవర్లు లేని వైనం ● నత్తనడకన గ్రీనరీ పనులు

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: కృష్ణలంక శ్మశానవాటిక సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడికి నిత్యం 10కి పైగా మృతదేహాలు దహన సంస్కారాల నిమిత్తం తీసుకొస్తున్న సందర్భంలో వెంట వచ్చే వారికి అవసరమైన సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. కృష్ణలంక శ్మశానవాటికిలో ఉచిత విద్యుత్ శ్మశానవాటికతో పాటు అతితక్కువ ఖర్చుతో సంప్రదాయ చితి దహన సంస్కారం అందుబాటులో ఉండడంతో నగరంలో ఎక్కువ మంది ఇక్కడే దహనసంస్కారాలు చేస్తుంటారు. అయితే ఇక్కడ వసతులు అంతంత మాత్రమే ఉండడంతో ఇక్కడికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. స్వర్గపురిలో ఉన్న మార్చురీ బాక్సులు, మినరల్ వాటర్ ప్లాంట్‌లు దాదాపు ఆరు నెలలుగా పనిచేయకపోయినా వాటిని మరమ్మతులు చేయించేవారు లేరు. చితి దహన సంస్కారాలు నిర్వహించే గట్లతో పాటు గట్ల చుట్టూ ఉండే ప్లాట్‌ఫారమ్ కూడా పూర్తిగా ధ్వంసం కావడంతో ఇక్కడికి వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. దహన సంస్కారాలు పూర్తయిన అనంతరం వెంట వచ్చిన వారు స్నానం చేసే పంపులకు షవర్లు లేకపోవడం మరో సమస్య. వీటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రీనరీ పనులు: స్వర్గపురిలో గతంలో ఉన్న గ్రీనరీ ప్రస్తుతం కనిపించడం లేదు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నా అవి నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనుల్లో వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తవగా మిగిలిన పనులు అంతంత మాత్రమే.



మూలన పడ్డ వాటర్ ప్యూరిఫైర్

'కలయిక' సేవలు వినియోగించుకోండి

స్వర్గపురిలో కలయిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మార్చురీ, మృతదేహం తరలింపు కోసం వాహన సదుపాయం అందుబాటులో ఉంది. ఈ సేవల కోసం ఫోన్ నెంబర్ 6301491010 లో సంప్రదించాల్సి ఉంది.

మార్చురీ బాక్స్ సేవలు ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు అందుబాలో ఉంటాయి. ఇక ముఖ్యంగా ఉచిత వాహన సేవ విషయంలో బుక్ చేసుకున్న వారు వాహనం వచ్చిన వెంటనే అంతిమయాత్ర ప్రారంభిస్తే సమయం ఆదా అవడంతో పాటు మరొకరికి ఈ సేవలు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది.

పీఎంఏవై పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

● లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే గద్దె



లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కూటమి నాయకులు

పటమట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై ఎన్టీఆర్ గృహకల్ప పథకాన్ని అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. శనివారం అశోక్‌నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పీఎంఏవై ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణ పత్రాలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఆయన తన సొంత నిధుల నుంచి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులలో ఏమాత్రం అవకతవకలు జరిగినా కేంద్రం ఇంటి యజమానులకు భారీ జరిమానా విధిస్తుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఈ పథకం కింద ఇల్లు నిర్మించుకునే వారికి అవసరమైన ఇసుకను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ముమ్మనేని ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, బీజేపీ నాయకుడు కొలాపల్లి గణేష్, హౌసింగ్ ఈఈ డి. కపుల్, డీఈఈ విజయ్ బాబు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

● కార్పొరేటర్ దేవినేని అపర్ణ



భారతీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించడానికి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని 10వ డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ తెలిపారు. 10వ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ ఫన్‌టైం క్లబ్‌లో శనివారం ప్రజాదర్బార్ జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి స్థలాలు, కొత్త ఇల్లు నిర్మాణం, నూతన రేషన్ కార్డు, తదితర సమస్యలతో కూడిన 300అర్జీలను స్వీకరించామని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు ఎం జై. ప్రకాష్, టీ.పూర్ణచంద్ర రావు, పి.దర్శిత్, పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అప్రమత్తతతో అగ్నిప్రమాద తీవ్రతను తగ్గించొచ్చు

గుణదల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో అప్రమత్తంగా ఉంటే ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా అగ్నిమాపక అధికారి మాల్యాద్రి తెలిపారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరపాలకసంస్థ అగ్నిమాపక విభాగంఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గుణదలలోని రామ్స్ థియేటర్‌లో శనివారం జరిగింది. థియేటర్లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి అగ్నిప్రమాదం జరిగిన సమయంలో స్పందించాల్సిన తీరుపై శిక్షణ ఇచ్చారు. స్మోక్ అలారం ఎలా వస్తుంది, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి తదితర విషయాలను వివరించారు. అగ్నిప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

● వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్‌కుమార్

భారతీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఆంధ్ర లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జి.కిరణ్ కుమార్ అన్నారు. ఆంధ్ర లయోలా కళాశాల, ఫాదర్ గార్డన్ లైబ్రరీ ఆధ్వర్యంలో రష్మి బన్సాల్ రచించిన ఐ హావ్ ఏ డ్రీమ్ పుస్తక సమీక్ష కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల వినోదంతో పాటు విజ్ఞానం కూడా పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థిని జి.దామిని పుస్తక సమీక్ష చేశారు. లైబ్రరీ విభాగం అధ్యాపకుడు జి.ఏ. ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆంధ్ర లయోలా కళాశాల పుస్తక సంఘం ఆధ్వర్యంలో 12సంవత్సరాలుగా పుస్తక సమీక్ష సేవలను చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ డాక్టర్ ఎస్.మెల్కియర్, ఎస్‌జె. ప్రిన్సిపాల్ ఫాదర్ బి.సురేష్‌కుమార్, అధ్యాపకులు, జాయింట్ సెక్రటరీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మలాలో సైన్స్ ఫెయిర్



పటమట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మలా హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ సందర్శకులను అమితంగా ఆకట్టుకుంది. పటమట సీఐ పవన్ కిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా రెవరెండ్ సిస్టర్స్ బ్రాంచ్ డిమెల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ జిబి ఆంటోని మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శన వల్ల విద్యార్థులో సృజనాత్మక శక్తి, విమర్శనాత్మక ఆలోచన శక్తి పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు అనేక నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను విజయవంతం చేసినందుకు ఉపాధ్యాయులను, విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీనివాస్ రెబిల్ మాథ్యూ అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

రిటైర్డ్ పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు వీడ్కోలు పలుకుతున్న డీసీపీ సరిత

విజయవాడ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు ప్రజలకు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డులకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కేజీవీ సరిత ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. నగరంలోని కమిషనరేట్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్‌ఐ ఎన్.ఎస్.రంగనాథుడు, ఏఎస్‌ఐ కె.కోటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్.శ్రీనివాసరావు, ఎల్.బి.ఏసుపాదం, హోంగార్డ్ టి.శంకర్‌లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో సునీత, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, సురేష్‌రెడ్డి, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లకు పదోన్నతి

పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎల్.లక్ష్మణరావు, ఎస్.కె.బాషాలు ఏఎస్‌ఐగా, కానిస్టేబుల్స్ ఎం.వి.సుబ్బారెడ్డి, కె.శ్యామ్‌కుమార్‌లు హెడ్‌కానిస్టేబుల్స్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వారంతా సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును శనివారం మర్యాదపూర్వకంగా కలిసిమొక్కను అందజేశారు.

పారిశుధ్య నిర్వహణలో లోపం లేకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



బెంజిసర్కిల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. శనివారం బెంజిసర్కిల్, నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు, రాణిగారితోట ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాణిగారి తోటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహారంలో నాణ్యత, సమయపాలన, పారిశుధ్యం నిర్వహణ కచ్చితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని సూరంపల్లి పాలడుగు పార్వతీదేవి ఇంజనీరింగ్ కళాశాలలో కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల డీడీయూ-జీకేవై శిక్షణార్థులకు ఉపాధి అవకాశాలను అందించేందుకు రాష్ట్ర సీడ్ ఏపీ, కంచర్ల ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం యువత ఉపాధి విస్తరణకు ప్రాముఖ్యతనిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు కట్టుదిట్టమైన ప్రణాళికల వల్ల రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్‌పై చూపిస్తున్న నిబద్ధతకు స్పష్టమైన నిదర్శనమన్నారు. 10 ప్రముఖ కంపెనీలు రాగా మూడు జిల్లాల నుంచి 300 మందికి పైగా అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఎంపికైన వారికి కంపెనీ నియమక పత్రాలు అందజేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్, జేడీఎం సుమలత పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ ఎల్ఎల్‌బీ పరీక్షా ఫలితాల వెల్లడి

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ 2,6వ సెమిస్టర్ ఫలితాలను శనివారం పరీక్షల అధికారి డాక్టర్ సీ వీరబ్రహ్మాచారి వెల్లడించారు. ఎల్ఎల్‌బీ 2వ సెమిస్టర్‌లో 261 మంది హాజరు కాగా, 77.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా బీఏతో కూడిన ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్‌లో 88 మంది హాజరు కాగా 94.12 శాతం ఉత్తీర్ణులయ్యారు. బీఏఎల్ఎల్‌బీ 2వ సెమిస్టర్‌లో 131 మంది హాజరు కాగా, 87.79 శాతం ఉత్తీర్ణులయ్యారు.


విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్‌ను అభినందిస్తున్న సిద్ధార్థ వర్సిటీ చాన్సలర్ కేవీ చౌదరి, వీసీ తదితరులు

భారత వర్సిటీల క్రికెట్ జట్టుకు సిద్ధార్థ విద్యార్థి ఎంపిక

● డిసెంబరు 7 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే భారత్ జట్టులో స్థానం
● షేక్ కాజా మొహిద్దీన్‌కు వర్సిటీ చాన్సలర్ అభినందన

కానూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో ఎంబీఏ ఫస్టియర్ చదివే విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్ భారత విశ్వవిద్యాలయాల క్రికెట్ జట్టు (పురుషుల)కు ఎంపికయ్యారు. డిసెంబరు 7 నుంచి 19 వరకు ఆస్ట్రేలియాలో జరిగే ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌కు భారత వర్సిటీల క్రికెట్ జట్టు నుంచి ఆయన ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సిరీస్‌లో భారత వర్సిటీల క్రికెట్ జట్టు, ఆస్ట్రేలియా వర్సిటీల క్రికెట్ జట్లు తలపడనున్నాయి. భారత్ తరుపున షేక్ కాజా మొహిద్దీన్ ఆడుతున్నారు. గతంలో ఆయన వినూమాంకడ్ ట్రోఫీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. అనంతరం ఆలిండియా ఇంటర్ వర్సిటీ క్రికెట్ సెలక్షన్ ట్రయల్స్‌లో అర్హత సాధించి చివరకు భారత వర్సిటీల క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు.

సిద్ధార్థ యాజమాన్యం అభినందనలు

భారత జట్టుకు ఎంపికైన వర్సిటీ విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్‌ను శనివారం సిద్ధార్థ వర్సిటీ యాజమాన్యం అభినందించింది. వర్సిటీ చాన్సలర్ కేవీ చౌదరి, వైస్‌చాన్సలర్ పీ వెంకటేశ్వరరావు, ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్‌తోపాటు సిద్ధార్థ అకాడమీ నేతలు అభినందించారు. సిద్ధార్థ వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్‌ను సత్కరించి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పెళ్లిని తలపించిన అంతిమయాత్ర

● తల్లిని ఘనంగా సాగనంపిన కుమారుడు



ఉయ్యూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కని, పెంచి పెద్ద చేసిన మాతృమూర్తి అనారోగ్యంతో మృతిచెందగా అంతిమ యాత్ర పెళ్లివేడుకలా అత్యంత ఆర్భాటంగా నిర్వహించి ఆమెపై ఉన్న ప్రేమను చాటుకున్నాడో కుమారుడు. ఉయ్యూరుకు చెందిన బొల్లా నాని తల్లి బొల్లా సముద్ర వేణి(70) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందగా శనివారం ఆమె భౌతిక ఖాయానికి రూ.లక్షలు వెచ్చించి అత్యంత వైభవంగా అంతిమ యాత్ర చేసి అంత్యక్రియలు నిర్వహించారు. పూలదండలతో హంస అలంకార పల్లకిలో మేళతాళాలతో లక్ష్మీ టాకీస్ సెంటర్ సమీపంలో నాని ఫామ్‌హౌస్ నుంచి మధ్యాహ్నం బయలుదేరిన అంతిమయాత్రలో కాటూరురోడ్డులో శ్మశానవాటిక వరకు పూలవర్షం కురిపిస్తూ సాగింది. అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో నాని మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్దయెత్తున పాల్గొన్నారు.


దుర్గమ్మ సన్నిధికి వచ్చిన జెట్టి కుసుమకుమార్

దుర్గమ్మ సన్నిధిలో కేజీఎఫ్ చైర్మన్

ఇంద్రకీలాద్రి నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలోని కనకదుర్గమ్మను శనివారం ఏఐసీసీ సెక్రటరీ, ఒడిశా ఇన్‌చార్జి, కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) చైర్మన్ జెట్టి కుసుమ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జెట్టి కుసుమ కుమార్‌కు ఆలయ కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆయనకు అమ్మవారి ఆశీస్సులు అందజేయగా, చైర్మన్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రము, లడ్డు ప్రసాదం అందజేశారు. కేజీఎఫ్ చైర్మన్ జెట్టి కుసుమ కుమార్ వెంట పలువురు కాంగ్రెస్ నేతలున్నారు.

7న మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

● డీఈవో యూవీ సుబ్బారావు

విజయవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష డిసెంబరు 7న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.in, పాఠశాల లాగిన్‌లోను, whatsa-pp-mana mitra లోను అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వాట్సాప్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే విధానం కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల UDISE విధానం కోడ్‌ను ఉపయోగించి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు ఇవ్వాలన్నారు.

మెగా విస్తరణ!

● ఎన్టీఆర్, కృష్ణా వారధిగా విస్తరణాభివృద్ధి ● నిడమానూరు - పోరంకి కాంక్రీట్ జంగిల్‌గా విస్తరణ
● కలిసిపోతున్న బందరురోడ్డు (పోరంకి) - నిడమానూరు ● ఎడ్యుకేషన్, హెల్త్ హబ్‌గా మారుతున్న ప్రాంతం

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత జాబితాలోని ప్రాంతాలవి. కృష్ణాజిల్లాలో ఉన్నప్పటికీ భౌగోళికంగా విజయవాడకు దగ్గరగా ఉన్న ప్రాంతాలివి. జనసాంద్రతతో, కిక్కిరిసిన విజయవాడ విస్తరణకు అవకాశం లేకపోవటంతో సమీప రూరల్ ప్రాంత గ్రామాలు విజయవాడతో సమానంగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తున్నాయి. నిడమానూరు, పోరంకి ప్రస్తుతం కలిసిపోయేలా విస్తరణాభివృద్ధి జరుగుతోంది. గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలోని నిడమానూరు, పోరంకి ప్రాంతాల విస్తరణాభివృద్ధిపై ఆంధ్రజ్యోతి కథనం.
- విజయవాడ, ఆంధ్రజ్యోతి



విజయవాడ సిటీకి ఆనుకుని ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. చెప్పాలంటే సిటీ కన్నా ప్రశాంతం, ఆహ్లాదంగా ఉంటాయి. బందరురోడ్డు నుంచి నిడమానూరు జాతీయ రహదారి వరకు 4 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఒకప్పుడు పచ్చని పొలాలున్న ఈ ప్రాంతంలో ఇప్పుడు పెద్దపెద్ద, భవంతులు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతున్నాయి. ఉద్యోగస్తులు, వ్యాపారులు ఇక్కడ నివాసముంటున్నారు. దీంతో ఈప్రాంతం గేటెడ్ కమ్యూనిటీలా తయారైంది. ఈ ప్రాంతంలో భూముల ధరలు నాలుగైదేళ్ల కిందట కంటే రెట్టింపు అయ్యాయి. విజయవాడ-గన్నవరం రహదారి రద్దీగా ఉన్నప్పుడు 100, 50 అడుగుల రోడ్లలోనే వాహనాలు పరుగులు పెడతాయి.

జిల్లాల పునర్విభజన సమయంలో రెండు జిల్లాల మధ్య ఉండిపోవడంతో అభివృద్ధి నిలిచిపోతోందేమోనని బందరు రోడ్డు (పోరంకి)- నిడమానూరు మధ్య ప్రాంత ప్రజలు భయపడ్డారు. పోరంకి, నిడమానూరు ప్రాంతంలో సగభాగం ఎన్టీఆర్ జిల్లాలో ఉంటే మరో సగం కృష్ణా జిల్లాలో ఉంది. ఈ రెండు నియోజకవర్గాలు, రెండు జిల్లాలను కలపడంతో పాటు రెండింటికి వారధిగా ఉండడంతో అభివృద్ధిలో దూసుకుపోతోంది. విద్యాసంస్థలు, ఆసుపత్రుల నిర్మాణాలతో ఉద్యోగులు, వ్యాపారస్థులు ఇక్కడ నివసించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పైగా నగరానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ ప్రశాంతంగా ఉంటుంది. దీంతో సంపన్నులు, ఉద్యోగులు స్థలాలు, ప్లాట్ల ధరలు ఎక్కువున్నా వెనుకడుగు వేయటం లేదు.

గ్రేటర్ సాకారమైతే మరింత అభివృద్ధి



బందరు రోడ్డు నుంచి నిడమానూరు వరకు రహదారిని ఆనుకుని 4 కిలోమీటర్లలో ఈ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో బందరు రోడ్డు నుంచి 2కిలోమీటర్ల వరకు తాడిగడప మున్సిపాలిటీలో ఉండి పెనమలూరు నియోజకవర్గానికి చెందుతుంది. సుమారు రెండున్నర కిలోమీటర్ల ప్రాంతం గన్నవరం నియోజకవర్గం పరిధిలో ఉంది. ఈ ప్రాంతం మొత్తాన్ని గ్రేటర్ విజయవాడ పరిధిలోకి తీసుకువస్తే వేగంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి ఊపందుకుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే రానున్న రోజుల్లో గ్రేటర్‌లోకి వెళ్లే అవకాశం.. మరిన్ని సౌకర్యాలు పొందవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లలోనే ఎంతో అభివృద్ధి

ఆర్ ఉమాకాంత్, స్థానికుడు, అపార్ట్‌మెంట్ అభివృద్ధి కమిటీ మెంబర్



నాలుగేళ్లలో ఈ ప్రాంతం చాలా అభివృద్ధి చెందింది. చిన్న చిన్న సమస్యలున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు చొరవ చూపిస్తే కొన్ని రోజుల్లోనే పరిష్కారమవుతాయి. నాలుగేళ్ల కిందట గజం రూ.40 వేలున్న భూమి ధర ఇప్పుడు సుమారు రూ.65 వేల పైనే ఉంది. గత ప్రభుత్వం కనీసం రోడ్డు కూడా వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధానిగా అమరావతిని ప్రకటించాక అభివృద్ధి ఊపందుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లోనే రోడ్డు వేసింది. పోరంకి- నిడమానూరు 50 అడుగుల రోడ్డును 80 అడుగుల రోడ్డుగా వేస్తారని ప్రతిపాదనలున్నట్టు తెలిసింది. ఇదే నిజమైతే ఈ ప్రాంతం రెండు జిల్లాలకు వారధిగా ఉండడంతో పాటు ఇక్కడే అనేక సంస్థలు వచ్చే అవకాశం ఉంది. తగిన స్థలం అందుబాటులోనే ఉంది.

సికింద్రాబాద్ - అనకాపల్లి మధ్య

ప్రత్యేక రైలు సర్వీసులు

రైల్వేస్టేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు 8 ట్రిప్పుల చొప్పున ప్రత్యేక రైలు సర్వీసులు సికింద్రాబాద్ - అనకాపల్లి మధ్య నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07041 సికింద్రాబాద్ - అనకాపల్లి ఆదివారాలలో నడుస్తుంది. డిసెంబరు 7, 14, 21, 28 తేదీల్లో 4 ట్రిప్పులు, 07042 అనకాపల్లి - సికింద్రాబాద్ సోమవారాల్లో బయలుదేరుతుంది. డిసెంబరు 8, 15, 22, 29 తేదీలలో 4 ట్రిప్పులు నడుస్తుంది. చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఆగుతుంది. వన్ ఏసీ, టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

సత్రాగచ్చి - ఎల్హంక మధ్య..

ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు 4 ట్రిప్పుల చొప్పున ప్రత్యేక రైలు సర్వీసులు సత్రాగచ్చి - ఎల్హంక మధ్య నడుపుతున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 02863 సత్రాగచ్చి - ఎల్హంక గురువారాలలో నడుస్తుంది. డిసెంబరు 4, 11, 18, 25 తేదీల్లో 4 ట్రిప్పులు, 02864 ఎల్హంక - సత్రాగచ్చి శనివారాల్లో బయలుదేరుతుంది. డిసెంబరు 6, 13, 20, 27 తేదీలలో 4 ట్రిప్పులు నడుస్తుంది. ప్రస్తుతం ఉన్న సమయాలు, స్టాపేజీల్లో ఎలాంటి మార్పులేదని సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు.

జగ్గయ్యపేట కోర్టు వద్ద హైడ్రామా

చీటి పాట నిర్వాహకురాలి కోసం మొహరించిన పోలీసులు, బాధితులు



జగ్గయ్యపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిల్లకల్లులో చీటి పాట నిర్వహించి పాటదారులకు రూ.1.55 కోట్లకు ఎగనామం పెట్టి, పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ఒక కిలేడి శనివారం జగ్గయ్యపేట కోర్టుకు న్యాయవాదితో వచ్చిన విషయం తెలుసుకుని ఆమె బాధితులు, పోలీసులు కోర్టు వద్ద మోహరించటంతో కోర్టు వద్ద హైడ్రామా నెలకొంది. బాధితులపైనే న్యాయస్థానానికి ఫిర్యాదు చేసేందుకు ఒక మహిళ న్యాయవాదితో కలిసి కోర్టుకు వచ్చిందన్న విషయం తెలుసుకున్న బాధితులు, చిల్లకల్లు పోలీసులు శనివారం మధ్యాహ్నం కోర్టుకు చేరుకోగా కిలేడి తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేయటం, ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే చిల్లకల్లుకు చెందిన పల్లెపు ప్రమీల (40) అనే మహిళ గ్రామంలో చీటిపాటలు నిర్వహిస్తుండేది. గతేడాది చీటిపాడుకున్న వారికి డబ్బులివ్వకపోవటంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. కొద్దిరోజులకే ఆమె బాధితుడు తలుపుల శంకర్ (25) రుణ ఒత్తిళ్లు తట్టుకోలేక, చీటి పాట మొత్తం అందక ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. శంకర్ బంధువుల ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా పెద్ద మనుషుల సమక్షంలో 49 మంది బాధితులకు తన ఆస్తి అమ్మి రూ.50 లక్షలు వరకు కొంత మొత్తంలో నగదు ఇస్తానని కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఆమె నెరవేర్చుకోలేక పోయింది. దీంతో బాధితులు పోలీసులపై ఒత్తిడి పెంచారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు శనివారం కోర్టులో ఫిర్యాదు చేసేందుకు వస్తుందని తెలుసుకుని కోర్టు వద్ద ఎస్సై సూర్య శ్రీనివాస్ మహిళా సిబ్బందితో మొహరించారు. అటు బాధితులు కోర్టుకు చేరుకున్నారు. దీంతో చీటిపాట నిర్వాహకురాలు తరపు న్యాయవాది పోలీసు చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు జరిగిన విషయాలను న్యాయవాదికి వివరించి, సహకరించాలని కోరారు. గంటల కొద్ది చర్చల తర్వాత కోర్టు వద్ద ప్రమీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు కూడా పోలీసులతో పాటు చిల్లకల్లు స్టేషన్‌కు వెళ్లారు.

ఏపీలో కాంగ్రెస్ పార్టీని ప్రత్యామ్నాయ

శక్తిగా రూపొందిస్తాం

● ఏపీ రాష్ట్ర పరిశీలకుడు, రాజస్థాన్ ఎంపీ నీరజ్ డాంగి

వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి ప్రత్యామ్నాయ శక్తిగా రూపొందిస్తామని ఏపీ రాష్ట్ర పరిశీలకుడు, రాజస్థాన్ ఎంపీ నీరజ్ డాంగి అన్నారు. శనివారం వన్‌టౌన్ పంజాసెంటర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాంగి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిశానిర్దేశంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం సంఘటన, సృజన్, అభియాన్ విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నీరజ్ డాంగిను కాంగ్రెస్ నేతలు ఘనంగా సత్కరించారు. పశ్చిమ నియోజకవర్గం సమన్వయ కర్త షేక్ బాజీ ఆధ్వర్యంలో జరిగిన సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.నరసింహారావు, ఏపీసీసీ పరిశీలకుడు కొరివి వినయ్ కుమార్, పార్టీ నేతలు గంటా అంజిబాబు, జేష్ఠ సతీష్ కుమార్, పశ్చిమ 22వ డివిజన్ అధ్యక్షులు, అనుబంధసంఘాల నేతలు పాల్గొన్నారు.

ధరలేక, అమ్మలేక..!

సీసీఐ నిబంధనలకు పత్తి రైతు చిత్తు ● కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత లేదని తిప్పి పంపేస్తున్న అధికారులు
● దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు వ్యాపారులు ● పంటను విక్రయించుకోలేని దీనస్థితిలో అన్నదాతలు


సీసీఐ వారు తిప్పి పంపిన పత్తిని చూపుతున్న రైతు నలజాల ప్రమోద్

పెనుగంచిప్రోలు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి సాగు చేసిన పత్తిని కొనుగోలు చేసే నాథుడు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని విక్రయించేందుకు వెళ్లిన రైతుల పరిస్థితి దీనంగా మారింది. వారి నుంచి కొనుగోలు చేస్తే ఒట్టు. నాణ్యత లేదని తిప్పి పంపస్తున్నారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు రైతులను మభ్యపెట్టి కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారు. ఆరుగాలం కష్టాన్ని ప్రైవేటు వ్యాపారులకు పణంగా పెట్టలేక కొంతమంది రైతులు తమ దగ్గరే నిల్వ చేసుకునే దుస్థితి దాపురించింది. పెనుగంచిప్రోలుకు చెందిన రైతు నలజాల ప్రమోద్ తనకున్న మూడెకరాలకు మరో ఏడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి. పత్తి తీయగా ఎకరాకు సగటున 4 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. స్థానికంగా ప్రైవేటు వ్యాపారులు క్వింటా రూ.4వేలకు అడగటంతో విక్రయించలేక ఇంట్లోనే నిల్వచేశాడు. తిరుమలగిరి సమీపంలోని పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకుపోతే పత్తిలో నాణ్యత లేదనే సాకుతో తిప్పి పంపారు. ఇప్పటి వరకు రూ.5లక్షలు అప్పులు చేశానని రైతు తెలిపారు. పత్తి విక్రయించకపోవటంతో పత్తి తీసిన కూలీలకు డబ్బులు చెల్లించేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పత్తి తీతల సమయంలో మోంథా తుపాన్ విరుచుకుపడటంతో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు సగటు 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 4 క్వింటాళ్లకు మించటం లేదు. పల్లపు భూముల్లో సాగు చేసిన పంట పూర్తిగా నాశనమై పెట్టుబడులు కోల్పోయారు. ప్రస్తుతం అరకొరగా చేతికొచ్చిన పంట కొనే నాథుడు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మానవత్వం చాటిన పోలీస్ కానిస్టేబుళ్లు

● జాతీయ రహదారిపై మట్టి, రాళ్లు తొలగింపు


పారలతో మట్టి, రాళ్లు తొలగిస్తున్న కానిస్టేబుళ్లు

ఎ.కొండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కానిస్టేబుల్స్ విధి నిర్వహణలో శ్రామికులగా మారి మట్టి, రాళ్లు తొలగించారు. రోడ్డు సేఫ్టీ మొబైల్-5లో కానిస్టేబుల్స్ కే జాషువా, సర్వేశ్వరావు హైవేపై విధులు నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ఒక టిప్పర్ నుంచి ఎ.కొండూరు మండలంలోని దీప్లానగర్ నాగసింధు స్పినింగ్ మిల్స్ సమీపంలో జాతీయ రహదారి (30)పై మట్టి, రాళ్లు పడిపోయాయి. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా ఉండటంతో హైవే సిబ్బందికి సమాచారం అందింది. విధి నిర్వహణలో ఉన్న జాషువా, సర్వేశ్వరరావు రాత్రిపూట చలిలో పార పట్టుకొని మట్టి, రాళ్లు తొలగించారు. ప్రమాదాల నివారణకు ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు చేసిన పనికి ప్రజలు, వాహనదారులు అభినందనలు తెలిపారు.

కాపు డిక్లరేషన్ ప్రకటిస్తాం: ఆకుల

● కాపునాడు స్వర్ణోత్సవ బహిరంగ సభ నేడు

గాంధీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాపునాడు స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని పలువురు కాపు నేతలు పిలుపునిచ్చారు. స్థానిక జింఖానగ్రౌండ్‌లో జరిగే ఈ బ్రోచర్‌ను గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సభలో విజయవాడ కాపు డిక్లరేషన్ ప్రకటిస్తామన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు వెన్నకోట శ్రీనివాస్, రమేష్, నేతలు ఆకుల తిరుపతిరావు, పరుచూరి కరుణాకర్, నరహరిశెట్టి జ్యోతి, వేల్పుల శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంరి జర్వేషన్లు రద్దు చేయడం, కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా కాపులకు తీరని ద్రోహం చేసిందన్నారు. ఆకుల తిరుపతిరావు, నరహరిశెట్టి జ్యోతి పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీకి పునర్‌వైభవం తెస్తాం

● ఉర్దూ అకాడమీ చైర్మన్ మొహ్మాద్ ఫరూక్ షుబ్లీ



కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ అకాడమీలో ఉద్యోగం చేసి జీతాలు తీసుకొనేవారికి ప్రాధాన్యం ఇస్తామని, పనిచేయకుండా కేవలం గౌరవ వేతనాలు, పెన్షన్ మాదిరిగా జీతాలు పొందేవారిని ఉపేక్షించబోమని ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ మొహ్మాద్ ఫరూక్ షుబ్లీ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతాయుతమైన చైర్మన్ పదవికి పూర్తి న్యాయం చేస్తానన్నారు.ఏ విభాగంలో లేనివిధంగా 159 మంది ఉద్యోగులు ఉర్దూ అకాడమీలో ఉన్నారని, వీరిని సద్వినియోగం చేసుకొనేలా శ్రమిస్తానన్నారు. రాష్ట్రంలో ఉర్దూ రెండో అధికార భాషగా ఉన్నందున ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే బోర్డుల్లో ఉర్దూ వినియోగం ఉండేలా చూస్తామన్నారు. నగరాల్లో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో కనిపించే 'ఐ లవ్ ఆంధ్రప్రదేశ్' వంటి బోర్డులను ఉర్దూ పదాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మదర్‌సా మోడరనైజేషన్ కింద ఉర్దూ భాష అభివృద్ధికి అకాడమీ కృషి చేస్తుందన్నారు. ఉర్దూలో డీటీపీ నేర్చుకొనే అవకాశాన్ని కల్పిస్తామని షుబ్లీ వివరించారు.

దివ్యాంగ మాజీ అధికారి విలవిల

● ఈఎల్, బిల్లులు, పెన్షన్ నెలలుగా పెండింగ్



కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో 30 ఏళ్లు గడిపిన మాజీ ప్రభుత్వ అధికారి ఇప్పుడు జీవించేందుకు యుద్ధం చేస్తున్నారు. ఏపీ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ (ఏపీ భవన్, న్యూఢిల్లీ)లో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసి జనవరి 2025లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొన్న భోగి వెంకట సత్యనారాయణ ప్రస్తుతం తీవ్రమైన దివ్యాంగ, ఆర్థిక నష్టాలతో విలవిలలాడుతున్నారు. మార్చిలో జరిగిన ప్రమాదంలో రైట్ హిప్‌కు బాల్, రాడ్ ఆపరేషన్ కావడంతో నెలలుగా మంచానికే పరిమితమైన ఆయనకు, పెన్షన్ పత్రాలు ఇంకా ఏజీ కార్యాలయంలో క్లియర్ కాలేదు. అంతేకాక జూన్ 2025 నుంచి ఆయన ఎర్నర్ లీవ్ ఎంకాష్‌మెంట్ బిల్లులు (2025-847965, 2025-851306) ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. విజయవాడలో భార్యతో కలిసి నివసిస్తున్న ఆయన నెలకు చెల్లించాల్సిన రూ.33 వేల ఈఎంఐ కూడా 4 నెలలుగా చెల్లించలేక బ్యాంకుల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అంతేకాక 2019 నుంచి గవర్నర్ బంగ్లాలో అవుట్ సోర్సింగ్ ట్రాన్స్‌లేటర్‌గా పనిచేస్తున్న భార్య మాధవిరాణి, భర్త ప్రమాదం తర్వాత 20 రోజులు సెలవు తీసుకొని విధులకు వచ్చినా 'ప్రస్తుతం అవసరం లేదు' అంటూ తీసుకోలేదని కుటుంబం చెబుతోంది. బిల్లులు పెండింగ్, పెన్షన్ లేదు, భార్య ఉద్యోగం పోయింది, దివ్యాంగ స్థితిలో జీవించడం కష్టమైపోయింది. ఫైనాన్స్ శాఖ, గవర్నర్ కార్యాలయం మానవతా దృక్పథంతో స్పందించాలని సత్యనారాయణ విన్నవించుకొంటున్నారు.



సండే సెలబ్రిటీ

ఒక గొప్ప కోటను చూసినప్పుడు గత చరిత్ర గుర్తుకొస్తుంది. భావోద్వేగం కలుగుతుంది. కొన్ని వందల ఏళ్ల క్రితం అక్కడ నివసించిన వ్యక్తులు ఎలా ఉండేవారు? వారి ఆచార వ్యవహారాలేమిటి? సంస్కృతి సంప్రదాయాలేమిటి? ఎలాంటి దుస్తులు ధరించేవారు? ఏ భాష మాట్లాడేవారు?... ఇలాంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. వాటన్నింటిపైన పరిశోధన చేసి, మళ్లీ మన కళ్ల ముందు ఆ నాటి రాజసాన్ని నిలబెట్టడానికి కృషి చేస్తున్న వ్యక్తి... క్రాఫ్ట్ ఆఫ్ ఆర్ట్‌కు చెందిన **బిర్వా ఖురేషి**. వచ్చే నెల 12న గోల్కొండ కోటలో ఒక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలలోకి వెళ్తే..

ఒక్కో కట్టడం వెనక ఒక్కో చరిత్ర ఉంది


చరిత్రపై మీకు ఆసక్తి ఎప్పుడు ఏర్పడింది?, ఎలా ఏర్పడింది?

నాన్నగారు దేశంలో పెద్ద ఆర్కిటెక్ట్‌లలో ఒకరు. చిన్నప్పటి నుంచి నేను ఆర్కిటెక్ట్ అవ్వాలనుకున్నా. నాకు ఆర్కిటెక్చర్‌తో పాటు కళలన్నా చాలా ఇష్టం. అందుకే భరతనాట్యం కూడా నేర్చుకున్నా. మన భారతీయ సంస్కృతిలో కళలకు.. కట్టడాలను ఒక అవినాభావ సంబంధం ఉంటుంది. మన దేశం నలుమూలలా అనేక కోటలు, కట్టడాలు ఉన్నాయి. ఒకో కట్టడం వెనక ఒకో చరిత్ర ఉంది. ఇవన్నీ మన గత వైభవ గర్వ చిహ్నాలు. ఆ చరిత్ర చాలా మందికి తెలియదు. ముఖ్యంగా ఈతరం పిల్లలకు మన ఘన చరిత్ర గురించి చెప్పటానికి 16 ఏళ్ల క్రితం అహ్మదాబాద్‌లో నేను తొలి సారి ఈ ఫెస్టివెల్‌ను నిర్వహించాను. ఇక గోల్కొండ కోట విషయానికి వస్తే 2019 నుంచి ఈ కట్టడానికి సంబంధించిన పరిశోధన ప్రారంభించాను. కొన్ని వందలసార్లు వచ్చాను. అనువణువూ తెలుసుకున్నాను. ఆరేళ్ల తర్వాత వచ్చే నెల ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నాం.

ఇప్పటిదాకా మీరు అనేక ఫెస్టివల్స్ నిర్వహించారు. వీటిలో హరప్పా నాగరితకు చెందిన ధోలోవీరా ఫెస్టివల్ ఒకటి. మనకు హరప్పా సంస్కృతి గురించి కొంతే తెలుసు. ఈ ఫెస్టివల్‌ను నిర్వహించటానికి ఎంత కష్టపడాల్సి వచ్చింది?

హరప్పా నాగరిత ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పటానికి ధోలోవీరా ఒక ప్రత్యక్ష నిదర్శనం. ఏ నాగరికతైనా పరిఢవిల్లాలంటే నీరును జాగ్రత్తగా వాడుకోవాలి. మనకు ధోలోవీరాలో ఒక రిజర్వాయర్ కనిపిస్తుంది. అంతే కాకుండా ఉత్తర ప్రాంతంలో ఒక పెద్ద గేటు ఉంటుంది. దానిపై హరప్పా లిపిలో కొన్ని అక్షరాలు కనిపిస్తాయి. ఈ అక్షరాల వెనకున్న అర్థాన్ని ఇప్పటి దాకా కనుక్కోలేకపోయారు. ఇక తూర్పు దిశ కూడా ఒక గోడ మనకు కనిపిస్తుంది. అక్కడే కొంత ఎత్తులో వర్తులాకారంలో నిర్మించిన గుడిసెల ఆనవాళ్లు కనిపిస్తాయి. అక్కడ నుంచి చూస్తే మొత్తం ధోలోవీరా అంతా కనిపిస్తూ ఉంటుంది. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ధోలోవీరాలో పురాతత్వ శాస్త్రవేత్తలు కొన్ని తవ్వకాలే జరిపారు. ఇంకొన్ని జరపాల్సి ఉంది. ఇప్పటి దాకా తవ్వకాలు జరిపిన ప్రాంతంలో మేము ఫెస్టివల్ నిర్వహించాం. ఐదువేల ఏళ్ల క్రితం మనుషులు సంచరించిన ప్రాంతంలో మనం ఒక ఉత్సవాన్ని చేసుకోవటం మరిచిపోలేని అనుభవం. ఈ ఫెస్టివల్‌లో అనేక మంది కళాకారులు పాల్గొన్నారు. హరప్పా నాగరికతకు చిహ్నాలుగా కొన్ని ప్రాంతాల్లో దొరికిన పూసలను చెబుతారు. అలాంటి పూసలను వంశపారంపర్యంగా తయారుచేసే ఒక వ్యక్తి గుజరాత్‌లో ఉన్నారు. ఆయన చేత అలాంటి పూసలు ఆ ఫెస్టివల్‌లో తయారుచేయించాం. ఇప్పటికీ ఆ ఫెస్టివల్ గురించి తలుచుకుంటుంటే అందమైన అనుభూతులే గుర్తుకొస్తాయి.

> "మేము నిర్వహించే ఫెస్టివల్స్‌లో ఉచిత ప్రవేశం ఉంటుంది. అయితే ముందు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. సమాజంలో ఉన్న అన్ని వర్గాల వారు ఈ ఫెస్టివల్స్‌లో పాల్గొనాలనేదే నా ఉద్దేశం. కొత్త తరం వారికి మన సంస్కృతి ఎంత గొప్పదో తెలియాలంటే ఇలాంటి ఫెస్టివల్స్ నిర్వహించాలి. వాటిలో అందరూ పాల్గొనాలి.



గోల్కొండ కోటతో మీ అనుబంధమేమిటి?

గోల్కొండ కోట అనగానే ఎత్తుగా, రాజసంగా.. ఎవరికీ లొంగని ఒక కోట గుర్తుకొస్తుంది. దక్షిణ భారత దేశంలో అంత చరిత్ర కలిగిన కోట మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. గోల్కొండ కోటలో నిర్మాణాలు కూడా చాలా విభిన్నంగా ఉంటాయి. ఆ కోటలో అనేక రహస్యాలు దాగి ఉన్నాయి. ఈ కోటను చూసిన ప్రతీ సారి కొత్తగానే కనిపిస్తుంది. నేను తొలిసారి ఈ కోటను చూసినప్పుడు కలిగిన భావోద్వేగాలు ఇప్పటికీ నాకు ఇంకా గుర్తున్నాయి. ఈ ఫెస్టివల్‌ను నిర్వహించటానికి నేను ఇప్పటి దాకా కొన్ని వందల సార్లు ఈ కోటకు వచ్చి ఉంటాను. వచ్చిన ప్రతి సారి ఒక కొత్త అనుభూతి కలుగుతుంది.

ఈ తరహా ఫెస్టివల్స్‌ను నిర్వహించటం ఎంత కష్టం?

ప్రతి కట్టడానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతను చాటి చెప్పటమే ఈ ఫెస్టివల్ ముఖ్యోద్దేశం. ఈ క్రమంలో రకరకాల సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. ఉదాహరణకు అహ్మదాబాద్‌లోని ఓల్డ్ సిటీ ప్రాంతంలో ఒక ఫెస్టివల్ నిర్వహించాం. అక్కడకి ప్రతి రోజు కొన్ని లక్షల మంది వచ్చిపోతూ ఉంటారు. అంత బిజీగా ఉండే ప్రాంతంలో ఫెస్టివల్ నిర్వహించటమనేది ఒక పెద్ద సవాల్! దీనిని నిర్వహించటం వెనక 12 ఏళ్ల శ్రమ ఉంది. మన ఉద్దేశం మంచిదైతే అన్ని పనులు సక్రమంగా జరుగుతాయి. ప్రకృతి కూడా సహకరిస్తుంది.

మీకు ఇప్పటిదాకా లభించిన గొప్ప ప్రశంస ఏమిటి?

2015లో మేము గుజరాత్‌లో అత్యంత పురాతనమైన చరిత్ర కలిగిన దిగుడు మెట్ల బావి దగ్గర ఒక ఫెస్టివల్ నిర్వహించాం. కొన్ని వేల దీపాలతో దానిని అలంకరించాం. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. నేను, నాన్న ఆ మెట్ల దగ్గర నిలబడి వాటిని చూస్తున్నాం. ఇంతలో నాన్నకు తెలిసిన ఒక జంట వచ్చారు. "పదకొండు వందల ఏళ్ల క్రితం ఈ బావిని దీపాలతో అలంకరించారని శాసనాల్లో ఉంది. మళ్లీ ఇంతకాలానికి మీ అమ్మాయి దీపాలు వెలిగించింది.." అన్నారు. ఆ మాటలు విన్న నాన్న కళ్లు చమర్చాయి. నాకు అంతకన్నా గొప్ప ప్రశంస ఇంకేం ఉంటుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అందానికి మసాలాలు

వంటకాల రుచిని, ఆరోగ్యాన్ని ఇచ్చే మసాలా దినుసులు చర్మ సౌందర్యానికి కూడా ఉపకరిస్తాయని తెలుసా?



- జీలకర్రలో ఇ విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికం. రోజూ వంటకాల్లో చేర్చడం వల్ల చర్మం మీద ముడుతలు ఏర్పడవు. అకాల వార్ధక్యం దరి చేరదు. గ్లాసు మంచినీటిలో అర చెంచా జీలకర్ర వేసి రాత్రంతా నాననిచ్చి ఉదయాన్నే తాగితే శరీరంలోని వ్యర్థపదార్థాలన్నీ విసర్జితమవుతాయి. చర్మం తేమతో నిండి ఛాయగా మెరుస్తుంది.
- దాల్చిన చెక్కలో బీ, కె విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్, బీటా కెరోటిన్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. తరచూ ఆహారంలో చేరిస్తే రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. చర్మం పొరల్లో సెబమ్ ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో ముఖం మీద మొటిమలు, గుల్లలు రావు. చిన్న గిన్నెలో చెంచా దాల్చిన చెక్క పొడి, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి గంట తరువాత మంచినీటితో శుభ్రం చేసుకుంటే చర్మ రంధ్రాలు పూర్తిగా శుభ్రపడతాయి. నల్ల మచ్చలు క్రమంగా తగ్గుతాయి.
- జాజికాయలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, కాపర్, జింక్, కాల్షియం, పొటాషియం, మాంగనీస్ తదితర మినరల్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉంటాయి. ఇవన్నీ కలిసి జీవక్రియలను వేగవంతం చేసి మంచి నిద్రను ప్రేరేపిస్తాయి. దీనివల్ల చర్మం సహజ కాంతితో మెరిసిపోతుంది.
- లవంగాలలో సి, కె విటమిన్లతోపాటు పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం లాంటి మినరల్స్ మెండు. లవంగాలు తీసుకుంటే చర్మం పొడిబారడం, చుండ్రు లాంటి సమస్యలు తగ్గుతాయి. గిన్నెలో రెండు చెంచాల కొబ్బరి నూనె, మూడు చుక్కల లవంగ నూనె వేసి బాగా కలిపి రాత్రి పడుకునేముందు ముఖానికి పట్టిస్తే మొటిమల సమస్య తీరుతుంది.

ట్రెండింగ్



పదిహేనేళ్ల వయసులోనే
వెండితెరపై మెరుపులు.
షారూక్, ఆమిర్ లాంటి సూపర్‌స్టార్ల
చిత్రాల్లో పాత్రలు.
రెండు దశాబ్దాలు పైబడిన కెరీర్‌లో...
అందమైన అభినయాలు...
వరించిన పురస్కారాలు ఎన్నో.
కానీ అవేవీ ఇవ్వని స్టార్ ఇమేజ్... ఒకే
ఒక్క ఇంటర్వ్యూతో ఆమె సొంతమైంది.
సామాజిక మాధ్యమాల యుగంలో...
రాత్రికి రాత్రి ఇంటింటికీ
పరిచయమైంది. అదే స్థాయిలో
ఊహించని ఇబ్బందులనూ
ఎదుర్కొంటోంది.
'నీలం చీర అమ్మాయి' (బ్లూ శారీ
గాళ్)గా అంతర్జాలాన్ని ఊపేస్తున్న
నయా 'నేషనల్ క్రష్'... **గిరిజా ఓక్**
ముచ్చట్లు ఇవి.

కొత్త క్రష్..!

'**థె**రపీ షెరపీ'.. ఇదో వెబ్‌సిరీస్. దీని ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూతోనే గిరిజా ఓక్ గోడ్బోలే పేరు దేశమంతా మారుమోగిపోతోంది. వెబ్‌సిరీస్‌లో సహనటుడు గుల్షన్ దేవయ్యతో చేసిన ఓ సాన్నిహిత్య సన్నివేశం గురించి అందులో ఆమె మాట్లాడింది. "ఆ సన్నివేశం తీస్తున్న సమయంలో గుల్షన్.. 'మీకు ఓకేనా' అని కనీసం పదహారు పదిహేడుసార్లు అడిగాడు. నా సౌకర్యం కోసం తన వ్యానిటీ వ్యాన్ నుంచి రకరకాల దిండ్లు తెచ్చి ఇచ్చాడు. సహనటుడి నుంచి ఇంతటి గౌరవం, భద్రత లభించడం చాలా అరుదైన విషయం" అంటూ ఆమె తన షూటింగ్ అనుభవాలను పంచుకుంది. "సినిమా లేదా సిరీస్ కావచ్చు.. అభ్యంతరకర సన్నివేశాలు చిత్రీకరించేటప్పుడు నటీనటులు ఇబ్బంది పడకుండా సెట్‌లో జాగ్రత్తలు తీసుకొంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు సందేహిస్తుంటాం. కానీ కొందరు నటులతో పని చేసేటప్పుడు ఆ అసౌకర్యం అనేదే ఉండదు. అలాంటివారిలో గుల్షన్ ఒకరు. తనవల్లే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ సన్నివేశం పూర్తి చేయగలిగా" అంటూ ముగించింది. ఈ మాటలే యువతరాన్ని విపరీతంగా ఆకట్టుకున్నాయి.

అంతేకాదు.. ఆ సందర్భంగా ఆమె పలికించిన హావభావాలు, నీలి రంగు చీరలో సంప్రదాయబద్ధమైన ఆహార్యం చూసి నెటిజనులు ముగ్ధులయ్యారు. వీడియో క్లిప్పింగ్స్, ఫొటోలు తెగ షేర్ చేసేయడంతో గిరిజ హఠాత్తుగా సూపర్ స్టార్ అయిపోయింది. 'నీలం చీర అమ్మాయి'గానూ కోట్లమంది హృదయాల్లో ముద్రపడిపోయింది. 'ఇంతకీ ఎవరీమె' అనే ఉత్సుకత మొదలైంది. అంతే... గిరిజ పేరుతో సెర్చ్ ఇంజిన్లు యమ బిజీ అయిపోయాయి. లక్షల్లో ఫాలోవర్స్ పెరిగిపోయారు. చాలామంది ఆమెను అంతర్జాతీయ తారలతో పోల్చారు. అంతిమంగా గిరిజా ఓక్ నయా 'నేషనల్ క్రష్'గా అవతరించింది.

ట్రోల్స్... ట్రబుల్స్...



ఉన్నట్టుండి వచ్చిన స్టార్‌డమ్, బిరుదు కాని బిరుదు 'నేషనల్ క్రష్'.. ఈ హఠాత్ పరిణామం నుంచి కోలుకొనేలోపే గిరిజకు ట్రోల్స్ ట్రబుల్స్ మొదలయ్యాయి. కొన్నిటిని సానుకూలంగానే తీసుకున్నా... అన్నిటినీ ఆమె భరించలేకపోయింది. "మీరు చూపుతున్న ఆదరాభిమానాలకు ధన్యవాదాలు. చాలామంది నన్ను ప్రశంసిస్తూ మెసేజ్‌లు పెడుతున్నారు. మీమ్స్ కూడా సృష్టించారు. సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ అవుతుంటే ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు! దీనివల్ల నాకు, నా సినిమాలకు అభిమానులు పెరుగుతున్నారు. ఇది సంతోషమే. కానీ కొందరు హద్దులు మీరి... నా ఫొటోలను మార్ఫింగ్ చేసి, అశ్లీలత జోడిస్తున్నారు. నా పన్నెండేళ్ల కొడుకు తల్లి ఫొటోలను అలా చూస్తే ఎలా స్పందిస్తాడోనని ఆందోళన కలుగుతోంది. కొందరు నా పేరుతో ఫేక్ అకౌంట్లు తెరిచి డబ్బులు అడుగుతున్నారు. మీరు నిజంగా నటనను ఇష్టపడేవారే అయితే దయచేసి ఇలాంటివి మానుకోండి" అంటూ ఆవేదనతో వీడియో సందేశం విడుదల చేసిన గిరిజ... మరాఠీ ప్రముఖ నటుడు గిరీష్ ఓక్ తనయ. ముంబయి 'ఠాకూర్ సైన్స్ అండ్ కామర్స్ కాలేజీ'లో బయోటెక్నాలజీ డిగ్రీ పూర్తి చేసిన ఆమె నటనపై ఆసక్తితో చిన్నప్పుడే థియేటర్ వర్క్‌షాప్‌లో చేరింది. మొదట మోడలింగ్ చేసిన ఆమె... తరువాత మరాఠీ, హిందీ చిత్రాలతో పాటు పలు వెబ్‌సిరీస్‌లు, టీవీ షోల్లో కూడా నటించింది. దర్శకనిర్మాత సుహ్రుద్ గోడ్బోలేను పెళ్లి చేసుకుంది. ఆయన తండ్రి మరాఠీ చిత్ర దర్శకుడు, మాటల రచయిత, నిర్మాత శ్రీరంగ్ గోడ్బోలే.

విభజన వచ్చింది...

అభ్యంతరకర సందేశాలు, వంకర వ్యాఖ్యలు పక్కన పెడితే... తనకు ఉన్నట్టుండి వచ్చిన స్టార్ ఇమేజ్‌ను గిరిజ ఆసాంతం ఆస్వాదిస్తోంది. "నా జీవితంలో ఇలాంటి రోజు ఒకటి వస్తుందని ఊహించలేదు. నేనే కాదు ఎవరూ ఊహించలేరు. అయితే 'మీరు నా బేబ్‌గా ఉంటారా' అంటూ నాకు ఒక మెసేజ్ వచ్చింది. నాకు పెళ్లయిందని, ఒక కొడుకు ఉన్నాడని, ఎన్నో ఏళ్లుగా థియేటర్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నానని మీరు నా ఇన్‌స్టాగ్రామ్ చూస్తే తెలుస్తుంది. అందువల్ల సహజంగానే ఒక గౌరవ భావన వస్తుంది. కానీ 'నేషనల్ క్రష్' ట్యాగ్‌వల్ల 'బేబ్' లాంటి మాటలను కూడా వినాల్సి వస్తోంది. దీంతో 'నా పట్ల గౌరవం చూపాలా... లేక నన్ను లైంగిక దృష్టితో చూడాలా' అనే విషయంలో అభిమానుల్లో ఒక ఆసక్తికర విభజన కనిపిస్తోంది" అని, తనతోపాటు తన కుటుంబం కూడా మెసేజ్‌లను చూసి బాగా ఆస్వాదిస్తున్నారని ఇన్‌స్టాలో ఆమె చెప్పుకొచ్చింది.

"మా కుటుంబం సినీ రంగానికి చెందినదే కాబట్టి వారు వీటన్నిటినీ అర్థం చేసుకోగలరు. నా జీవితంలో ఇలాంటి అనుభవం ఎదురుకాలేదు. కనుక ఈ అనుభూతి కొత్తగా ఉంది. సరదాగానూ అనిపిస్తోంది. ఇదంతా జరిగినప్పుడు మా అబ్బాయి స్కూల్ ట్రిప్‌లో ఉండటంతో వాడికి ఏమీ తెలియలేదు. అయితే తనను ఇంటికి తీసుకురావడానికి వెళ్లినప్పుడు విద్యార్థుల తల్లితండ్రులందరూ నన్ను చుట్టుముట్టారు. వీడియోల గురించి ఆసక్తిగా చర్చించారు. వాళ్లంతా ఏంమాట్లాడుతున్నారో వాడికి అర్థంకాలేదు. ఈ వైరల్ కాన్సెప్ట్ గురించి తరువాత వాడికి వివరించే ప్రయత్నం చేశాను. 'ఇప్పుడు ఇంత పేరు వచ్చింది కదా... నువ్వు మారిపోతావా' అని అడిగాడు. 'ఎందుకు మారను! ఇది 'గిరిజ-2 వెర్షన్. ఇకమీదట నువ్వు నాతో బాగా మాట్లాడాలి' అని మొదట సరదాగా అన్నాను. కానీ తరువాత... 'నేను ఎప్పటికీ మారను' అని వాడికి భరోసా ఇచ్చాను."

అదే నేను...

తారస్థాయిలో పేరు, 'నేషనల్ క్రష్' ట్యాగ్‌తో మీ జీవితంలో ఏదైనా మార్పు వచ్చిందా అని అడిగితే... "ఏమీ మారలేదు. అదే నేను. ఇప్పటికీ ఆటోరిక్షా దొరకడంలేదు. కొత్తగా ఆఫర్లూ రావడంలేదు" అని నవ్వుతూ బదులిచ్చింది. తన జీవితంలో అనుకోని ఈ ఘట్టాన్ని పూర్తిస్థాయిలో ఆస్వాదిస్తున్నా... కొంతమంది తుంటరి మెసేజ్‌లు బాధ కలిగిస్తుంటాయని, కానీ వెనక మాట్లాడేవారు ఒకవేళ ముందుకు వస్తే సూటిగా మన కళ్లలోకి కూడా చూడలేరని అంటుంది గిరిజ. ఇవన్నీ ఎలావున్నా ఎప్పటిలానే తన ప్రాజెక్టులు, పనుల్లో బిజీగా ఉంది.

జాలీ చీరలతో జాలీగా

ఫ్యాషన్ ప్రపంచంలో చీరలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఎప్పటికప్పుడు సరికొత్త హంగులు అద్దుకుంటూ నిత్య నూతనంగా కనువిందు చేస్తుంటాయి. ఈ క్రమంలోనే జాలీ చీరల సందడి మొదలైంది. రెడ్ కార్పెట్ వేడుకల నుంచి కొత్త సినిమా ప్రమోషన్ల వరకూ సందర్భం ఏదైనా సరే సెలబ్రిటీలు అందమైన జాలీ చీరలు చుట్టుకుని మెరిసి మురిసిపోతున్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు సైతం వీటికే ఓటేయడంతో ఈ ఏడాది 'మెష్ అండ్ కట్‌వర్క్ జాలీ చీరలు' అత్యుత్తమ ఫ్యాషన్ ట్రెండ్‌గా నిలిచాయి.

మెరిసిన జెన్నిఫర్



గతవారం ఉదయ్‌పూర్‌లో జరిగిన నేత్ర మంతెన, వంశీ గాదిరాజుల వివాహ వేడుకలకు హాజరైన జెన్నిఫర్ లోపెజ్.. కట్-వర్క్ చేసిన లేత గులాబీ రంగు జాలీ చీర ధరించి వేదిక మీద ఆడి పాడారు. ఆమె ఇచ్చిన ప్రదర్శన కంటే కట్టుకున్న చీరే అందరి దృష్టినీ ఆకర్షించింది. జెన్నిఫర్ విదేశీ వనిత అయినప్పటికీ ఆ చీర కట్టులో భారతీయత ఉట్టిపడడం గమనార్హం. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ అరుదైన చీరను రూపొందించారు. చీర మొత్తాన్ని ల్యాటిస్ ప్యాటర్న్‌లో కట్ వర్క్ చేసి ఎంబ్రాయిడరీ వర్క్‌లు జోడించి స్వరోవస్కీ క్రిస్టల్స్‌తో డిజైన్ చేశారు. హెవీ సీక్విన్ వర్క్‌తో రూపొందించిన స్ట్రాప్‌లెస్ బ్లౌజ్.. చీరకు మరింత అందాన్నిచ్చింది. పాప్ సింగర్‌ను గుర్తుకు తెచ్చేలా చీర కొంగును చేతుల మీదుగా కిందికి జారవిడిచారు. నియాన్ లైట్ల కాంతికి చీరంతా తళుకులీనుతూ కనువిందు చేసింది. వజ్రాలు, పచ్చలు పొదిగిన పెద్ద చోకర్, జుంకాలు, మాంగ్ టిక్కా, ఉంగరాలు, గాజులు ధరించి గ్లామ్ మేకప్‌తో మెరిసిపోయారు జెన్నిఫర్.

ఎలా తయారుచేస్తారంటే...

జాలీ అంటే సన్నని వల(నెట్) అని అర్థం. చీర ఫ్యాబ్రిక్‌ను నెట్ మాదిరి డిజైన్ చేయడమే ఈ శైలి ప్రత్యేకత. సూదితో ఫ్యాబ్రిక్ దారాలను విడదీసి అందమైన నెట్ డిజైన్‌ను సృష్టిస్తారు. ఇది చికంకారి ఎంబ్రాయిడరీ, కోట డోరియా నేతలను పోలి ఉంటుంది. కొన్ని డిజైన్లను చీరలమీదే రూపొందిస్తుంటారు. ఎంబ్రాయిడరీ, జర్దోసీ వర్క్‌లతో కూడా అందమైన జాలీ డిజైన్లను సృష్టిస్తున్నారు. ఇలాంటివి పట్టు చీరల మీద బాగుంటాయి. ఆర్గంజా లాంటి సన్నని ఫ్యాబ్రిక్‌ల మీద కట్ వర్క్‌ను ఉపయోగించి వినూత్నమైన డిజైన్లు తయారుచేస్తున్నారు. లేజర్ కట్‌లు, ఆర్కిటెక్చరల్ మెష్‌లు, హ్యాండ్ కట్ ల్యాటిస్ వర్క్‌లు, మెటల్ మెష్‌లు, మెరిసే కేజ్‌లు, పూసల గ్రిడ్‌లతో సరికొత్త జాలీ డిజైన్లు సృష్టిస్తున్నారు. జాలీ చీరలు కట్టుకున్నప్పుడు వాటికి మ్యాచ్ అయ్యేలా సొగసైన రిచ్ బ్లౌజ్ ధరించడం తప్పనిసరి.

పూల పల్లూతో జాన్వీ



పరమ్ సుందరి సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో జాన్వీ కపూర్.. తెల్లని ల్యాటిస్ ప్యాటర్న్ జాలీ వర్క్ శారీతో సందడి చేశారు. చీర అంచులతోపాటు అక్కడక్కడా చేర్చిన గులాబీల ఎంబ్రాయిడరీ వర్క్ చీర సొగసును పెంచింది. తాజా మల్లె మొగ్గలు, రజనీగంధ పూలను మెష్ ప్యాటర్న్‌లో అల్లి ఈ చీర కొంగును రూపొందించారు. గులాబీ పూల ఎంబ్రాయిడరీ, సీక్విన్ వర్క్‌లతో బ్లౌజ్‌ను కూర్చారు. ప్రఖ్యాత తోరణి లేబుల్ ఈ చీరను ప్రత్యేకంగా కస్టమైజ్ చేసింది. వేలికి పెద్ద వజ్రపు ఉంగరం, సాదా హీల్స్‌తో డీసెంట్‌గా కనిపించారు జాన్వీ.

గూచీ శారీతో అలియా




కేన్స్ ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో రెడ్ కార్పెట్ మీద సీక్విన్డ్ గూచీ జాలీ చీరతో నడిచి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు అలియా భట్. ప్రఖ్యాత స్టయిలిస్ట్ రియా కపూర్ ఈ చీరను డిజైన్ చేశారు. ప్లంజింగ్ బ్లౌజ్, స్ట్రయిట్ స్కర్ట్, నేలను తాకే దుపట్టా లాంటి కొంగు ఈ చీర ప్రత్యేకత. వింటేజ్ లుక్‌లో కనిపించే డైమండ్ టెన్నిస్ నెక్లెస్ ధరించి భారతీయ వారసత్వాన్ని అందంగా ప్రదర్శించారు అలియా.

వెండి కట్‌వర్క్ పల్లూతో నీతా



ఇటీవల బ్రిటిష్ మ్యూజియంలో జరిగిన పింక్ బాల్ వేడుకల్లో నీతా అంబానీ లైట్ పింక్ కాంచీవరం చీర ధరించి మెరిసిపోయారు. ఈ చీరను స్వదేశీ చేనేతకారుడు ఆర్. వరదన్ రూపొందించారు. చీర కొంగును మాత్రం వెండి కట్‌వర్క్‌తో మనీష్ మల్హోత్రా డిజైన్ చేశారు. బెజ్వెల్డ్ బటన్స్‌తో కూడిన కోర్సెట్ బ్లౌజ్ ధరించి కుడి చేతి మీదుగా కొంగు వేసుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు నీతా.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రోల్ 2	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 01
స్టీఫెన్	తమిళ చిత్రం	డిసెంబర్ 05
అమెజాన్ ప్రైమ్		
థామా	హిందీ చిత్రం	డిసెంబర్ 02
ఆహా...		
ధూల్‌పేట్ పోలీస్ స్టేషన్	తెలుగు సిరీస్	డిసెంబర్ 05
జీ 5		
ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో	తెలుగు చిత్రం	డిసెంబర్ 05
ఈటీవీ విన్		
కరీముల్లా బిర్యానీ పాయింట్	తెలుగు చిత్రం	నవంబర్ 30

బిజినెస్ ప్లస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,29,820 ▲	1,19,000 ▲	1,92,000 ▲
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,73,000 ▲
విశాఖపట్నం	1,29,820 ▼	1,19,000 ▲	1,92,000 ▲
రాజమండ్రి	1,29,820 ▲	1,19,000 ▲	1,74,000 ▲
ప్రొద్దుటూరు	1,27,000 ▲	1,16,840 ▲	1,73,000 ▲
ముంబై	1,26,591 ▲	1,15,957 ▲	1,64,359 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ

హైదరాబాద్	630	విజయవాడ	650
వరంగల్	632	గోదావరి	625
చిత్తూరు	663	విశాఖపట్నం	615
		డజను గుడ్లు రూ.	90



ఐటీ రిఫండ్స్ ఇంకా రాలేదా!

పెద్ద మొత్తంలో ఆదాయ పన్ను చెల్లించిన చాలా మందిలో ఇప్పుడు ఒకటే టెన్షన్. తమకు రావాల్సిన రిఫండ్ ఎప్పుడు వస్తుందా? అని. రిటర్నులు దాఖలు చేసిన కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియ ప్రారంభమై ఆయా వ్యక్తుల రిఫండ్స్ మొత్తం వారి ఖాతాల్లో జమ అయ్యేది. అయితే ఈసారి మాత్రం రిఫండ్స్ ఆలస్యమవుతుండటంతో చాలా మందిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ విషయంలో చాలా మంది తమ బాధను వెళ్లగక్కేందుకు సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు డిసెంబరు నెలాఖరు కల్లా రిఫండ్స్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఐటీ శాఖ అంటోంది. ఇంతకీ ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నుంచి రావాల్సిన రిఫండ్స్ ఎందుకు ఆలస్యం అవుతున్నాయో ఒకసారి తెలుసుకుందాం. అంతే కాదు రిఫండ్ స్టేటస్‌తో పాటు ఎలా చెక్ చేసుకోవాలో తెలుసుకుందాం.

ఎవరు అర్హులు?

టీడీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్ లేదా సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా చెల్లించాల్సిన పన్ను కంటే అధిక ఆదాయ పన్ను చెల్లించిన ఆదాయ పన్ను చెల్లింపుదారులు అందరూ ఐటీ రిఫండ్స్‌కు అర్హులు.

కాలపరిమితి

ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 143 (1) ప్రకారం ఆర్థిక సంవత్సరం ముగిసిన తొమ్మిది నెలల్లోగా ఐటీ శాఖ ఐటీ రిటర్నుల ప్రాసెసింగ్ పూర్తి చేయాలి. అంటే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే నెలాఖరు వరకు ఇందుకు గడువు ఉంది. అయితే ఎప్పటిలోగా రిఫండ్ ప్రక్రియ పూర్తి చేయాలనే దానిపై మాత్రం ఎలాంటి స్పష్టత లేదు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటర్నుల ఫైలింగ్ ఈ ఏడాది సెప్టెంబరు 16తో ముగిసింది. దీంతో ఐటీ శాఖ ఈ ఏడాది డిసెంబరులోగా రిటర్నుల ప్రాసెసింగ్ పూర్తి చేయాలి. అన్నీ సజావుగా ఉన్న రిఫండ్స్ క్లెయిమ్స్‌ను కూడా ఆ లోగానే పూర్తి చేస్తామని ఇటీవల సీబీడీటీ చీఫ్ రవి అగర్వాల్ ప్రకటించడం విశేషం.

వడ్డీతో సహా

ఎలక్ట్రానిక్ -వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే రిఫండ్ ప్రక్రియ ప్రారంభమై మీ బ్యాంకు ఖాతాలో రిఫండ్ మొత్తం జమ అవుతుంది. అన్నీ సజావుగా ఉన్నా రిఫండ్ ఆలస్యమైతే, రిఫండ్ మొత్తంపై ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి నెలకు అర శాతం (0.5%) చొప్పున వడ్డీ చెల్లిస్తారు. అయితే ఇది గడువులోగా ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారికి మాత్రమే వర్తిస్తుంది. మిగతా వారికి రిటర్న్ ఫైల్ చేసిన గడువు నుంచి చెల్లిస్తారు.

ప్రక్రియ వేగవంతం చేయడం ఎలా?

- ఐటీ శాఖ ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో లాగినై రిఫండ్/రిటర్న్ స్టేటస్ తెలుసుకోవాలి
- రిఫండ్.. బ్యాంకు ఖాతాలో జమ అయినదీ లేనిదీ చెక్ చేసుకోవాలి
- నిర్ధారణ కోసం ఐటీ శాఖ జారీ చేసే నోటీసులు, విజ్ఞప్తులకు వెంటనే స్పందించాలి
- ఐటీ శాఖ పోర్టల్‌లోని ఈ-నివారణ్ సెక్షన్ ద్వారా మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు రావాలి
- ఫాలో అప్ కోసం ఐటీ శాఖకు చెందిన సీపీసీ హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించాలి
- ప్రాసెసింగ్ పూర్తయిన తర్వాత కూడా సరైన కారణం లేకుండా రిఫండ్ ఆలస్యం చేస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలి

ఆలస్యానికి కారణాలు

- పెద్ద మొత్తంలో ఉన్న రిఫండ్స్ క్లెయిమ్స్‌ను సమగ్రంగా పరిశీలించాల్సి రావడం
- కొన్ని రిటర్నుల్లో పేర్కొన్న అనుమానాస్పద డిడక్షన్లను ఐటీ అధికారులు వ్యక్తిగతంగా సమీక్షించాల్సి రావడం
- కొన్ని రిటర్నుల్లో తప్పుడు లేదా అధిక డిడక్షన్లు పేర్కొనడం
- రిఫండ్ జమ కావాల్సిన బ్యాంకు ఖాతా చెల్లుబాటులో లేకపోవడం
- ఎలక్ట్రానిక్ (ఈ)-వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉండడం
- ఐటీ శాఖ నోటీసులకు పన్ను చెల్లింపుదారులు సరిగా స్పందించక పోవడం
- ప్రస్తుత రిఫండ్ క్లెయిమ్‌ను గత ఆర్థిక సంవత్సరానికి బాకీ ఉన్న పన్ను చెల్లింపునకు జమ చేయడం

ప్రమోషనల్ స్కీములపై జీఎస్‌టీ ఉంటుందా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

సద్గురు ఎలక్ట్రానిక్స్ అనే సంస్థకు పలు పట్టణాల్లో మొబైల్ షోరూమ్స్ ఉన్నాయి. మార్కెట్లో ఎదురయ్యే పోటీని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులను ఆకర్షించేందుకు కొన్ని పథకాలను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా రూ.20,000 విలువ గల మొబైల్ కొనుగోలు చేస్తే రూ.3,000 విలువ చేసే ఒక లెదర్ బ్యాగ్‌ను ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఇంకా కొన్ని రకాల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల మీద ఒకటి కొంటే మరొకటి ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీనికి గాను ఉచితంగా ఇచ్చే వస్తువులను సద్గురు ఎలక్ట్రానిక్స్ పెద్దఎత్తున కొనుగోలు చేయటంతో పాటుగా వాటి మీద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కూడా తీసుకుంది.

అయితే ఇక్కడ వీరికి వచ్చిన సమస్య ఏమిటంటే ఇలా ఉచితంగా ఇచ్చే వస్తువుల మీద జీఎస్‌టీ చెల్లించాలా? లేదంటే సంబంధిత ఐటీసీ రివర్స్ చేయాల్సి ఉంటుందా? నిజానికి ఇలాంటి పథకాలను చాలా వ్యాపార సంస్థలు అమలు చేస్తూ ఉంటాయి. ఇంత మొత్తంలో బట్టలు కొనుగోలు చేస్తే గోల్డ్ కాయిన్ ఉచితం అని, అలాగే బంగారం కొనుగోలు చేసినప్పుడు వెండి ఉచితం అని చెబుతుంటారు. ఇవన్నీ ప్రమోషనల్ స్కీమ్స్ విభాగానికి చెందుతాయి. మరి వీటికి సంబంధించి జీఎస్‌టీ నిబంధనలు ఏమి చెబుతున్నాయో తెలుసుకుందాం.

పన్ను చెల్లించాలా..?

ముందుగా ఉచితంగా ఇచ్చే వస్తువుల మీద జీఎస్‌టీ చెల్లించాలా? ఏదేనీ అమ్మకం లేదా ఇతర లావాదేవీ, జీఎస్‌టీ కిందకు రావాలంటే ముందుగా అది 'సరఫరా' నిర్వచనంలోకి రావాలి. అలా రావాలంటే ఆ లావాదేవీకి సంబంధించి ఏదేనీ 'మొత్తం' అంటే డబ్బు లేదా ఇతర కన్సిడరేషన్ ఏదైనా సరఫరాదారునికి రావాలి. అప్పుడు మాత్రమే అది సరఫరా కిందకు వస్తుంది. అలాగే జీఎస్‌టీ వర్తిస్తుంది. పైన తెలిపిన ఉదాహరణలో ఆయా వస్తువులను ఉచితంగా ఇస్తున్నారు కాబట్టి అది 'సరఫరా' కిందకు రాదు. దీంతో జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. (అమ్మకందారుడికి, కొనుగోలుదారుడికి మధ్య ఇతర సంబంధ బాంధవ్యాలు ఏమైనా ఉంటే. అంటే ఈ ఇరువురు రిలేటెడ్ పర్సన్స్, డిస్టింక్ట్ పర్సన్ విభాగంలోకి వస్తే ఆ నిబంధనలు వేరే ఉంటాయి).

ఐటీసీ రివర్స్ చేయాలా?

ఇకపోతే, ఇలా ఉచితంగా ఇచ్చే వస్తువుల మీద తీసుకున్న ఐటీసీ రివర్స్ చేయాలా? ఇది మరొక సందేహం. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఏదేనీ వస్తువును గిఫ్ట్ కింద ఉచితంగా ఇస్తే సంబంధిత ఐటీసీ రివర్స్ చేయాలి. మరి ఇలా ఇచ్చే వస్తువులు గిఫ్ట్ కింద భావించాలా అంటే, దీనికి ప్రభుత్వం ఒక వివరణ ఇచ్చింది. ఒక వస్తువు కొన్నప్పుడు మరొక వస్తువు ఇవ్వటం అనేది గిఫ్ట్ కిందకు రాదు. ఎందుకంటే ఆ వస్తువును ఉచితంగా ఇచ్చినట్లు కనిపించినప్పటికీ.. మరొక వస్తువును కొనుగోలు చేసినప్పుడు మాత్రమే ఈ వస్తువును ఇవ్వటం జరుగుతుంది. అంటే, రెండు వస్తువులకు కలిపి బిల్ చేసినట్లు భావించాలి. కాబట్టి ఐటీసీ రివర్స్ చేయాల్సిన అవసరం లేదు. అలా కాకుండా కొనుగోలుతో సంబంధం లేకుండా పూర్తి ఉచితంగా ఒక వస్తువును ఇస్తే అప్పుడు మాత్రమే ఐటీసీ రివర్స్ చేయాలి. అంటే మందుల తయారీదారులు.. డాక్టర్లకు ఉచిత శాంపిల్స్ ఇవ్వటం లాంటిది.

పైన చెప్పిన ఉదాహరణలో రూ.15,000 మొబైల్ కొనుగోలు చేస్తే ఒక బ్యాగ్ ఇవ్వటం అంటే నిజానికి మొబైల్, బ్యాగ్ రెండు కలిపి రూ.15,000కు ఇస్తున్నట్లు.. అంతేకానీ బ్యాగ్ ఉచితంగా ఇచ్చినట్లు భావించనవసరం లేదు. కాబట్టి ఐటీసీ రివర్స్ చేయాల్సిన అవసరం లేదు.

అయితే ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఇలా ఉచితంగా ఇచ్చే వస్తువుల వివరాలు కూడా బిల్లులో కూడా చూపాలి. అంటే తీసుకునే మొత్తం రెండింటికి కలిపి అని అర్థం కావాలి. అలాగే జీఎస్‌టీలో కాంపోజిట్ లేదా మిక్స్‌డ్ సరఫరా అనే రెండు రకాల సరఫరాలు ఉంటాయి. ఎప్పుడైతే రెండు వస్తువులను ఒకటే ధరకు అమ్ముతారో అప్పుడు ఆయా వస్తువుల మధ్య ఉన్న సంబంధాన్ని బట్టి అది ఏ సరఫరా అనేది నిర్ధారణ అవుతుంది. ఒకవేళ మీరు అమ్మే వస్తువు.. ఉచితంగా ఇచ్చే వస్తువు మిక్స్‌డ్ సరఫరా కిందకు వస్తే మాత్రం.. ఎక్కువ జీఎస్‌టీ ఏ వస్తువు మీద ఉందో అదే జీఎస్‌టీ మొత్తం బిల్లుకి వర్తిస్తుంది. కాబట్టి వ్యాపారస్తులు ఈ విషయం మీద అవగాహన కలిగి ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ధ్రువ స్పేస్ రూ.52 కోట్ల సమీకరణ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్పేస్‌టెక్ స్టార్టప్ ధ్రువ స్పేస్ వ్యాపార విస్తరణలో భాగంగా ప్రీ-సిరీస్ బీ ఫండింగ్ రౌండ్‌లో రూ.51.76 కోట్ల నిధులను సమీకరించింది. ఈ ఫండింగ్ రౌండ్‌కు అడిటమ్ వెంచర్ క్యాపిటల్ ఫండ్ (ఏవీసీఎఫ్ఐ) యాంకర్ ఇన్వెస్టర్ వ్యవహరించగా, మరో 33 మంది ఇన్వెస్టర్లు ఇందులో పాల్గొన్నారు.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	110	విజయవాడ	113
వరంగల్	110	గుంటూరు	118
కరీంనగర్	110	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	112	అనంతపురం	112
గోదావరి	113		

ఎయిరిండియా మా బాధ్యత కూడా..

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

ముంబై: టాటా గ్రూప్‌నకు "ఎయిరిండియా కేవలం వ్యాపార అవకాశం మాత్రమే కాదు. బాధ్యత కూడా" అని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. విమానయాన రంగంలో సవాళ్లు కొనసాగుతున్నాయని, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలోని సమస్యలు విమానాల విడిభాగాలు, మౌలిక సదుపాయాలు, కొత్త విమానాల లభ్యతను అనిశ్చితిలోకి నెట్టాయన్నారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకులు జేఆర్‌డీ టాటా 121వ జయంతి కార్యక్రమంలో చంద్రశేఖరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఎయిరిండియాను 2022 జనవరిలో రూ.18,000 కోట్లకు టాటా సన్స్ దక్కించుకుంది. అప్పటి నుంచి ఎయిరిండియాను ప్రపంచ స్థాయి ఎయిర్‌లైన్స్‌గా తీర్చిదిద్దేందుకు టాటా గ్రూప్ తీవ్ర కసరత్తు చేస్తోంది.

ఐవీఆర్‌సీఎల్ లిక్విడేషన్ మళ్లీ మొదటికి!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ (ఈపీసీ) కంపెనీ ఐవీఆర్‌సీఎల్ లిమిటెడ్ లిక్విడేషన్ (ఆస్తుల అమ్మకం) ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. ఐవీఆర్‌సీఎల్‌ను రూ.1,200 కోట్లకు దక్కించుకున్న బిడ్డర్ పీ. ప్రసాద్ రెడ్డి నిర్దేశిత సమయం లోగా కంపెనీ రుణదాతలకు చెల్లింపులు జరపడంలో విఫలమయ్యారు. దాంతో ఎస్‌బీఐ నేతృత్వంలోని రుణదాతల కన్సార్టియం ఆరేళ్లుగా (2017 నుంచి) సాగుతున్న ఐవీఆర్‌సీఎల్ దివాలా పరిష్కార ప్రక్రియను పునఃప్రారంభించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే, గత లిక్విడేటర్‌ను కూడా మార్చేసింది. ఐవీఆర్‌సీఎల్ రుణదాతలకు రూ.14,500 కోట్లకు పైగా బకాయిపడింది.

స్పోర్ట్స్

ఆర్చరీలో పతకాల పంట



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు పతకాల పంట పండించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో శనివారం జరిగిన ఇండియన్ రౌండ్ వ్యక్తిగత విభాగం పోటీల్లో లోకేష్ రజతం, మోహిత్ కాంస్యం సాధించారు. ఇక.. లోకేష్ (నెల్లూరు), మోహిత్ (నెల్లూరు), లలిత్ (విశాఖపట్నం), మహీధర్ (విశాఖపట్నం)లతో కూడిన ఏపీ బృందం ఫైనల్లో జార్ఖండ్ చేతిలో ఓడి రజత పతకంతో సరిపెట్టుకుంది. రికర్వ్ బాలికల టీమ్ విభాగంలో ఓల్గా అకాడమీకి చెందిన చెరుకూరి డాలీ శివానీ, వైష్ణవి, రాజేశ్వరి, యుక్తశ్రీ బృందం కాంస్య పతకం సాధించింది. వ్యక్తిగత విభాగంలో యుక్తశ్రీ కాంస్య పతకం దక్కించుకుంది.



అంధుల టీ20 ప్రపంచకప్ గెలిచిన తెలుగమ్మాయి దీపిక సారథ్యంలోని భారత మహిళల జట్టు సభ్యులు శనివారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. తాము సంతకాలు చేసిన బ్యాట్‌ను రాష్ట్రపతికి అందజేశారు.

గంగూలీ భార్య డోనాకు ఆన్‌లైన్ వేధింపులు

పోలీసులకు ఫిర్యాదు



కోల్‌కతా: టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ భార్య, ప్రముఖ నృత్య కళాకారిణి డోనా గంగూలీ ఆన్‌లైన్‌లో వేధింపులకు గురయ్యారు. ఇటీవల కోల్‌కతా ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా డోనా నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఇందుకు సంబంధించి కొందరు ఆకతాయిలు ఆమెను ఉద్దేశిస్తూ సోషల్ మీడియాలో.. ప్రధానంగా ఫేస్‌బుక్‌లో అసభ్యకరమైన కామెంట్లు పోస్టులు చేశారు. ఈ ఘటనపై డోనా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



రోహిత్

ఆ ఇద్దరిపైనే..

రోహిత్, కోహ్లీపై దృష్టి ● వరల్డ్‌కప్ బెర్త్ ఆశిస్తున్న ద్వయం

- నేటి నుంచి దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్
- కోచ్ గంభీర్‌కూ కీలకమే
- గెలుపే ధ్యేయంగా టీమిండియా

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



ప్రాక్టీస్‌లో రాహుల్, కోహ్లీ

రాంచీ: దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ పరాభవం తర్వాత భారత జట్టు పరిమిత ఓవర్ల సిరీస్‌పై దృష్టి సారించింది. ఆదివారం నుంచి ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు జరుగనున్నాయి. చాలా రోజుల తర్వాత వెటరన్ స్టార్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ స్వదేశంలో భారత్ తరపున ఆడనుండడంతో ఈ సిరీస్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. అలాగే రానున్న రెండు నెలల్లో భారత జట్టు కేవలం ఆరు వన్డేలు మాత్రమే ఆడనుంది. దీంతో 2027 వరల్డ్‌కప్‌లో చోటు దక్కించుకోవాలనుకుంటున్న ఈ ఇద్దరికీ ఇందులో రాణించడం కీలకంగా మారింది. ఒకవేళ అంచనాలను అందుకోలేకపోతే మెగా టోర్నీలో వారికి చోటు దక్కడం క్లిష్టంగా మారుతుంది. అయితే 2013లో రోహిత్ ఇదే రాంచీ మైదానంలో తొలిసారి ఓపెనర్‌గా అవతారమెత్తి జట్టు ఆటతీరునే మార్చేశాడు. ఆసీస్ పర్యటనలో ఫర్వాలేదనిపించిన రో-కో సొంతగడ్డపైనా అదరగొట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. అటు టెస్టు సిరీస్‌ను 0-2తో కోల్పోవడంతో కోచ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ సిరీస్‌ను గెలవడం అతడికి కూడా అత్యంత ఆవశ్యకంగా మారింది. దీనికి తోడు ఆసీస్ పర్యటనలో 1-2తో భారత్ వన్డే సిరీస్ ఓడిన విషయం తెలిసిందే. పాతికేళ్ల తర్వాత ఇక్కడ టెస్టు సిరీస్‌ను గెలిచిన ఆనందంలో ఉన్న సఫారీలు ఆత్మవిశ్వాసంతో వన్డే బరిలోకి దిగనున్నారు.

కీలక ఆటగాళ్లు లేకుండానే..

గాయాలతో కెప్టెన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయాస్... విశ్రాంతి పేరుతో పేసర్ బుమ్రా, సిరాజ్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. దీంతో బ్యాటింగ్ ఆర్డర్ బలహీనంగా కనిపిస్తుండగా.. బౌలింగ్‌లోనూ ప్రధాన పేసర్లు లేకపోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు అనుకూలించే వీలుంది. అలాగే జట్టు కూర్పు కూడా సమస్యగా మారింది. ఓపెనర్‌గా గిల్ స్థానంలో రుతురాజ్, జైస్వాల్ మధ్య పోటీ నెలకొంది. ఇక శ్రేయాస్ స్థానంలో ఎవరు బరిలోకి దిగనున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ అతడి స్థానంలో రుతురాజ్‌ను ఆడిస్తే పంత్ స్థానం చేజారినట్టే. అప్పుడు కెప్టెన్ రాహుల్ కీపింగ్ బాధ్యతలు తీసుకుంటాడు. తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్ సైతం బెర్త్ ఆశిస్తున్నప్పటికీ వీళ్లు రిజర్వ్ బెంచీకే పరిమితం కావచ్చు. జడేజాకు తోడుగా స్పిన్‌లో కుల్దీప్‌ను కాకుండా మరో ఆల్‌రౌండర్ సుందర్ వైపు కోచ్ మొగ్గు చూపవచ్చు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నితీశ్‌ను కూడా బరిలోకి దింపే అవకాశం ఉంది. అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ పేస్ బాధ్యతలు తీసుకోనున్నారు.

ఆత్మవిశ్వాసంతో సఫారీలు

భారత్‌లో కీలక ఆటగాళ్లు లేకపోగా.. దక్షిణాఫ్రికా మాత్రం పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగబోతోంది. దీనికి తోడు సిరీస్ క్లీన్‌స్వీప్‌తో బవుమా సేన ఆత్మవిశ్వాసంతో ఉంది. ఓపెనర్‌గా మార్‌క్రమ్‌కు జతగా అనుభవజ్ఞుడు డికాక్ జట్టులో చేరాడు. మిడిలార్డర్‌లో హిట్టర్లు బ్రీట్‌స్కే, బ్రెవిస్‌తో పటిష్ఠంగా కనిపిస్తోంది. ప్రధాన పేసర్లు రబాడ, నోకియా దూరమైనా.. యాన్సెన్, కొట్జీ, బర్గర్, ఎన్‌గిడి భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

పిచ్ వాతావరణం

రాంచీలో మూడేళ్ల క్రితం జరిగిన చివరి వన్డేలోనూ భారత్-దక్షిణాఫ్రికాలే తలపడ్డాయి. ఓవరాల్‌గా ఇక్కడ ఆడిన ఆరు వన్డేల్లో ఒక్కసారి మాత్రమే 300+ స్కోరు నమోదు కాగా, పిచ్ స్పిన్‌కు అనుకూలించనుంది. వర్షం నుంచి ఎలాంటి ముప్పు లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్, జైస్వాల్, విరాట్, రుతురాజ్/పంత్, సుందర్, రాహుల్ (కెప్టెన్), జడేజా, నితీశ్, హర్షిత్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, డికాక్, బవుమా (కెప్టెన్), బ్రీట్‌స్కే, బ్రెవిస్, హెర్మన్, యాన్సెన్, బాష్, కేశవ్, బర్గర్, ఎన్‌గిడి.



బవుమా



ఫైనల్లో భారత్

అజ్లాన్ షా హాకీ కప్

ఇపోహ్ (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్‌లో భారత జట్టు ఫైనల్లో ప్రవేశించింది. శనివారం జరిగిన ఆఖరి పూల్ మ్యాచ్‌లో భారత్ 14-3తో కెనడాను చిత్తుగా ఓడించింది. భారత ఆటగాళ్లలో జుగ్రాజ్ సింగ్ నాలుగు గోల్స్ (12వ నిమిషం, 26వ, 39వ, 50వ) నాలుగు గోల్స్‌తో చెలరేగగా.. అభిషేక్ (57వ, 59వ) రెండు గోల్స్ చేసి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఆట తొలి 15 నిమిషాల్లోనే భారత్ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది. ప్రథమార్థం ముగిసేసరికి 7-1తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మూడు, నాలుగు క్వార్టర్స్‌లో కలిపి ప్రత్యర్థి రెండే గోల్స్ చేయగా భారత్ మరో ఏడు గోల్స్ చేసి ఘన విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో బెల్జియంతో భారత్ తలపడనుంది.

మన కుర్రాళ్ల గోల్స్ వర్షం

- ఒమన్‌పై భారత్ భారీ విజయం
- జూనియర్ హాకీ ప్రపంచకప్

చెన్నై: పురుషుల జూనియర్ హాకీ వరల్డ్‌కప్‌లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో చిలీని చిత్తుచేసిన టీమిండియా.. శనివారం జరిగిన పోరులో ఒమన్‌పై 17-0తో భారీ విజయం సాధించింది. ఆరంభం నుంచే దీటుగా చెలరేగిన భారత కుర్రాళ్లు గోల్స్ వర్షంతో ప్రత్యర్థిని బెంబేలెత్తించారు. భారత ఆటగాళ్ల ధాటికి ఒమన్ ఒక్క గోల్ కూడా నమోదు చేయలేకపోయింది. అర్ష్‌దీప్, మన్‌మీత్, దిల్‌రాజ్ హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించగా.. అజీత్ యాదవ్, ఇంగ్‌లెంబా, గురుజోత్ తలా రెండు గోల్స్‌తో సత్తా చాటారు. అన్మోల్, శర్దానంద్ చెరో గోల్ కొట్టారు. పూల్-బిలో భాగంగా భారత్ తన మూడో మ్యాచ్‌ను స్విట్జర్లాండ్‌తో మంగళవారం ఆడనుంది.



ట్రీసా, గాయత్రి

టైటిల్‌కు అడుగుదూరంలో..

- ఫైనల్లో శ్రీకాంత్, గాయత్రి జోడీ
- సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్ టోర్నీ

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో శ్రీకాంత్ 21-15, 19-21, 21-13తో భారత్‌కే చెందిన మిథున్ మంజునాథ్‌ను ఓడించాడు. మహిళల డబుల్స్ సెమీస్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-11, 21-15తో మలేసియా జంట ఓంగ్ గ్జిన్ యీ/కార్మెన్ టింగ్‌పై గెలిచింది. ఉన్నతి 15-21, 10-21తో నెలిషాన్ అరిన్ (టర్కీ) చేతిలో, తన్వీ శర్మ 17-21, 16-21తో హినా అకెచి (జపాన్) చేతిలో ఓడారు. మిక్స్‌డ్‌లో భారత జంట ట్రీసా/హరిహరన్ 17-21, 19-21తో ఇండోనేసియా జోడీ వార్దానా/ఫెర్డినాష్యా చేతిలో పరాజయం పాలైంది. ఫైనల్స్‌లో జాసన్ గునవాన్ (హాంకాంగ్)తో శ్రీకాంత్, జపాన్ జంట ఒసావ /తనబెతో గాయత్రి జోడీ అమీతుమీ తేల్చుకోనున్నారు.

చికిత డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో తెలుగమ్మాయి చికిత రావు రెండు పతకాలు కొల్లగొట్టింది. రాజస్థాన్‌లో శనివారం జరిగిన కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో రజతం సాధించింది. అదితి గోపిచంద్ స్వర్ణం దక్కించుకుంది. ఇక, టీమ్ విభాగంలో ఎల్‌పీ విశ్వవిద్యాలయం తరపున బరిలోకి దిగిన చికిత, సునైనా, మధుర వర్షిణి త్రయం స్వర్ణం కైవసం చేసుకుంది.

జనవరి 9 నుంచి డబ్ల్యూపీఎల్

ఫిబ్రవరి 5న ఫైనల్
నవీ ముంబై, వడోదరలో మ్యాచ్‌లు

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదలైంది. మొత్తం 5జట్లు పాల్గొనే డబ్ల్యూపీఎల్ వచ్చే జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరుగనుంది. వాస్తవానికి తొలి మూడు సీజన్లు ఫిబ్రవరి-మార్చిలో జరిగాయి. కానీ ఈసారి ఫిబ్రవరి 7 నుంచి స్వదేశంలో టీ20 వరల్డ్‌కప్ జరుగుతుండడంతో డబ్ల్యూపీఎల్‌ను ముందుకు జరిపారు. ఇక.. 28 రోజుల పాటు జరిగే ఈ లీగ్‌లో తొలి 11 మ్యాచ్ (ఇందులో రెండు డబుల్ హెడర్లు)లకు నవీ ముంబై, మిగతా 11 మ్యాచ్ (ఎలిమినేటర్, ఫైనల్)లకు వడోదర ఆతిథ్యం ఇవ్వనున్నాయి. డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య ఆరంభ మ్యాచ్ జరుగనుంది. ఇక, తొలిసారిగా ఫైనల్ మ్యాచ్‌ను వీకెండ్‌లో కాకుండా గురువారం నిర్వహిస్తున్నారు.





గంజాయి బ్యాచ్ దాడిలో గాయపడిన హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ

నెల్లూరులోని జీజీహెచ్‌లో పెంచలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

గంజాయి బ్యాచ్ బరితెగింపు

- నెల్లూరు జిల్లాలో మళ్లీ రెచ్చిపోయిన ముఠా
- హెడ్‌కానిస్టేబుల్‌పై కత్తితో దాడి.. గాయాలు
- సీపీఎం నేత హత్య కేసులో పట్టుకునేందుకు వెళ్లినపుడు ఘాతుకం
- పోలీసుల కాల్పుల్లో ఓ నిందితుడికి గాయం
- కామాక్షి బ్యాచ్ అరాచకం.. వైసీపీతో సంబంధాలు

నెల్లూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గంజాయి బ్యాచ్ మరోసారి బరితెగించింది. గంజాయికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న స్థానిక సీపీఎం నేతను హత్య చేసిన ముఠా.. ఇదే కేసులో వారిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన హెడ్‌కానిస్టేబుల్ పైనా కత్తితో దాడి చేసింది. పోలీసులు రెండు రౌండ్లు కాల్పులు జరపడంతో ఓ నిందితుడు గాయపడ్డాడు. అదుపులోకి తీసుకుని అతడితో పాటు గాయపడిన హెడ్‌కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. శనివారం వేకువజామున ఈ ఘటన జరిగింది. గంజాయి వినియోగానికి వ్యతిరేకంగా సీపీఎం నేత వి.పెంచలయ్య (35) కొన్ని రోజులుగా నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి వద్ద ఆర్టీటీ కాలనీలో పోరాటం చేశారు. ఆయనకు ప్రజల మద్దతు లభించడటంతో తమకు అడ్డువస్తున్నారని కక్షకట్టిన గంజాయి బ్యాచ్ నాయకురాలు, వైసీపీతో సంబంధాలున్నా అరవ కామాక్షి, ఆమె తమ్ముళ్లు, అనుచరులు కలిసి దాడి చేశారు. శుక్రవారం పెంచలయ్యను వేటకొడవళ్లతో వెంటాడి దారుణంగా హత్య చేశారు. పోలీసులు నిందితులను పట్టుకునేందుకు గాలింపు మొదలు పెట్టారు. శనివారం వేకువజాము మూడు గంటల సమయంలో నిందితుల్లో కొందరు కోవూరు సమీపంలోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్నారని తెలుసుకుని అక్కడికి వెళ్లారు. వారిని అదుపులోకి తీసుకునే క్రమంలో జేమ్స్ అనే నిందితుడు హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణపై కత్తితోదాడి చేశాడు. దీంతో రూరల్ సీఐ ఆత్మరక్షణలో భాగంగా తుపాకీతో గాలిలోకి కాల్పులు జరిపారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో మరోసారి కాల్పులు జరిపారు. జేమ్స్ కాలికి గాయం కావడంతో పడిపోయాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇతర నిందితులను పట్టుకునేందుకు బృందాలు గాలిస్తున్నాయి.



పోలీసు కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న నిందితుడు జేమ్స్

2న నెల్లూరు జిల్లా బంద్

పెంచలయ్యను గంజాయి బ్యాచ్ కిరాతకంగా హతమార్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నెల్లూరు జీజీహెచ్ వద్ద ఆయన పెంచలయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. డిసెంబరు 2న నెల్లూరు జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

గంజాయి డాన్.. కామాక్షి!

ఆమె తమ్ముళ్లే ఆమెకు అండ

- మైనర్లే గంజాయి వ్యాపారానికి పెట్టుబడి
- నెల్లూరులో బయటపడ్డ మరో కిలేడీ బాగోతం
- 2019 నుంచే నవాబుపేట స్టేషన్‌లో గంజాయి కేసులు
- రాజకీయ నేతల అండతో నేరసామ్రాజ్యం



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు మినీబైపాస్‌లో అరవ కామాక్షి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నెల్లూరు(క్రైం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటికే లేడీడాన్ అంటే సెటిల్‌మెంట్‌లు, దందాలు, స్కెచ్‌లు వేసే నెల్లూరు జిల్లాకు చెందిన కి'లేడీ' అరుణ గుర్తుకు వస్తుంది. తాజాగా నెల్లూరు నగరంలోనే.. రాజకీయ నాయకుల అండతో గంజాయి డాన్‌గా మారిన ఓ మహిళ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆమె పేరే అరవ కామాక్షి. బోడిగాడితోట ప్రాంతంలో నివాసముంటూ తమ్ముళ్ల అండ, మైనర్ల సహకారంతో గంజాయి వ్యాపారాన్ని ప్రారంభించింది. రాజకీయ నాయకుల అండతో ఎదుగుతూ ఓ నేర సామ్రాజ్యాన్ని స్థాపించుకుంది. నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈనెల 28న జరిగిన పోలీసు ఇన్‌ఫార్మర్, వామపక్షాల నాయకుడు పెంచలయ్య హత్య తర్వాత ఆ మహిళ నేరప్రవృత్తి బయటపడింది.

ఒడిశా నుంచి గంజాయి తెప్పించి..

కామాక్షి తన భర్త లారీ డ్రైవర్ అని చెప్పుకునేది. నిరుపేదలు నివాసం ఉంటే బోడిగాడితోటలో ఆమె గంజాయి విక్రయాలకు తెరలేపినట్లు సమాచారం. ఒడిశా నుంచి గంజాయిని తక్కువ ధరలకు తెప్పించి తమ్ముళ్ల సాయంతో చిన్నచిన్న పొట్లాలుగా కట్టి.. అధిక ధరకు విక్రయాలు చేసేది. విక్రయాలకు ఆ ప్రాంతంలోని పేద లైన బాలురును వాడుకునేది. అయితే, బోడిగాడితోట ప్రాంతం నుంచి నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి సమీపంలోని ఆర్‌జీటీ కాలనీలో పేదల కోటాలో ఆమెకు అధికారులు ఇల్లు మంజూరు చేసి అక్కడికి పంపారు. దీంతో కామాక్షి అక్కడ ఇంటిలో చెత్త సేకరించే దుకాణం ప్రారంభించి, పాత వస్తువులు తీసుకు వచ్చే వారి ద్వారా గంజాయి విక్రయాలు చేయించేదనే ఆరోపణలు ఉన్నాయి.

నేతల్ని ప్రసన్నం చేసుకుని..

కామాక్షికి రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారుతూ ర్యాలీలు, సభలకు యువతను, మహిళలను తీసుకువెళ్లేది. ఈ క్రమంలో ఆమె గంజాయి వ్యాపారానికి రాజకీయ నాయకుల అండ దొరికింది. అధికార పార్టీ నాయకులు పోలీసులకు ఫోన్లు చేసి.. 'ఆమె మన పార్టీనే చూసీచూడనట్లు ఉండండి' అని చెప్పేవారు. దీంతో ఆమె అధికారంలో ఉన్న రాజకీయ నాయకులకు సందరాన్ని బట్టి భారీ ఫ్లెక్స్‌లు కట్టి వారిని ప్రసన్నం చేసుకునేది.

కామాక్షి కుటుంబంపై పలు కేసులు

కామాక్షి బోడిగాడితోట ప్రాంతంలో నివాసం ఉండేది. ఆ సమయంలో ఆమెతోపాటు ఆమె తమ్ముళ్లు ముగ్గురిపై గంజాయి విక్రయాల కేసులతో పాటు, ప్రకాశం జిల్లాలోనూ పలు కేసులున్నాయి. కామాక్షిపై నవాబుపేట పోలీసుస్టేషన్‌లో 2019లో 324 కేసు, 2022, 2023ల్లో గంజాయి కేసులతో పాటు సస్పెక్ట్‌షీట్ ఉంది. తమ్ముడు జేమ్స్‌పై నవాబుపేట పోలీసుస్టేషన్‌లో మూడు కేసులతో పాటు సస్పెక్ట్‌షీట్ ఉంది. మరో తమ్ముడు పెంచయ్యపై నవాబుపేట స్టేషన్‌లో పలు కేసులతోపాటు సస్పెక్ట్ షీట్ ఉంది. మూడో తమ్ముడు కార్తీక్‌పై పలు కేసులతోపాటు సస్పెక్ట్ షీట్ ఉంది.

ప్రభుత్వ ఆస్పత్రిలో 'ప్రత్యేక' పేషెంట్

- గుంటూరు జీజీహెచ్‌కు సాధారణ రోగిలా హెల్త్ సెక్రటరీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సౌరబ్ గౌర్

గుంటూరు మెడికల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అది గుంటూరు ప్రభుత్వ బోధన ఆసుపత్రి ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ)లోని జనరల్ మెడిసిన్ విభాగం. శనివారం మధ్యాహ్నం 12.10 గంటలకు ఓ ప్రత్యేక పేషెంట్ వచ్చారు. డాక్టర్‌ను కలిసి తనకు జలుబు, ఒళ్లు నొప్పులు ఉన్నాయని చెప్పారు. డాక్టర్ సూచన మేరకు పరీక్షల కోసం ల్యాబ్‌కు వెళ్లి నమూనాలు ఇచ్చారు. రిపోర్టు రెండ్రోజుల తర్వాత వస్తుందని చెప్పడంతో తిరిగి డాక్టర్‌ను కలిశారు. వైద్యుడు రాసిచ్చిన మందులు తెచ్చుకున్న తర్వాత ఆయన అధికారులకు ఫోన్ చేశారు. దాంతో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో పాటు ఇతర అధికారులు ఓపీ రూమ్‌కు ఆగమేఘాలపై చేరుకున్నారు. ఆ పేషెంట్ ఎవరో కాదు.. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్. రోగులకు అందే వైద్యసేవలను పరిశీలించేందుకు ఆయనే డెకాయ్ కస్టమర్ (అనైతిక పద్ధతులను కస్టమర్‌లా వచ్చి పరిశీలించడం) అవతారం ఎత్తారు. ఓపీ సేవలు, చికిత్స సమయం తదితర అంశాలను పరిశీలించారు. రోగులకు వైద్య సేవలు సత్వరం అందాలని ఆదేశించారు. ల్యాబ్ పరీక్షలు అదేరోజు అందేలా చూడాలని సూచించారు. లోపాలు సరిదిద్దుకోవాలని ఆదేశించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'మా' ఎన్నికలు అప్పుడే


శనివారం 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) జనరల్ బాడీ మీటింగ్ జరిగినట్లు తెలిసింది. ఈ సమావేశంలో కొన్ని కీలక విషయాలను చర్చించినట్లు టాక్. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే జనరల్ బాడీ మీటింగ్‌లో ఆర్థిక లావాదేవీలు అన్నింటినీ పరిశీలిస్తారట. మేలో ఎన్నికలు నిర్వహించాలని సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఎన్నికల్లో ఏకగ్రీవంగా అధ్యక్షుడిని ఎన్నుకుంటారని సమాచారం. ఎవరైనా అగ్రహీరో కార్యనిర్వాహణ బాధ్యతలు తీసుకోవడానికి ముందుకువస్తే ఆ వ్యక్తిని 'మా' ప్రెసిడెంట్‌గా ఎంచుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.



సోగ్గాడుకు స్వర్ణోత్సవం

'సోగ్గాడు'గా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు శోభన్‌బాబు. ఆయన నటించిన 'సోగ్గాడు' చిత్రానికి డిసెంబర్ 19కి యాభై ఏళ్లు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో ఆ చిత్ర స్వర్ణోత్సవాన్ని సురేశ్ ప్రొడక్షన్స్, అఖిలభారత శోభన్‌బాబు సేవాసమితి సంస్థలు భారీ స్థాయిలో నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ పోస్టర్‌ను పలువురు ప్రముఖులు రామానాయుడు స్టూడియోలో జరిగిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ శోభన్‌బాబుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అలనాటి 'మానవుడు దానవుడు' చిత్రం తనకు ఎప్పటికీ ఇష్టమైన చిత్రంగా పేర్కొన్నారు. శోభన్‌బాబు తమ సంస్థలో పది చిత్రాల్లో నటించారనీ, వాటిల్లో 'సోగ్గాడు' స్థానం ప్రత్యేకమైనదని నిర్మాత సురేశ్‌బాబు పేర్కొన్నారు.

పెద్ది ఫైట్ సీక్వెన్స్



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ కీలక అప్డేట్‌ను మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ ఫైట్‌ను ప్రముఖ బాలీవుడ్ స్టంట్ డైరెక్టర్, హీరో విక్కీ కౌశల్ తండ్రి శ్యామ్ కౌశల్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆయన గతంలో సూపర్ హిట్ చిత్రం 'దంగల్'కు యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. సినిమాలో ఈ ఫైట్ సీక్వెన్స్ ఎంతో కీలకమైనదని మేకర్స్ తెలిపారు. చిత్రానికే ప్రధానాకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఉగాది సందర్భంగా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు వస్తోందీ చిత్రం.

'అఖండ'ను మించిన సన్నివేశాలుంటాయి

ఆది పినిశెట్టి



'అఖండ'ను మించిన భారీ సన్నివేశాలు 'అఖండ 2: తాండవం'లో ఉంటాయి. బాలయ్య యాక్షన్, బోయపాటి మేకింగ్, తమన్ మ్యూజిక్, ఎలివేషన్స్‌ని చూస్తే పదివేల వాట్స్ కరెంట్ షాక్ కొట్టినట్టుగా ఉంటుంది' అని అన్నారు నటుడు ఆది పినిశెట్టి. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్రను పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. సినిమా డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు వస్తోన్న సందర్భంగా ఆది పినిశెట్టి చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'అఖండ 2'లో ఓ పోరాట సన్నివేశాన్ని ఎండాకాలంలో 15 రోజుల పాటు నిర్విరామంగా చిత్రీకరించారు. చాలా మంది ఎండ వేడికి తట్టుకోలేకపోయారు. కానీ బాలయ్య మాత్రం కనీసం గొడుకు కూడా లేకుండా ఎండలోనే నిల్చునేవారు. సినిమా పట్ల ఆయనకు ఉండే ప్రేమ, పిచ్చి నాకు అప్పుడు అర్థమైంది. బోయపాటి గారి మీద నాకు నమ్మకం ఎక్కువ. ఆయన సత్తా ఏమిటో నాకు తెలుసు. అందుకే నేను కథ వినకుండానే ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించాను. సెట్‌కి వెళ్లిన తర్వాతే కథ, నా పాత్ర గురించి తెలిశాయి. ఈ సినిమాలో నేను పోషించిన పాత్ర నటుడిగా నాకు ఓ ప్రయోగం లాంటిది. ఇలానే ఉండాలి...ఇలానే కనిపించాలి..ఇలానే ప్రవర్తించాలి అని బోయపాటి గారు నాకు ముందే కొన్ని రిఫరెన్స్‌లు ఇచ్చారు. బాలకృష్ణ గారు సెట్‌లో ఉంటే పాజిటివ్ వైబ్స్ కనిపిస్తాయి. పనిలో ఆయనను అందుకోవడం చాలా కష్టం' అని ఆది పినిశెట్టి చెప్పారు.

ట్రెండ్‌కు తగ్గట్లుగా ఉంటుంది

సందీప్ రాజ్



'నాకు ఇచ్చిన బడ్జెట్‌లో సినిమాను ఎంత గొప్పగా తీయగలనో చూసుకుంటాను. 'మోగ్లీ'ని అనుకున్న బడ్జెట్‌లో అద్భుతంగా తీశానని అనుకుంటున్నాను' అని అన్నారు దర్శకుడు సందీప్ రాజ్. రోషన్ కనకాల కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. డిసెంబర్ 12న విడుదలవుతున్న సందర్భంగా సందీప్ రాజ్ మీడియాతో ముచ్చటించారు. 'ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగానే 'మోగ్లీ' సినిమా ఉంటుంది. సినిమా ఫస్ట్ హాఫ్ ఆద్యంతం నవ్వించేలా సాగుతుంది. మొత్తం ఐదు పాటలుంటాయి. అన్ని రకాల అంశాల్ని చూపించేలా వాటిని చిత్రీకరించాం. బండి సరోజ్ పాత్రను చూసి అందరూ షాక్ అవుతారు. గత కొన్నేళ్లుగా తెలుగులో ఇలాంటి పాత్రను చూసి ఉండరు' అని చెప్పారు.

డిసెంబర్ 1 నుంచి సావిత్రి మహోత్సవ్




తెలుగు చలన చిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానటి సావిత్రి. డిసెంబర్ 6న ఆమె 90వ జయంతి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 'సావిత్రి మహోత్సవ్' పేరుతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రవీంద్రభారతిలో డిసెంబర్ 1 నుంచి 6 వరకూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సంగమం సంస్థతో కలసి నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో సావిత్రి నటించిన చిత్రాల ప్రదర్శనలు, పాటల పోటీలు నిర్వహిస్తామనీ, చివరి రోజున సావిత్రి స్మారకార్థం 'మహానటి' చిత్ర దర్శకుడు నాగ్‌అశ్విన్, నిర్మాతలు ప్రియాంకదత్, స్వప్నాదత్, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిశోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యను సత్కరించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగే ముగింపు వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు.



ప్రేమ, కుటుంబ విలువలతో

రాజు వెడ్స్ రాంబాయి ఫేం అఖిల్ రాజ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'అర్జునుడి గీతోపదేశం'. వరలక్ష్మి శరత్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సతీశ్ గోగాడ దర్శకత్వంలో ఫస్ట్ కట్ ఫిలిం బేనర్‌పై త్రిలోక్‌నాథ్ కాళిశెట్టి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. చివరి షెడ్యూల్‌ను డిసెంబర్ తొలి వారంలో ప్రారంభిస్తామని నిర్మాత తెలిపారు. 'స్నేహం, వైరం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది, ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. దివిజ ప్రభాకర్, ఆదిత్య శశికుమార్, వసంతిక మచ్చ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: చైతన్య కందుల

క్రీడా నేపథ్యంలో



సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'గోట్'. దివ్య భారతి కథానాయిక. ఎం. చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవలే చిత్రబృందం ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'క్రికెట్ క్రీడ నేపథ్యంలో వినోదం ప్రధానాంశంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. వినోదంతో పాటు సంగీతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. లియోన్‌జేమ్స్ స్వరపరిచిన పాటలు, మణిశర్మ నేపథ్య సంగీతం మా సినిమాకు ప్రధానాకర్షణ. త్వరలోనే 'గోట్' విడుదల తేదీని ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

అద్భుతమైన ప్రేమకథతో...



నవీన్, కుసుమ చందక జంటగా సురేశ్ లంకలపల్లి తెరకెక్కిస్తున్న చిత్రం 'లవ్ డేస్'. మాదాల వెంకటకృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'గీతాంజలి', 'తొలిప్రేమ', 'అందాల రాక్షసి' లాగా ఈ సినిమా కూడా ప్రేక్షకుల హృదయాల్లో ఓ అద్భుతమైన ప్రేమకథలా నిలిచిపోతుంది' అని అన్నారు. సురేశ్ లంకలపల్లి మాట్లాడుతూ 'భావోద్వేగాలు, వినోదం నిండిన సరికొత్త ప్రేమకథ ఇది' అని చెప్పారు.

లిక్కర్ సొమ్ముతో తెలంగాణలో ఆస్తులు

- జగన్ మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి నిర్వాకం
- కోడలు స్నిగ్ధారెడ్డి పేరిట బాన్సువాడలో 3 ప్లాట్ల కొనుగోలు
- మహేశ్వరం, రామచంద్రపురంలోనూ మరిన్ని ఆస్తులు
- ఆధారాలు, డాక్యుమెంట్లు సేకరించిన సిట్ అధికారులు
- జప్తునకు రంగం సిద్ధం.. రేపు కోర్టులో పిటిషన్ వేసే అవకాశం



అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. తాజాగా మాజీ సీఎం జగన్‌కు ఓఎస్డీగా పనిచేసిన కృష్ణమోహన్ రెడ్డి బాగోతం వెలుగులోకి వచ్చింది. తనకు మొబైల్ ఫోన్ లేదని చెప్పే జగన్‌తో ఎవరైనా మాట్లాడాలంటే తాడేపల్లి ప్యాలెస్‌లో ఉండే కృష్ణమోహన్‌రెడ్డిని సంప్రదించేవారు. జగన్‌కు సన్నిహితంగా మెలిగిన ఆయన మద్యం ముడుపులతో తెలంగాణలో భారీగా స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. కృష్ణమోహన్ రెడ్డి తన కోడలు స్నిగ్ధారెడ్డి పేరుతో బాన్సువాడలో రూ.51 లక్షల నగదు (ఎస్ఆర్‌వో విలువ) చెల్లించి కొనుగోలు చేసిన మూడు ప్లాట్ల వివరాలను అధికారులు పసిగట్టారు. శనివారం బాన్సువాడకు వెళ్లి అక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్నిగ్ధారెడ్డి పేరుతో రిజిస్టర్ చేసిన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకున్నారు. ఐటీ నిబంధనలకు విరుద్ధంగా నగదు చెల్లించి ఆస్తులు కొనుగోలు చేసినట్టు గుర్తించారు. ఆ ఆస్తులకు చెల్లించిన సొమ్ము మద్యం ముడుపులేనని సిట్ పక్కా ఆధారాలు సేకరించింది. తెలంగాణలోని మహేశ్వరం, రామచంద్రపురంలో మరిన్ని ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. వాటి వివరాలు తెలుసుకున్న సిట్ అధికారులు డాక్యుమెంట్లు సేకరించి జప్తునకు రంగం సిద్ధం చేశారు. సోమవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో ఈ ఆస్తులకు సంబంధించి జప్తు పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. కృష్ణమోహన్‌రెడ్డి బాగోతంపై ఆదాయ పన్ను శాఖకు సిట్ అధికారులు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

పోచారంతో బంధుత్వం

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో కృష్ణమోహన్‌రెడ్డి స్థిరాస్తులు కొనుగోలు చేయడానికి కారణం ఏంటని సిట్ కూపీ లాగింది. అటు జగన్‌కు, భవిష్యత్తులో ఇటు దర్యాప్తు సంస్థలకు తెలిసే అవకాశం లేకుండా హైదరాబాద్ కాకుండా గ్రామీణ ప్రాంతాలను ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. తన కుమారుడు రోహిత్ రెడ్డికి తెలంగాణలో అన్నివిధాలా బలగం ఉండాలని బాన్సువాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి మనుమరాలు స్నిగ్ధారెడ్డితో వివాహం జరిపించారు. 2019లో ఏపీలో అధికారంలోకి వచ్చిన వైసీపీకి పొరుగు రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందించింది. కేసీఆర్ హయాంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి పనిచేశారు.

కసిరెడ్డికీ ఆస్తులు

ఇప్పటికే ఏ1 రాజ్ కసిరెడ్డికి సంబంధించి భారీగా స్థిరాస్తులు తెలంగాణలో ఉన్నట్టు వెలుగులోకి వచ్చాయి. వాటిని జప్తు చేసిన అధికారులు ఇతర నిందితులకు సంబంధించిన ఆస్తులున్నాయా? అనే కోణంలో కూపీ లాగుతున్నారు. లిక్కర్ ముఠా పలు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో సైతం మద్యం ముడుపుల సొమ్ముతో వందల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడం, ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు డబ్బు పంపిణీ చేయడం, కిలోల కొద్దీ బంగారం కొనుగోలు చేయడం, సూట్ కేసు కంపెనీల ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడటం వంటి అంశాలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి. సుమారు యాభై మందికి పైగా నిందితులను సిట్ అధికారులు ఈ కేసులో చేర్చారు. ఇటీవలే ముంబైకి చెందిన హవాలా వ్యాపారిని అరెస్టు చేశారు. దీంతో అరెస్టయిన వారి సంఖ్య 13కు చేరింది.

'దిత్వా' డేంజర్!



శనివారం సాయంత్రం నెల్లూరు నగరంలో కురుస్తున్న వర్షం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల్లో వర్షాలు, ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. శనివారం అర్ధరాత్రి తర్వాత వర్షాలు పెరగనున్నాయి. తీర ప్రాంతాల్లో 50-70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. దిత్వా తుఫాన్ తీవ్ర వాయుగుండంగా మారి ఆదివారం తెల్లవారుజామున తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. దీనిప్రభావంతో రానున్న 48 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున తీరం దిశగా అలలు ఎగిసిపడుతున్నాయి. సోమవారం వరకూ మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. కృష్ణపట్నం పోర్టులో మూడు, మిగిలిన ఓడరేవుల్లో రెండో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

సముద్రంలోనే బలహీనపడనున్న తుఫాన్!

నైరుతి బంగాళాఖాతంలో 'దిత్వా' తుఫాన్ శనివారం గంటకు 10 కిలోమీటర్ల వేగంతో తమిళనాడు తీరానికి సమాంతరంగా పయనించింది. శనివారం రాత్రికి కరైకాల్‌కు 100, పుదుచ్చేరికి దక్షిణ ఆగ్నేయంగా 180 కి.మీ, చెన్నైకు దక్షిణంగా 280 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించే క్రమంలో శనివారం రాత్రి నుంచి తమిళనాడు తీరానికి 25నుంచి 50 కి.మీ. దూరంలో సమాంతరంగా పయనించి ఆదివారం ఉదయానికి చెన్నై, దక్షిణ కోస్తాంధ్రకు అతి చేరువగా రానున్నది. ఆ తర్వాత కూడా దక్షిణ కోస్తాలోని తీరానికి ఆనుకుని అతి చేరువగా అంటే తీరానికి 25 నుంచి 60 కి.మీ. దూరంగా పయనించే క్రమంలో తీవ్ర వాయుగుండంగా బలహీనపడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. దక్షిణ కోస్తాకు ఆనుకొని పయనిస్తూ సోమవారం నాటికి సముద్రంలోనే పూర్తిగా బలహీనపడుతుందని పేర్కొన్నారు. అయితే సోమవారం తెల్లవారుజామున శ్రీహరికోట పరిసరాల్లో తీరం దాటుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు అంచనా వేశారు.

కలెక్టర్లతో సీఎస్ టెలికాన్ఫరెన్స్

తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ప్రజలు, రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ నుంచి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌ల ద్వారా తుఫాన్ సమాచారాన్ని పంపాలని స్పష్టం చేశారు. మత్స్యకారులు డిసెంబరు 2 వరకు సముద్రంలోకి వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం ఆయన విజయవాడ క్యాంప్ ఆఫీస్ నుంచి బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకునేలా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉన్న వారిని ముందే గుర్తించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత



తుఫాన్ తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ- ప్రభావిత జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. భారీ వర్షాలు కురిసేటప్పుడు ప్రజలు ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావితమయ్యే జిల్లాల కలెక్టర్లతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. 'వెంటనే సహాయక బృందాలను పంపాలి. ప్రాణనష్టం జరగకుండా ముందస్తుచర్యలు తీసుకోవాలి. తుఫాన్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు కింది స్థాయి అధికారులు, ప్రజలకు తెలియజేయాలి. కంట్రోల్ రూమ్‌లు 24/7 నిర్వహించాలి. అవసరమైతే ప్రజలను సహాయ శిబిరాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలి. బలమైన ఈదురుగాలులు వీచేటప్పుడు ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల వద్ద ఉండకుండా అప్రమత్తం చేయాలి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలి' అని కలెక్టర్లను ఆదేశించారు.





'దిత్వా' తుఫాన్ గమనం తెలిపే మ్యాప్

వర్షాలు పడే జిల్లాలు ఇవే..

ఆదివారం ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వివరించింది. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి తుఫాన్ గమనాన్ని పర్యవేక్షిస్తూ, ప్రభావం చూపే జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. తుఫాన్ వేళ అత్యవసర సహాయ చర్యల కోసం కడపలో రెండు ఎన్డీఆర్ఎఫ్, వెంకటగిరిలో మూడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులను వెనక్కి రప్పించామని చెప్పారు.

శ్రీలంకలో చిక్కుకున్న ఏడుగురు ఏపీవాసులు

రాపూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుఫాను కారణంగా రాష్ట్రానికి చెందిన ఏడుగురు మూడు రోజుల నుంచి శ్రీలంకలో చిక్కుకుపోయారు. కువైట్ నుంచి బయలుదేరి రావాల్సిన వీరు.. కొలంబో విమానాశ్రయంలో ఆగిపోవాల్సి వచ్చింది. అక్కడ బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ నెల 27న కువైట్ నుంచి తిరుపతి జిల్లా రాపూరు మండలం అక్కమాంబాపురానికి చెందిన శివ, సుధాకర్, కోటితో పాటు అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన నలుగురు చెన్నై విమానాశ్రయానికి చేరాల్సి ఉంది. అయితే తుఫాను కారణంగా వారు శ్రీలంకలోని మత్తేలే విమానాశ్రయంలో దిగారు. అక్కడి నుంచి విమానాశ్రయ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో కొలంబో ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. శనివారం ఉదయం 7 గంటలకు విమానం బయలుదేరుతుందని సమాచారమిచ్చి.. అనంతరం అరగంట తర్వాత విమానం రద్దు అయిందని అధికారులు చెప్పారు. దీంతో వారు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నీరు, ఆహారం, ఇతర వసతులు కల్పించలేదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ చొరవ తీసుకుని తమను సొంతూరికి చేర్చాలని కోరుతున్నారు.



శ్రీలంకలో చిక్కుకున్న రాపూరు, రాజంపేట వాసులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం,
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref:B1/134/2025 ఫారమ్ నెం. VI (ఎ) Dt.29.11.2025

(2013వ భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19), సబ్‌రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం, స్వర్ణవారిగూడెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద చింతూరు మండలం, ఉలుమూరు గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా పునరావాస, పునఃస్థాపనల క్రింద, వారికి భూమి కేటాయించు నిమిత్తం భూమి అవసరమైనట్లు శ్రీప్రాజెక్టు ఆఫీసర్, మరియు ఆర్.అండ్.ఆర్ ఆఫీసర్ చింతూరు యూనిట్ వారు అల్లూరి సీతారామరాజు జిల్లా భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీ చేయబడినది.

ఇఐఏ మదింపు ప్రభావం పర్యావరణ సంబంధించి ప్రాజెక్టుకు ఇరిగేషన్ పోలవరం క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం-1-2005/74/12011-ఐ ఎ1 తేది 25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

(1)43 విభాగం చట్టంలోని క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది.10.05.2020వ తేదిన జారీ చేసిన జి.ఓ.యం.యస్.నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రపురం యూనిట్-1, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ.విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా కలెక్టరు / ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును

షెడ్యూలు

జిల్లా : ఏలూరు | మండలం : జీలుగుమిల్లి | గ్రామం : దర్భగూడెం

వరుస సంఖ్య	సర్వే నెంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి / భర్త పేరు)	సరిహద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు మరియు కట్టడములు ఇతరముల వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	95-6	G.Dry	1.00	1.00	సైదిమల్ల సత్తిరెడ్డి తండ్రి సీతారామిరెడ్డి	96	94	72	107	
2	195-3	G.Dry	2.40	2.40	సైదిమల్ల భాస్కర్ రెడ్డి తండ్రి దుర్గారెడ్డి	195-1A	200	195-1C2	195-1A	
3	195-4	G.Dry	3.80	3.80	సైదిమల్ల దుర్గారెడ్డి తండ్రి సీతారామిరెడ్డి	197	195-1C1	199	195/1A	
4	195-4	G.Dry	1.40	1.40	సైదిమల్ల కృష్ణారెడ్డి తండ్రి దుర్గారెడ్డి	195-2	193-3	195-1A	194	
5	38	G.Dry	1.62	1.62	ముత్తిరెడ్డి కృష్ణారెడ్డి తండ్రి వెంకటరెడ్డి	34	37	36	39	
6	132-3	G.Dry	0.72	0.72	ముప్పిన జానిరెడ్డి తండ్రి సీతారామిరెడ్డి	135	136	132-1	135	
7	133-2	G.Dry	2.00	2.00		135	136	132-1	135	
8	135-3	G.Dry	3.64	3.64		164	136	132	138	
9	160-1	G.Dry	0.62	0.62		161	164	164	159	
10	45	G.Dry	1.63	1.63	దేవని వాసునాగవెంకటరమణ తండ్రి అప్పారావు	36	46	47	42	
11	145-1	G.Dry	2.3	2.30		158	144	164	247	
12	45	G.Dry	4.89	4.89	దేవని వాసునాగవెంకటరమణ తండ్రి అప్పారావు	36	46	47	42	
13	87	G.Dry	3.76	3.76	పెదియం వెంకటారావు తండ్రి వెల్లయ్య	81	84	82	86	బోరవే
14	205	G.Dry	1.85	1.85	కారంపూడి సత్యనారాయణ తండ్రి అంజనేయులు	207	203	42	206	
15	203-1A	G.Dry	2.32	2.32		205	98	204	202	
16	260/2	G.Dry	3.6	3.60	దేవని దుర్గారావు తండ్రి పరసింహారావు	1	261	1	1	
17	45	G.Dry	0.7	0.70		36	46	47	42	
18	42-2	G.Dry	3.8	3.80	గంగు సుజన భర్త శ్రీనివాసరెడ్డి	37	44	45	207	
19	44	G.Dry	0.21	0.21		42	49	46	42	
20	194	G.Dry	0.71	0.71		191	193	195	192	
21	183-1	G.Dry	1.00	1.00	యరకొరెడ్డి వీర రెడ్డి తండ్రి రత్నారెడ్డి	189	181	191	184	
22	261	G.Dry	1.66	1.66	దేవని విజయ భర్త రాఘవరావు	260	262	258	1	
23	85	G.Dry	2.92	2.92	మద్దువేని విజయకుమారి తండ్రి సుబ్బారావు	86	గంగన్న గూడెం గ్రామం	82	86	
	మొత్తం		48.55	48.55						

ప్రదేశం : చింతూరు, యూనిట్-1
తేది : 29-11-2025

డి. చంద్రశేఖర్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్ -1, చింతూరు

సం/- యస్. సరళావందనం
భూసేకరణాధికారి మరియు స్పెషల్ కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,రాజమహేంద్రవరం

శ్రీలంకలో 'దిత్వా' విధ్వంసం

153 మంది మృతి.. 191 మంది గల్లంతు



భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ బంధులో భాగంగా శ్రీలంకలో తుఫాను బాధితులను తరలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

- అనేక ఇళ్లు ధ్వంసం..నిరాశ్రయులైన వేలమంది
- ప్రభుత్వ శిబిరాలకు లక్షమందికిపైగా తరలింపు
- 27 టన్నుల సహాయ సామగ్రి పంపిన భారత్
- మరింత సాయం పంపేందుకు సిద్ధం: మోదీ
- భారత్ వైపు దూసుకొస్తున్న తుఫాను

కొలంబో, నవంబరు 29: దిత్వా తుఫాను శ్రీలంకలో విధ్వంసం సృష్టించి భారత్ వైపు దూసుకొస్తోంది. తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో శ్రీలంకలో ఇప్పటికే 153 మంది మరణించగా, మరో 191 మంది గల్లంతయ్యారని కొలంబోలోని విపత్తుల నిర్వహణ కేంద్రం(డీఎంసీ) శనివారం ప్రకటించింది. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. వారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు 25 జిల్లాల్లోని 2.17 లక్షల కుటుంబాలకు చెందిన 7.74 లక్షలమందికిపైగా ప్రజలు తీవ్రంగా ప్రభావితమయ్యారు. అనేక ఇళ్లు ధ్వంసమవడంతో లక్ష మందికిపైగా బాధితులను ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలించామని డీఎంసీ డీజీ కె.సంపత్ విలేకరులకు తెలిపారు. సైనిక దళాల సాయంతో సహాయ, పునరావాస కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కాగా, మటలే జిల్లాలో గురువారం అత్యధికంగా 54 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మటలే, పొలొన్నరువ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు, కీలక వంతెనలు కూడా కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతాలకు సాయం అందడం లేదు. వరదల్లో చిక్కుకున్నవారిని కాపాడేందుకు మిలిటరీ హెలికాప్టర్లు, బోట్లను వినియోగిస్తున్నారు. నదులు ఉప్పొంగడంతో వాటి ఒడ్డున నివసించేవారంతా సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని అధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. వందలాదిమందిని తాత్కాలిక శిబిరాలకు తరలించారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిశనాయకె దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కాగా, దిత్వా శ్రీలంక నుంచి నిష్క్రమించి భారత్‌వైపు వెళ్తోందని శ్రీలంక వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ అతుల కరుణనాయకె తెలిపారు. శ్రీలంకను ఆదుకునేందుకు భారత ప్రభుత్వం ఆపరేషన్ సాగర్ బంధు చేపట్టింది. శుక్రవారం 6 టన్నుల సహాయ, పునరావాస సామగ్రిని శ్రీలంకకు పంపింది. శనివారం రెండు మిలిటరీ రవాణా విమానాల్లో మరో 21 టన్నుల సామగ్రిని పంపింది. మరింత సాయం పంపించేందుకు సిద్ధంగా ఉన్నామని భారత ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో తెలిపారు. మృతులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఇప్పటికే భారత విమాన వాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌కు చెందిన రెండు హెలికాప్టర్లు శ్రీలంకలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ, 80 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో కూడిన రెండు సహాయక బృందాలను కూడా శ్రీలంక పంపినట్టు విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. ఇప్పటికే సముద్ర, వాయు మార్గాల్లో 27 టన్నుల సామగ్రిని శ్రీలంకకు అందించామని, మరింత సాయం అక్కడికి చేరుతోందని చెప్పారు. భారత్ బాటలోనే అమెరికా, మాల్దీవులు కూడా శ్రీలంకకు సాయం ప్రకటించాయి. తక్షణ సాయంగా శ్రీలంకకు రూ.17.86 కోట్లు(2 మిలియన్ డాలర్లు) కేటాయిస్తున్నామని అమెరికా తెలిపింది. శ్రీలంకకు రూ.44 లక్షలు(50 వేల డాలర్లు), 25 వేల కేసుల ట్యూనా క్యాన్లు పంపిస్తున్నామని మాల్దీవుల ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

3 రోజులుగా భారత ప్రయాణికుల అవస్థలు..

దుబాయి నుంచి శ్రీలంక మీదుగా భారత్‌కు బయలుదేరిన సుమారు 300 మంది ప్రయాణికులు.. దిత్వా తుఫాను వల్ల విమానాలు రద్దవడంతో గత మూడు రోజులుగా కొలంబోలోని విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. వారిలో 150 మంది తమిళనాడువాసులు ఉన్నారు. తమకు తగినంత ఆహారం, నీరు, ఇతర మౌలిక సదుపాయాలూ కల్పించలేదని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. కొలంబోలోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో వారందరినీ సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు కొలంబోలోని రాయబార కార్యాలయ అధికారులతో తమిళనాడు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీలంకలోని భారత తాత్కాలిక రాయబారి డాక్టర్ సత్యాంజల్ పాండే.. కొలంబో విమానాశ్రయంలో చిక్కుకుపోయిన భారతీయులను కలిశారు. వారిని వెంటనే స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేస్తోందని భరోసా కల్పించారు. విమానాశ్రయంలో అత్యవసర హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. భారతీయులందరికీ ఆహారం, నీరు సహా సాయాన్ని అందిస్తున్నారు.



తుఫాను కారణంగా పోటెత్తిన భారీ వరదలతో శ్రీలంకలో మునిగిపోయిన ఒక ప్రాంతం

చెన్నైలో భారీ వర్షం

54 విమానాలు రద్దు.. స్కూళ్లకు సెలవు

పరీక్షలు వాయిదా వేసిన పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) శ్రీలంకలో విధ్వంసం సృష్టించిన 'దిత్వా' తుఫాను భారత్‌వైపు దూసుకొస్తుండటంతో తమిళనాడులోని 9 జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. శనివారం రాత్రి నుంచే చెన్నై నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తోంది. తమిళనాడు, పుదుచ్చేరి తీరం వెంబడి గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో అప్పుడప్పుడు 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. కేరళ, కర్ణాటక, ఏపీ, తెలంగాణల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరించింది. తమిళనాడు ప్రభుత్వం శనివారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించింది. అలాగే, శనివారం జరగాల్సిన అన్ని పరీక్షలనూ వాయిదా వేశామని పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రకటించింది. తమిళనాడులోని తీరప్రాంత జిల్లాలతో పాటు, పుదుచ్చేరిలో 14 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. తుఫాను ఆదివారం ఉదయం చెన్నై తీరాన్ని సమీపించనుందని చెన్నైలోని వాతావరణ పరిశోధన కేంద్రం సౌత్‌జోన్ అధ్యక్షురాలు అముదా తెలిపారు. 14 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. కావేరి డెల్టా జిల్లాలు, కారైక్కాల్ ప్రాంతాల్లో గంటకు 55 నుంచి 65 కి.మీ.ల వేగంతో, అప్పుడప్పుడు 75 కి.మీ.ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెన్నై వాతావరణ శాఖ డైరెక్టర్ పి.సెంథామరై కన్నన్ తెలిపారు. పుదుచ్చేరిలో గంటలకు 60 నుంచి 70 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, తిరువణ్ణామలై, వేలూరు, తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించారు. సేలం, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాలతోపాటు పుదుచ్చేరిలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. చెన్నైలోని పలు నగరాలకు వెళ్లాల్సిన 54 విమాన సర్వీసులను రద్దు చేశారు. తుఫాను చెన్నై నగరం వైపే దూసుకొచ్చి తీరం దాటే అవకాశం ఉందని తమిళనాడు రెవెన్యూ శాఖ మంత్రి రామచంద్రన్ చెప్పారు.

ఇక గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డులు!

» హెచ్‌ఎస్‌ఎల్, జీఆర్‌ఎస్‌ఈ ముందుకు...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డు

రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డులు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకూ సంప్రదాయ షిప్‌యార్డుల్లోనే నౌకా నిర్మాణం జరుగుతోంది. వీటిలో విశాఖపట్నం కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడ హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్), నేవల్ డాక్‌యార్డ్, షిప్ బిల్డింగ్ సెంటర్ వేర్వేరుగా నౌకలు, సబ్‌మెరైన్ల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నాయి. వీటిపై ఆధారపడి కొన్ని వందల అనుబంధ పరిశ్రమలు నడుస్తున్నాయి. షిప్ బిల్డింగ్ సెంటర్‌లో అధునాతన న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణం జరుగుతోంది. ఇక హెచ్‌ఎస్‌ఎల్‌లో రక్షణ శాఖకు అవసరమైన నౌకలు నిర్మితమవుతున్నాయి. నేవీకి సంబంధించిన నౌకల మరమ్మతులన్నీ డాక్‌యార్డ్‌లో నిర్వహిస్తున్నారు. ఇప్పుడు గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డుల ఏర్పాటుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి.

గ్రీన్‌ఫీల్డ్ షిప్ యార్డ్ అంటే...?

ఇప్పటివరకూ ఎటువంటి పరిశ్రమలు లేని, అభివృద్ధి చెందని సముద్ర తీర ప్రాంతంలో ఏర్పాటుచేసే నౌకా నిర్మాణ కేంద్రాన్ని 'గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్'గా వ్యవహరిస్తున్నారు. అందులో డ్రై డాక్, స్లిప్ వేలు, ఫ్యాబ్రికేషన్ వంటి విభాగాలతో నౌకా నిర్మాణానికి మౌలిక వసతులు ఉంటాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటారు. ఆత్మనిర్భర్ భారత్ కింద దేశీయంగా నౌకా నిర్మాణం పెంచాలని 'మేరీటైమ్ అమృత్ కాల్ విజన్-2047' పేరుతో సంస్థలను కేంద్రం ప్రోత్సహిస్తోంది. దేశీయ అవసరాలకు అనుగుణంగా నిర్మాణ సామర్థ్యం పెంచడమే వీటి లక్ష్యం. విశాఖలోని హెచ్‌ఎస్‌ఎల్‌కు నౌకా నిర్మాణంలో 85 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రైవేటు సంస్థగా ఏర్పాటైన హెచ్‌ఎస్‌ఎల్ ప్రస్తుతం రక్షణ శాఖ ఆధీనంలో పనిచేస్తోంది. నష్టాల నుంచి బయటపడి గత ఆర్థిక సంవత్సరంలో రూ.284కోట్ల లాభం ఆర్జించింది. సుమారు రూ.19 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు వీరి దగ్గర ఉన్నాయి. ఈ సంస్థ గ్రీన్‌ఫీల్డ్ శాటిలైట్ షిప్‌యార్డ్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ మేరీటైమ్ బోర్డు (ఏపీఎంటీబీ) ఈ నెల విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో దీనిపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శ్రీకాకుళం జిల్లా మూలపేటలో గానీ, కాకినాడలో గానీ 150 ఎకరాలు కేటాయిస్తే శాటిలైట్ షిప్‌యార్డ్ నిర్మిస్తామని ప్రతిపాదించింది.

కోల్‌కతా నుంచి ఏపీకి

కోల్‌కతా కేంద్రంగా నౌకా నిర్మాణ రంగంలో ఉన్న గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ) సంస్థ రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ నిర్మాణానికి ఆసక్తి చూపుతోంది. తూర్పు నౌకాదళం విశాఖకు 50 కి.మీ. దూరాన రాంబిల్లిలో నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ స్థావరానికి సమీపంలో షిప్‌యార్డ్ ఏర్పాటు చేస్తామని, భూమిని కేటాయించాలని 2016-17లోనే ప్రతిపాదనలు సమర్పించింది. అవి అప్పట్లో సాకారం కాలేదు. ఇప్పుడు మళ్లీ ఈ నెలలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఏపీఎంటీబీతో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ నిర్మాణానికి ఎంవోయూ చేసుకుంది. లోతైన సముద్ర జలాలకు చేరువగా, రవాణా సౌకర్యం కలిగిన భూమిని కేటాయించాలని కోరింది. హెచ్‌ఎస్‌ఎల్, జీఆర్‌ఎస్‌ఈతో పాటు విశాఖలోని ఇండియన్ మేరీటైమ్ యూనివర్సిటీ కూడా ఒక ఎంవోయూ కుదుర్చుకుంది. నౌకా నిర్మాణ సామర్థ్యం పెంపు, పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధిలో పలు ప్రాజెక్టులు చేపడతామని ప్రతిపాదించింది.

అసభ్యకర పోస్టుల కేసులో భాస్కర్‌రెడ్డికి బెయిల్

విజయవాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన మాలేపాటి భాస్కర్‌రెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు విజయవాడ రెండో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి రాధిక శనివారం తీర్పు వెలువరించారు. ప్రస్తుతం భాస్కర్‌రెడ్డి నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రెండు నెలలపాటు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి 5 గంటల వరకు పెనమలూరు పీఎస్‌లో హాజరుకావాలని, రూ.25 వేల చొప్పున ఇద్దరు పూచీకత్తులు సమర్పించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని షరతులు విధించారు. ఈ కేసులో భాస్కర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది.

మావోయిస్టుల కస్టడీ పిటిషన్ తిరస్కరణ

» జిల్లా కోర్టులో దాఖలుకు న్యాయాధికారి సూచన

విజయవాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పటమట పోలీసులకు చిక్కిన నలుగురు మావోయిస్టులను కస్టడీకి ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈ నెల 18న పొడియా బీమా అలియాస్ రంగు, మడకం లక్మ అలియాస్ మదన్, మడవి చిన్మయ్ అలియాస్ మనీలా, మంగి డొక్కు పాడిలను పటమట పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. వారిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు నాల్గో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను మచిలీపట్నంలోని జిల్లా కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచిస్తూ కొట్టేసింది.



ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా 'సర్గం-2025' కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, తదితరులు

అలరించిన నేవీ 'సర్గం-2025'

ఆకట్టుకున్న నౌకాదళ ఆర్కెస్ట్రా

విశాఖలో కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కేంద్రంలో ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా 'సర్గం-2025' కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. వచ్చే నెల 4న నిర్వహించే నేవీ డే సన్నాహకాల్లో భాగంగా 'సముద్రిక' ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన ఈ సంగీత కార్యక్రమం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన కుమారుడు అకీరా నందన్‌తో కలిసి హాజరయ్యారు. మ్యూజిక్ కంపోజర్, ఈఎన్‌సీ బ్యాండ్ డైరెక్టర్ సతీశ్, డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్‌ల సంగీత దర్శకత్వంలో దేశభక్తి గీతాలు, హిందీ పాటలు ఆలపించారు. పర్యావరణానికి సంబంధించిన అంశాలతో నేవీ బ్యాండ్ రూపొందించిన సంగీత కార్యక్రమాన్ని పవన్ ఆసక్తిగా తిలకించారు. గంటకు పైగా సాగిన ఈ కార్యక్రమం అందరినీ అలరించింది. పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా లయన్ కింగ్ మ్యూజిక్ మెమొంటోను భరత్‌కుమార్ సింగ్ అందుకున్నారు. పవన్‌కల్యాణ్‌కు ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా జ్ఞాపిక అందజేశారు. అంతకుముందు విశాఖపట్నం విమానాశ్రయంలో పవన్ కల్యాణ్‌కు నేవీ అధికారులు రజనీశ్ శర్మ, కిశోర్‌లతో పాటు జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన నేవల్ కమాండ్‌లోని శౌర్య అతిథిగృహానికి చేరుకోగా అక్కడ వారికి ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, ఆయన భార్య ప్రియా భల్లా స్వాగతం పలికారు. అక్కడే నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో పవన్ భేటీ అయ్యారు.



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో తనయుడు అకీరా నందన్

రాష్ట్రంలో ప్రాంతీయ జోన్లు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు స్పందించారు. రాజధాని రైతులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు ఒకే గొడుగు కిందకు రావాలని, అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ పేరిట జేఏసీగా ఏర్పడితే వారి సమస్యలపై సంప్రదింపులకు మార్గం తేలిక అవుతుందని సీఎం తెలిపారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లామని, ప్రధాని మోదీతో కూడా మాట్లాడి సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తామన్నారు. పనులపై కార్యాలయాలకు వచ్చే రాజధాని రైతులను సిబ్బంది డబ్బులు అడిగితే కఠిన చర్యలు ఉంటాయని, భూత్యాగం చేసిన రైతులతో గౌరవంగా మెలగాలని అధికారులందరినీ ఆదేశిస్తానని చెప్పారు. సీఆర్డీయే అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, రాష్ట్రంలో అవినీతి నిర్మూలన అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ రైతులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తుందన్నారు. రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో లేఔట్ల అనుమతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కాగా, చంద్రబాబు ప్రస్తావించిన ప్రాంతీయ జోన్ల విధానం గతంలో ఉండేది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం వీటిని ఏర్పాటు చేశారు. అయితే విధులు.. నిధుల కేటాయింపు సరిగా లేకపోవడంతో అవి నిర్వీర్యమయ్యాయి. కూటమి ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా తిరిగి ప్రాంతీయ జోన్లను పునరుద్ధరించే ఆలోచన చేస్తోంది.

క్యాడర్‌కు శిక్షణ తరగతులు

డిసెంబరు 1 నుంచి పార్టీ క్యాడర్‌కు కేంద్ర కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించే విధానంపై చంద్రబాబు పార్టీ నేతలతో చర్చించారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా శిక్షణ తరగతులు ఉండాలని, అదే సమయంలో పార్టీ క్యాడర్‌ను ఎంపవర్ చేసేలా వారు తమ కాళ్లపై తాము ఆర్థికంగా నిలబడేలా వీటిని నిర్వహించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీ నుంచి విమర్శలు వచ్చినప్పుడో లేదా ఏదైనా సమస్య వచ్చినప్పుడో పార్టీ స్పందించడం కాకుండా అసలు సమస్య రాకుండా ముందస్తుగా వ్యూహరచన జరగాలని, ఈ దిశగా పార్టీ బ్యాక్ ఆఫీసు సిబ్బంది కసరత్తు చేయాలని చంద్రబాబు సూచించారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను ముందుగానే పసిగట్టే విధంగా పార్టీ యంత్రాంగం సమాయత్తం కావాలని కోరారు. తాను, లోకేశ్ పార్టీపై దృష్టి సారించి, నిరంతరాయంగా సమీక్షలు చేయడం మొదలుపెట్టిన తర్వాత...అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించడంలో.. గ్రీవెన్సులు నిర్వహించడంలో ఐదు శాతం పురోగతి కన్పించిందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో 58 శాతం ఉన్నది ప్రస్తుతం 63 శాతానికి వచ్చిందని, మున్ముందు ఇది వంద శాతానికి చేరాలని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రణాళికలు రూపొందించుకోవాలి..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో ఎక్కడా వెనకడుగు వేయడం లేదని, అదే సమయంలో ప్రజల ఆశలు .. అవసరాలు నెరవేర్చేందుకు పార్టీ ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు తెలిపారు. అరటి, పత్తి విషయంలో గిట్టుబాటు ధరలు లేవంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతూ, అనవసర విమర్శలు చేస్తున్నాయని, ఇలాంటి అంశాలపై సరైన వ్యూహంతో విమర్శలను తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి వనరుల లభ్యత పెరిగి, సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. అప్పటి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించాలని కోరారు.



టీడీపీ కేంద్రకార్యాలయంలో మహిళల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

మహిళల జోలికెళితే ఉపేక్షించను

» పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించొద్దు

» మంత్రి సంధ్యారాణి పీఏ వ్యవహారంపై సీఎం చంద్రబాబు సీరియస్

మహిళల విషయంలో టీడీపీ శ్రేణులు, నాయకులు, మంత్రుల వద్ద పనిచేసే సిబ్బంది గౌరవప్రదంగా మెలగాలని, మహిళలకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు అందుబాటులో ఉన్న నేతలతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పీఏ ఓ మహిళ విషయంలో వ్యవహరించిన తీరు చర్చకు వచ్చింది. ఈ అంశంపై చంద్రబాబు స్పందిస్తూ.. మహిళల విషయంలో తప్పు చేసిన వారి విషయంలో తక్షణం చర్యలు ఉండాల్సిందేనని, ఇందులో మరో మాటకు తావు లేదని స్పష్టం చేశారు. ఆడబిడ్డలను గౌరవించడంలో తొలి నుంచీ టీడీపీ ముందు వరుసలో ఉందని, అలాంటిది పార్టీకి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఎవరు వ్యవహరించినా సహించేది లేదన్నారు. క్రమశిక్షణ విషయంలో పార్టీ లైన్ దాటే వారి విషయంలో చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ విషయాన్ని త్వరలో తాను మాట్లాడి కొలిక్కి తీసుకొస్తానని తెలిపారు. పార్టీ కన్నా ఎవ్వరూ గొప్పవారు కాదని, అలాంటి ఊహల్లో ఉండే వారు నిరభ్యంతరంగా పార్టీని వదిలి బయటకు వెళ్లిపోవచ్చన్నారు. మండల పార్టీ అధ్యక్షుల నియామకాల్లో పార్టీ క్యాడర్ అభిప్రాయానికి పెద్ద పీట వేయాలన్నారు. పోలవరం, శింగనమల, జీడీ నెల్లూరు నియోజకవర్గాల్లో రెండు మండలాల చొప్పున నేతలు సూచించిన పేర్లకు.. పార్టీ క్యాడర్ సూచించే పేర్లకు పొసగకపోవడంతో అక్కడ ఐవీఆర్‌ఎస్ సర్వే ద్వారా పార్టీ క్యాడర్ అభిప్రాయాలను సేకరించి కమిటీల నియామకం చేపట్టాలని చెప్పామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానం అమలవుతుందన్నారు. పార్లమెంటు అధ్యక్షుల విషయంలోనూ అదే విధానాన్ని అనుసరిస్తామని స్పష్టం చేశారు.

ఆరోగ్యశాఖకు అంతర్జాతీయ గుర్తింపు

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాతృత్వ ఆరోగ్య సంరక్షణ విధానం అమల్లో రాష్ట్ర ఆరోగ్యశాఖకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ముఖ్యంగా గర్భిణుల సాధారణ ప్రసవాల పద్ధతులపై ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా చేపట్టిన మిడ్‌వైఫరీ శిక్షణ కార్యక్రమాన్ని అత్యుత్తమ విధానం కింద నెదర్లాండ్స్ కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషన్ కాన్ఫడరేషన్ ఆఫ్ మిడ్ వైవ్స్' ఎంపిక చేసింది. ఏపీలో అవలంబిస్తున్న పద్ధతులను వచ్చే ఏడాది జూన్ 14 నుంచి 18 మధ్య లిస్బన్ నగరంలో జరిగే కార్యక్రమంలో వివరించాలని ఏపీ ఆరోగ్యశాఖ అధికారులను ఆ సంస్థ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆహ్వానపత్రాన్ని ఆ దేశం అందించినట్లు ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఈ గుర్తింపుపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అధికారులకు అభినందనలు తెలిపారు.



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు జరుగుతున్న దృశ్యం

భోగాపురం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించేలా కేంద్ర పౌర విమానయాన శాఖ సన్నాహాలు చేస్తోంది. గడువుకు ముందే పనులు పూర్తి చేయాలని పట్టుదలతో ఉంది. విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎయిర్‌పోర్టు పనులను కనీసం 15 రోజులకు ఒకసారైనా పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ రాకపోకలు సాగించేందుకు వీలుగా అన్ని ప్రైవేటు విమానయాన సంస్థలతో ఆయన మంత్రిత్వ శాఖ చర్చలు జరుపుతోంది. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో టూరిజం, హోటల్స్ రంగాలకు సంబంధించి చాలా సంస్థలు ముందుకు వచ్చాయి. దీంతో ప్రస్తుతం రెట్టింపు ఉత్సాహంతో పనులు జరుగుతున్నాయి. మిగిలిన ఎనిమిది శాతం పనులు పూర్తి చేసి టెస్ట్ రైడ్‌కు సిద్ధం కానుంది. ప్రస్తుతమిక్కడ 5,050 మంది ఇంజనీర్లు, కార్మికులు, సిబ్బంది పనులు చేస్తున్నారు.

విభజన హామీల్లో భాగంగా..

విభజన హామీల్లో భాగంగా ఏపీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కేంద్రం కేటాయించింది. వెనుకబడిన ఉత్తరాంధ్రలో దీనిని ఏర్పాటు చేయాలని భావించిన చంద్రబాబు, అప్పట్లో భోగాపురాన్ని ఎంపిక చేశారు. విశాఖ విమానాశ్రయం అవసరాలకు తగ్గట్టు చాలడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని భోగాపురం మండలంలో ఏర్పాటుకు నిర్ణయించారు. 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభం అయ్యాయి. ప్రాథమిక పనులు చేపడుతుండగా, రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత నుంచి పనులు మందగించాయి. వైసీపీ అధికారంలో ఉన్న నాలుగేళ్లు అంతులేని నిర్లక్ష్యం కొనసాగింది. అయితే ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని భావించి 2023 మే 3న మరోసారి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. కానీ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. కేవలం 15 నుంచి 26 శాతం పనులను మాత్రమే వైసీపీ ప్రభుత్వం చేయగలిగింది. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పౌర విమానయాన శాఖ మంత్రిగా టీడీపీకి చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు తీసుకోవడంతో భోగాపురంలో తిరిగి నిర్మాణ పనులు ఊపందుకున్నా యి. మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును విమానాశ్రయానికి సీఎం చంద్రబాబు పెట్టారు.

అతి పొడవైన రన్‌వే..

దేశంలో ఎక్కడా లేని విధంగా 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. రన్‌వే 99 శాతం, ట్యాక్సీ వే 98 శాతం, టెర్మినల్ భవనం 90 శాతం, ఏటీసీ టవర్ 72 శాతం, ఇతర భవనాలు 43 శాతం, ప్రధాన రహదారి పనులు 37 శాతం పూర్తయ్యాయి. ఇప్పటికే అత్యాధునిక ఎయిర్‌పోర్టులను ముంబై, ఢిల్లీ సమీపంలోని నోయిడా కలిగి ఉన్నాయి. ఇప్పుడు భోగాపురం వాటి సరసన నిలవనుంది. మత్స్య ఆకారంలో విమానాశ్రయాన్ని నిర్మిస్తుండడం విశేషం. ఎగిరే విమానం అకారం సైతం ఉండనుంది. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేశారు. విశాఖ ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని విశాఖ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకూ కనెక్టివిటీ రహదారిని నిర్మించాలని భావిస్తున్నారు. అందుకు సంబంధించి ప్రాజెక్టు డీపీఆర్ తయారుచేసేందుకు ఓ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. విశాఖ జిల్లా అనకాపల్లి, విజయనగరం జిల్లా మీదుగా వెళ్లే వరకు ప్రధాన రహదారితోపాటు, విజయనగరం మీదుగా పార్వతీపురం మన్యంజిల్లాకు వెళ్లే అన్ని ప్రధాన రహదారులను సైతం అనుసంధానిస్తున్నారు. అటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వెళ్లే జాతీయ రహదారులను సైతం అనుసంధానం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తాజ్ గ్రూప్ హోటల్ ఏర్పాటు కానుంది. ఎయిర్‌పోర్టుకు దగ్గరగా 500 ఎకరాల భూమిని ప్రభుత్వం రిజర్వులో పెట్టింది. అక్కడ పర్యాటక, ఇతరత్రా నిర్మాణాలు జరగనున్నాయి. ఎయిర్‌పోర్టు దృష్ట్యా విశాఖ నుంచి భోగాపురం వరకూ మెట్రో రైలు మార్గం నిర్మాణం కానుంది. గతంలో ఎన్నో విమానాశ్రయాలను నిర్మించిన ఘనత కలిగిన జీఎంఆర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ బాధ్యతలు చూస్తోంది. జీఎంఆర్ అధినేత గ్రంధి మోహనరావు ఇదే జిల్లావాసి కావడం విశేషం. ఏడాదికి 3.5 మిలియన్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా దీనిని సిద్ధం చేస్తున్నారు.

టీటీడీలో అక్రమార్కులు

(మొదటి పేజీ తరువాయి)

టీటీడీ అధికారులు, ఉద్యోగులు. మిగతా ఐదుగురూ టీటీడీ నియమించిన డెయిరీ నిపుణులు. కాగా, ఈ 11 మందిలో నెయ్యి కల్తీపై ఫిర్యాదు చేసిన మునుపటి జీఎం మురళీకృష్ణ కూడా ఉన్నారు. దీంతో ఫిర్యాదుదారే నిందితుడుగా మారినట్టయింది. ఏసీబీ కోర్టులో సిట్ దాఖలు చేసిన మెమోలో పలు సంచలన విషయాలు వెలుగు చూశాయి.

కొత్తగా చేర్చిన నిందితులు వీరే..

కల్తీ నెయ్యి కేసులో ఏ25గా తిరుమల గోడౌన్ కీపర్‌గా విధులు నిర్వహించిన డిప్యూటీ ఈవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ పల్లి ఈశ్వర రెడ్డి(34), ఏ26గా గతంలో ప్రొక్యూర్‌మెంట్ జీఎం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ముద్దు వెంకట అనిల్ కుమార్(52), ఏ27గా తిరుపతి గోడౌన్ డిప్యూటీ ఈవోగా పనిచేసి రిటైరైన పోలేపల్లి వెంకట నటేశ్‌బాబు(62), ఏ28గా శనివారమే రిటైరైన మునుపటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం పేరూరు జగదీశ్వర రెడ్డి(62), ఏ30గా ఈ కేసు ఫిర్యాదుదారు, ప్రొక్యూర్‌మెంట్ మాజీ జీఎం ప్రళయకావేరి మురళీకృష్ణ (63), ఏ31గా టీటీడీ గోశాల మునుపటి డైరెక్టర్ డాక్టర్ కె.హరినాథరెడ్డి (57), ఏ32 నుంచి ఏ36 వరకూ గతంలో టీటీడీ టెక్నికల్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులుగా నియమించిన డెయిరీ నిపుణులు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ మల్లం మహేందర్ (59), తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ వి.వెంకట సుబ్రమణియన్ (59), సికింద్రాబాద్‌కు చెందిన ఎం.విజయభాస్కర రెడ్డి (62), బెంగళూరుకు చెందిన డాక్టర్ బత్తుల సురేంద్రనాథ్ (67), డాక్టర్ కె.జయరాజారావు(62) ఉన్నారు.

ఎవరెవరి పాత్ర ఏమిటంటే...

» పల్లి ఈశ్వర రెడ్డి తిరుమలలో గోదాములకు సంబంధించిన డిప్యూటీ ఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అక్కడ ఆయన నాలుగో నంబరు గోడౌన్ కీపర్‌గా ఉన్నారు. భోలేబాబా, వైష్ణవి, మాల్‌గంగా, ఏఆర్ డెయిరీల తరఫు కీలక నిందితుడు పొమిల్ జైన్ నుంచి కమీషన్ ఏజెంట్ పి.పి. శ్రీనివాసన్ ద్వారా రూ.23,600 లంచం డిమాండ్ చేసి మరీ తీసుకున్నారు. దానికి ప్రతిగా ఆయా డెయిరీల ట్యాంకర్ల నెయ్యిని అన్‌లోడ్‌కు అనుమతించి, వారి బిల్లులు త్వరగా ప్రాసెస్ అయ్యేందుకు సహకరించారు. మైసూర్ ల్యాబ్ నివేదికను తొక్కిపెట్టి నెయ్యి వెజిటబుల్ ఆయిల్‌తో కల్తీ అయిందన్న సంగతి దాచిపెట్టారు.

» ముద్దు వెంకట అనిల్ కుమార్ టీటీడీ పరిపాలనా భవనంలో క్రమశిక్షణ చర్యల సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనే నెయ్యి సరఫరా విషయంలో క్రమశిక్షణ తప్పారు. ప్రొక్యూర్‌మెంట్ జీఎం కార్యాలయంలో అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి, బియ్యం, సన్‌ఫ్లవర్ ఆయిల్ తదితరాల సరఫరాకు సంబంధించిన ఫైళ్లు చూసేవారు. 2022 జూన్ 6న టెక్నికల్ టీమ్ భోలే బాబా డెయిరీ ప్లాంట్ తనిఖీ చేసి నిబంధనల మేరకు నెయ్యి తయారు చేయడం లేదని తేల్చడంతో ఆ డెయిరీని టీటీడీ డిస్‌క్వాలిఫై చేసింది. అనిల్‌కుమార్ దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా భోలే బాబా డెయిరీ తిరిగి టెండర్లలో పాల్గొనేందుకు సహకరించారు. దీనికిగాను పొమిల్ జైన్ నుంచి ఏజెంట్ శ్రీనివాసన్ ద్వారా అనిల్ రూ.59,600 లంచం తీసుకున్నారు.

» గౌడౌన్ విభాగం డిప్యూటీ ఈవోగా పనిచేసి రిటైరయిన పోలేపల్లి వెంకట నటేశ్ బాబు తిరుపతి వేర్ హౌస్ డిప్యూటీ ఈవోగానూ పనిచేశారు. ట్యాంకర్ల నుంచి నెయ్యి శాంపిళ్లు తీసి టీటీడీ ల్యాబ్‌కు పంపించే విషయంలో భోలేబాబా, వైష్ణవి, ప్రీమియర్ డెయిరీలకు సహకరించారు. ఆ డెయిరీలు సరఫరా చేసిన టిన్నులు, ట్యాంకర్ల నుంచీ నెయ్యి శాంపిళ్లను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌కు పంపించారు. ఆ రిపోర్టు రాకముందే ఆ నెయ్యిని అన్‌లోడ్ చేసి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించేందుకు కారకులయ్యారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టులో నెయ్యి కల్తీ అయిందని ఉన్నప్పటికీ ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు. ఇలా సహకరించినందుకు గాను పొమిల్ జైన్ నుంచి ఏజెంట్ శ్రీనివాసన్ ద్వారా రూ.18,100నగదు, గూగుల్ పే ద్వారా రూ.2వేలు తీసుకున్నారు.

డెయిరీ నిపుణులతో పూర్వ జీఎంలు కుమ్మక్కు

టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగ జీఎంలుగా పనిచేసిన పేరూరు జగదీశ్వర రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్‌వీఆర్ సుబ్రమణ్యం, ప్రళయకావేరి మురళీకృష్ణ, డాక్టర్ కె.హరినాథరెడ్డి టీటీడీ బయటినుంచి నియమించిన ఐదుగురు డెయిరీ నిపుణులతో కుమ్మక్కై డెయిరీల నుంచి లంచాలు తీసుకుని కల్తీ నెయ్యి సరఫరాకు సహకరించారు. వీరంతా ఆయా సమయాల్లో టెక్నికల్ టీమ్ సభ్యులుగా వ్యవహరించారు. భోలేబాబా, వైష్ణవి, మాల్‌గంగా, ఏఆర్ డెయిరీల ప్లాంట్లను తనిఖీలు చేయడానికి కమిటీ ఏర్పాటైంది. అయితే ప్లాంట్లను తనిఖీ చేయకుండానే ఈ కమిటీ సభ్యులు ఆయా డెయిరీలకు అనుకూల రిపోర్టులు ఇచ్చారు. దీంతో ఆ డెయిరీలకు అర్హత లేనప్పటికీ టీటీడీకి ఆవు నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొన్నాయి. అలా సహకరించినందుకు జగదీశ్వర రెడ్డి, ప్రళయకావేరి మురళీకృష్ణ పొమిల్ జైన్ నుంచి రూ.5వేల విలువైన 50 గ్రాముల వెండి నాణేలు లంచంగా తీసుకున్నారు. కోట్లాది మంది భక్తులు పవిత్రంగా భావించే శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి నాణ్యత విషయంలో నిజాయితీగా వ్యవహరించాల్సిన టీటీడీ అధికారులు, ఉద్యోగులు స్వల్ప ప్రయోజనాలకు కక్కుర్తి పడ్డారు. టీటీడీలో ప్రొక్యూర్‌మెంట్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ నుంచి జీఎం దాకా అన్ని స్థాయిల్లోనూ కల్తీ నెయ్యి సరఫరాకు యథాశక్తి సహకరించారు. సిట్ దర్యాప్తు పూర్తయితే గానీ తెర వెనుక కీలక వ్యక్తులు ఎవరో, వారి అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో పూర్తిగా తెలియదు.

డెయిరీ నిపుణులకు రూ.లక్షల్లో లంచాలు

టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీలు, టెండర్లలో పాల్గొనే డెయిరీలకు నిజంగానే అర్హత, సామర్థ్యం ఉందా అన్నది తెలుసుకునేందుకు ఆయా డెయిరీల ప్లాంట్లను టెక్నికల్ ఇన్‌స్పెక్షన్ టీమ్ తనిఖీ చేసి టీటీడీకి నివేదికలు ఇవ్వాలి. ఈ కమిటీలో సభ్యులైన విజయ్‌భాస్కర రెడ్డి, ప్రీమియర్ డెయిరీ ఎండీ జగ్‌మోహన్ గుప్తా నుంచి రూ.2.50 లక్షలు లంచంగా పుచ్చుకున్నారు. ఈ విధంగా ప్రతి ప్లాంట్ తనిఖీ సందర్భంలోనూ అనుకూల రిపోర్టు ఇవ్వడానికి లంచం అడిగి మరీ తీసుకున్నారు. ఇక భోలేబాబా డెయిరీ ప్లాంట్ తనిఖీ చేసినట్టు రిపోర్టు ఇవ్వడానికి పొమిల్ జైన్ నుంచి బి.సురేంద్రనాథ్, కె.జయరాజరావు రూ.50వేల విలువైన శామ్‌సంగ్ మొబైల్ ఫోన్లు చెరొకటి తీసుకున్నారు.

కల్తీని ప్రస్తావించకుండా కప్పదాటు

సురేంద్రనాథ్ బెంగళూరులో డెయిరీ కెమిస్ట్రీ డివిజన్‌కు హెడ్‌గా, ఫుడ్ సేఫ్టీకి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్యానెల్ మెంబర్‌గానూ ఉన్నారు. ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అయిందని తెలిసి కూడా ఆ విషయం దాచిపెట్టారు. మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ వెజిటబుల్ ఆయిల్స్‌తో నెయ్యి కల్తీ అయినట్టు గుర్తించి, ఆ రిపోర్టును టీటీడీకి పంపించింది. దాన్ని పరిశీలించి అభిప్రాయం తెలియజేయాలని కోరుతూ సురేంద్రనాథ్‌కు ఫార్వర్డ్ చేశారు. అయితే అన్ని పారామీటర్లు సక్రమంగానే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కానీ బీటా సిటోస్టిరాల్ టెస్టు గురించి మాత్రం ప్రస్తావించలేదు. మైసూరు ల్యాబ్ నిర్వహించిన ఆ టెస్టులో పాజిటివ్ వచ్చింది. అంటే నెయ్యి వెజిటబుల్ ఆయిల్‌తో కల్తీ అయిందని స్పష్టమైంది. ఈ విషయాన్ని ప్రస్తావించకుండా సురేంద్రనాథ్ కప్పదాటుగా వ్యవహరించారు.

నైలు నదిలో మొసళ్లు కాదు... జైల్లో దోమలు లెక్కపెట్టు భూమనా: పట్టాభి

తిరుపతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'తిరుమల పరకామణి కేసులో కీలకంగా వ్యవహరించిన భూమన కరుణాకరరెడ్డి నైలు నదిలో మొసళ్లు ఎన్ని? సముద్రంలో నీళ్లు ఎంత? అంటే నేనేమి సమాధానం చెప్పగలను? అని వ్యంగ్యాలు మాట్లాడారు. ఆయన లెక్కపెట్టాల్సింది అవి కాదు. జైల్లో దోమలు, బల్లులు' అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి వ్యాఖ్యానించారు. 'పరకామణిలో చోరీ నుంచి రాజీ వరకు అప్పటి పాలకమండలిలో కీలకంగా ఉన్న భూమన, వైవీ సుబ్బారెడ్డిలపాత్ర చాలా ఉంది. ఈ కేసుకు కఠినమైన సెక్షన్ 409 పెట్టాలి. కానీ వైసీపీ ముఖ్యుల విధేయుడు నాటి తిరుమల సీఐ జగన్మోహన్ రెడ్డి రాజీకి అనుకూలమైన సెక్షన్ 379, 381 పెట్టారు. టీటీడీ తీర్మానం నెంబరు 159 మేరకు 19-6-2023న వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని పాలకమండలి రవికుమార్ ఆస్తులను గిఫ్ట్ డీడ్ కింద రాయించుకున్నట్టు చూపించారు. టీటీడీకి సంబంధించి ఏదైనా గిఫ్ట్ డీడ్ ఇవ్వాలంటే కొన్ని నిబంధనలున్నాయి. అవేమీ పాటించలేదు. 2023 జూన్ 19న జరిగిన టీటీడీ పాలక మండలి సమావేశంలో వైవీ, భూమన, చెవిరెడ్డి, పోకల వంటి దుష్టచతుష్టయం కూర్చుంది. 2023 సెప్టెంబరు 5న కరుణాకరరెడ్డి అధ్యక్షుడిగా కూడా (ఐటెం నంబరు 258) వీటిపై చర్చించారు. మరి తనకు సంబంధం లేదని ఎలా అంటారు?" అని పట్టాభి ప్రశ్నించారు. టీటీడీ బోర్డు సమావేశంలో వారున్న ఫొటోలను ఆయన మీడియాకు చూపించారు. భూమన ఆస్తుల చిట్టా పెరిగిన తీరును విపులీకరించారు. ఈ కేసులో కీలకమైన సాక్షి సతీశ్ కుమార్‌ను అత్యంతదారుణంగా హతమార్చారని, దాని వెనుక భూమన పాత్ర ఉందని ఆరోపించారు. భూమన బండారం బయటపెట్టడానికే తాను తిరుపతికి వచ్చానని పట్టాభి తెలిపారు.

ఏడాదిలోగా సరఫరా చేయాల్సిందే

» ఎమర్జెన్సీ రూట్‌లో ఆయుధ కొనుగోళ్లపై కేంద్రం నిబంధన

న్యూఢిల్లీ, నవంబరు 29: ఆయుధ కొనుగోళ్లకు సంబంధించి కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యవసర సందర్భాల్లో(ఎమర్జెన్సీ రూట్‌లో) ఆయుధాల కొనుగోళ్ల కోసం ఒప్పందం జరిగినప్పుడు.. ఆ ఆయుధాలను సంవత్సరంలోగా అందించకపోతే కాంట్రాక్టు రద్దు అయ్యేలా నిబంధనలు రూపొందించింది. ఈ విషయాన్ని రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ వెల్లడించారు. ఇది స్వదేశంలోని రక్షణ కంపెనీలతో పాటు, విదేశాలకు కూడా వర్తిస్తుందన్నారు. రష్యా ఎస్-400లను అందించడంలో చేస్తున్న జాప్యాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీనిపై భారత ప్రభుత్వం, పుతిన్ పర్యటన సమయంలో స్పష్టత కోరుతుందని పేర్కొన్నారు. "ఎమర్జెన్సీ రూట్‌లో ఆయుధాల కొనుగోలుకు ఒప్పందం జరిగినప్పుడు.. ఏ కంపెనీ, ఏ దేశం అన్నదానితో సంబంధం లేకుండా అవి ఏడాదిలోగా ఆయుధాలను అందించాల్సిందే. లేకపోతే కాంట్రాక్టు రద్దు అవుతుంది" అని రాజేశ్‌కుమార్ వివరించారు.

హెచ్-1బీ వీసాల పరిమితి 1,30,000కు పెంపు?

వాషింగ్టన్, నవంబరు 29: అమెరికా ఏటా జారీ చేసే హెచ్-1బీ వీసాల పరిమితి పెంపునకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వీసాలను రెట్టింపు చేసే దిశగా హైస్కిల్డ్ ఇమిగ్రేషన్ రిఫార్మ్ ఫర్ ఎంప్లాయ్‌మెంట్(హెచ్ఐఆర్ఈ) బిల్లును అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి ప్రవేశపెట్టారు. వీసాల వార్షిక పరిమితిని 65 వేల నుంచి 1.30 లక్షలకు పెంచాలని ప్రతిపాదిస్తున్న ఈ బిల్లుకు అమెరికాలోని అతిపెద్ద ఐటీ సేవా సంస్థల సంఘం ఐటీసర్వ్ కూటమి మద్దతు పలికింది. ప్రస్తుతం అమెరికా రెగ్యులర్ క్యాప్ కింద ఏటా 65వేల హెచ్-1బీ వీసాలు జారీ చేస్తోంది. మాస్టర్స్ క్యాప్ కింద 20వేల వీసాలను తమ దేశంలో అడ్వాన్స్ డిగ్రీలు పూర్తిచేసిన వారికి ఇస్తోంది.

నేడు దండకారణ్యం బంద్

» హిడ్మా ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టు పార్టీ పిలుపు

చర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కీలక నేత హిడ్మా, అతడి అనుచరుల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఆదివారం ఛత్తీస్‌గఢ్ దండకారణ్య బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్ నేపథ్యంలో మావోయిస్టులు ఏదైనా విధ్వంసానికి పాల్పడవచ్చన్న అనుమానంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలు అప్రమత్తమయ్యాయి. బస్తర్ డివిజన్‌లోని 7జిల్లాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. నేషనల్ పార్క్, అబూజ్‌మడ్, పామేడు అడవుల్లో కూబింగ్ చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం బంద్ నేపథ్యంలో సరిహద్దున ఉన్న తెలంగాణ, ఏపీ పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. తెలంగాణలోని ములుగు, భద్రాద్రి జిల్లాల్లో తనిఖీలను పెంచారు.

శబరిమల యాత్రలో మరణించేవారిని అంబులెన్సులో తరలించాలి

» స్ట్రెచర్‌పై తీసుకొచ్చే పద్ధతి మానేయాలి: కేరళ హైకోర్టు

కొచ్చి, నవంబరు 29: శబరిమల సన్నిధానం యాత్రలో ఆరోగ్య సమస్యలతో మరణించే వారిని పంబకు స్ట్రెచర్ మీద తీసుకురావటంపై కేరళ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇకపై ఈ పద్ధతి మానుకోవాలని, మరణించిన భక్తులను అంబులెన్సులో తరలించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల మృతులను సగౌరవంగా తరలించటంతోపాటు, సన్నిధానం యాత్రలో పాల్గొనే ఇతర భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని పేర్కొంది. శబరిమల ప్రత్యేక కమిషనర్ సమర్పించిన నివేదికపై హైకోర్టు ద్విసభ ధర్మాసనం శనివారం విచారణ జరిపింది. ప్రస్తుతం పంబలో ఒక పాత అంబులెన్సు ఉందని, దానిని మృతులను తరలించటానికి వినియోగించవచ్చని ప్రత్యేక కమిషనర్ కోర్టుకు తెలిపారు. మరిన్ని సదుపాయాలతో కూడిన వాహనం అందుబాటులోకి వచ్చేవరకూ ఆ పాత అంబులెన్సునే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఉపయోగించుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది.

ర్యాపిడో డ్రైవర్ ఖాతాలో రూ.331 కోట్లు!

» బెట్టింగ్ యాప్ కేసు విచారణలో విస్తుగొలిపే విషయాలు

న్యూఢిల్లీ, నవంబరు 29: ఓ బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ కేసులో ఊహించని రీతిలో ఓ ర్యాపిడో డ్రైవర్ బుక్కయ్యాడు.. కేవలం 8నెలల్లో అతడి బ్యాంకు ఖాతాలో రూ.331 కోట్లు జమయ్యాయని ఈడీ అధికారులు గుర్తించారు. 1ఎక్స్‌బెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో నిధుల మళ్లింపుపై ట్రాక్ చేస్తున్న క్రమంలో ఆ డ్రైవర్‌ను గుర్తించినట్లు వారు తెలిపారు. సదరు డ్రైవర్ ఖాతాలో గతేడాది ఆగస్టు 19నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 16వరకు రూ.331కోట్లు జమయ్యాయి. దీంతో అతడి బ్యాంకు ఖాతాల జాబితాలు పరిశీలించి.. అతడి చిరునామాను గుర్తించి నివాసంపై ఈడీ అధికారులు దాడి చేశారు. ఢిల్లీలోని ఓ మురికివాడలో 2 గదుల ఇంట్లో ఉంటున్న అతడు.. పొట్టకూటి కోసం ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు తెలుసుకున్నారు. తన పేరుతో ఉన్న బ్యాంకు ఖాతా ద్వారా జరిగిన లావాదేవీలకు తనకే సంబంధం లేదని అతడు వాపోయినట్లు అధికారులు తెలిపారు. నిందితులు ఆ డ్రైవర్ ఖాతాను మ్యూల్ ఖాతాగా వినియోగించినట్లు భావిస్తున్నారు.

అణచివేత ఉన్నంతవరకు జిహాద్: మదానీ

న్యూఢిల్లీ, నవంబరు 29: జమైత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా మహమూద్ మదానీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అణచివేత ఉన్నంతవరకు జిహాద్ ఉంటుందని అన్నారు. ఇస్లాంలో ముస్లింలకు జిహాద్ అనేది పవిత్రమైన విధి అని, ఇతరుల మంచి కోరి చేసే కార్యమని చెప్పారు. కానీ, మీడియా, ప్రభుత్వం దానిని హింసకు పర్యాయపదంగా మార్చాయని తప్పుబట్టారు. భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావులేదన్నారు. ఇక్కడి ముస్లింలు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటారని తెలిపారు. సుప్రీంకోర్టు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ఒత్తిడి మేరకు పనిచేస్తోందని, బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాక్ కేసుల్లో తీర్పులే ఇందుకు నిదర్శనమని అన్నారు.

కర్ణాటకానికి తెర!

సీఎం సిద్దు, డీసీఎం శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్ భేటీ



సీఎం సిద్దరామయ్యతో కలసి అల్పాహారం స్వీకరిస్తున్న డీసీఎం శివకుమార్

» మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాల్లేవు

» ఐక్యంగానే ఉన్నాం.. సిద్దు, డీకే వెల్లడి

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో కొన్ని రోజులుగా నెలకొన్న గందరగోళానికి తెరపడింది. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇద్దరూ ఒకచోట సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తామిద్దరం కలిసే ఉన్నామనే సందేశం ఇచ్చేలా శనివారం ఉదయం సీఎం అధికారిక నివాసానికి వెళ్లిన డీకే అక్కడే అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు సుమారు అరగంటకుపైగా మాట్లాడుకున్నారు. అనంతరం సీఎం, డీసీఎం కలిసి మీడియాతో మాట్లాడారు. తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఇకముందు కూడా ఉండబోవని సిద్దరామయ్య స్పష్టం చేశారు. నాయకత్వ మార్పునకు సంబంధించి ఇకపై ఏ విభేదాలు ఉండవని చెప్పారు. తాము ఐక్యంగానే ఉన్నామని, 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. అధిష్ఠానం తీర్మానానికి అనుగుణంగా నడుచుకుంటామని, అల్పాహార విందులోనూ అదే తీర్మానించామని వివరించారు. నాయకత్వం మార్పుపై కొన్ని మీడియాల ద్వారానే ఎక్కువ చర్చ జరిగిందన్నారు. మరో వారం రోజుల్లో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ-జేడీఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే దీటుగా ఎదుర్కొంటామని సీఎం పేర్కొన్నారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ, ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వారికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా పనిచేస్తున్నామని అన్నారు. సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిందని, రాజకీయంగా ఇద్దరిదీ ఒకే తీర్మానమని చెప్పారు. హైకమాండ్ చెప్పినట్లుగానే కలసి ముందుకెళ్తామని తెలిపారు. తాను గ్రూపులకు అవకాశం ఇవ్వనని, నాయకత్వం విషయంలోనూ అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తానని స్పష్టం చేశారు. 2028లోనూ గత ఫలితాలే పునరావృతం అవుతాయని డీకే ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో సీఎం మార్పు అంశంపై కొద్దిరోజులుగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగి శివకుమార్‌ను సిద్దరామయ్య దగ్గరకు వెళ్లి కలవాలని, తద్వారా ఇద్దరూ కలిసే ఉన్నారన్న సంకేతం ఇవ్వాలని, ఊహాగానాలకు తెరదించాలని ఆదేశించింది. మరోవైపు, శనివారం డీకేను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించాలని సిద్దరామయ్యకు సూచించింది. దీనికి ఇద్దరూ అంగీకరించారు.

సీఎం పదవి పోయినప్పుడు ఏ మఠాధిపతీ మాట్లాడలేదు

» కేంద్ర మంత్రి కుమారస్వామి ఆక్రోశం

నాయకత్వ మార్పు అంశంపై ఉత్కంఠ నెలకొన్న తరుణంలో ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన పలువురు స్వామీజీలు డీకే శివకుమార్‌కు అండగా నిలిచారు. వారి తీరుపై కేంద్ర మంత్రి కుమారస్వామి శనివారం మండిపడ్డారు. రాజకీయాల కారణంగా తాను రెండుసార్లు సీఎం పదవిని కోల్పోయానని, అప్పట్లో తనకు ఏ మఠాధిపతీ మద్దతుగా మాట్లాడలేదని ఆరోపించారు. కులాల పేరు చెప్పుకొని ధార్మిక, ఆధ్యాత్మిక రంగాలను దుర్వినియోగం చేయడం, రాజకీయాలు చేయడం ఎవరికీ మంచిది కాదన్నారు. ఒక్కలిగ, కురుబ, ఇతర సామాజికవర్గాలకు చెందిన స్వామీజీలు రాజకీయ చర్చల్లో పాల్గొనడం, ఒకరికి మద్దతు ఇవ్వడం సరికాదని తెలిపారు. మఠాధిపతులు రాజకీయ వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు.

'సర్'పైనే సమరం!

» రేపటి నుంచి 19వ తేదీ వరకు పార్లమెంట్

» నేడు అఖిలపక్ష, బీఏసీ భేటీలు

న్యూఢిల్లీ, నవంబరు 29: చల్లచల్లని శీతాకాలంలో అధికార, విపక్షాల మధ్య వాడివేడిగా చర్చలకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచే పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. దీనికి సంబంధించి కేంద్రం ఆదివారం ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని పార్టీలకు విజ్ఞప్తి చేయనుంది. పార్లమెంటు సమావేశాల్లో చర్చించే అంశాల ఎజెండాను ఖరారు చేసేందుకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు విడివిడిగా లోక్‌సభ, రాజ్యసభల బీఏసీ సమావేశాలు జరగనున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకు పార్లమెంటు సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. ఈసారి పార్లమెంటు సమావేశాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) అంశం కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంటులో చర్చకు పట్టుబట్టాల్సిన అంశాలపై చర్చించుకునేందుకు ఇండి కూటమి పార్టీల ప్రతినిధులు సోమవారం ఉదయం 10 గంటలకు రాజ్యసభ ప్రాంగణంలోని ఖర్గే కార్యాలయంలో భేటీ కానున్నారు.

వీధి కుక్కలపై తీర్పును పునఃసమీక్షించండి

» సుప్రీంకోర్టుకు 50వేల మంది లేఖలు

న్యూఢిల్లీ, నవంబరు 29: వీధి కుక్కల బెడదపై ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ శనివారం 50 వేలకు మందికి పైగా పౌరులు సుప్రీంకోర్టుకు లేఖలు రాశారు. చేతితో లేఖలు రాసి పోస్టు ద్వారా పంపారు. ఇందులో ఢిల్లీకి చెందిన 10వేల మంది ఉన్నారు. ఆస్పత్రులు, పాఠశాలల వంటి ప్రాంతాల్లో కుక్కలు లేకుండా చూడాలని, వాటికి జనన నియంత్రణ ఇంజెక్షన్లు ఇవ్వాలని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇది జంతువుల హక్కులకు భంగకరమని పేర్కొంటూ అంబిక అనే జంతు సంక్షేమ కార్యకర్త వినతుల ఉద్యమాన్ని ప్రారంభించారు.



వివాహ బంధంలోకి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

మెల్‌బోర్న్, నవంబరు 29: ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ (62) శనివారం నూతన జీవితంలోకి అడుగుపెట్టారు. ఆయన తన స్నేహితురాలు జోడీ హైడోన్ (46)ను వివాహమాడారు. రాజధాని కాన్‌బెర్రాలోని అధికారిక నివాసం 'ద లాడ్జ్' మైదానంలో నిరాడంబరంగా ఈ వివాహం జరిగింది. మంత్రులు సహా కేవలం 60 మందిని మాత్రమే ఆహ్వానించారు. అల్బనీస్‌కు ఇది వరకే వివాహం జరగగా, విడాకులు తీసుకున్నారు. ఈ వివాహానికి యువకుడైన మొదటి భార్య కుమారుడు కూడా వచ్చారు. వారి పెంపుడు శునకం టోటో పెళ్లి ఉంగరాన్ని తీసుకొచ్చి 'రింగ్ బేరర్'గా వ్యవహరించింది. నూతన దంపతులకు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

అబద్ధాల పాక్.. అవే కుయుక్తులు!



సాయిదీపక్

» ఆపరేషన్ సిందూర్‌పై ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో డిబేట్‌కు ఆహ్వానం

» అబద్ధాలు చెప్పి భారత బృందం హోటల్‌లోనే ఉండేలా కుట్ర

» తర్వాత తామే గెలిచామని ప్రకటన.. ఎండగట్టిన భారత బృందం

లండన్, నవంబరు 29: ప్రపంచవ్యాప్తంగా అంతా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే చర్చావేదికల్లో ఒకటైన 'ఆక్స్‌ఫర్డ్ యూనియన్'లో పాక్ కుయుక్తులకు పాల్పడింది! మనవాళ్లను డిబేట్‌కు పిలిచి.. చివరి నిమిషంలో 'డిబేట్ రద్దు అయ్యింది' అంటూ మనవాళ్లకు సమాచారం అందించి, రాకుండా చేసి.. 'భారత వక్తలు భయపడి ఈ డిబేట్‌కు రాలేదు.. మేమే గెలిచాం' అని ప్రచారం చేసుకోవడం మొదలుపెట్టింది. కానీ.. పాక్ కుట్రలను మన భారతీయ బృందం ఆధారాలతో సహా బయటపెట్టింది!! రెండు రోజుల క్రితం లండన్ వేదికగా జరిగిన ఈ కపటనాటకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 1823లో స్థాపితమైన ఆక్స్‌ఫర్డ్ యూనియన్ సొసైటీలో ప్రతివారం నిర్వహించే చర్చలకు గొప్ప పేరుంది. చర్చిల్, దలైలామా, హాకింగ్.. ఇలా ఎందరో ప్రముఖులు ఈ చర్చల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. అలాంటి ఆక్స్‌ఫర్డ్ యూనియన్.. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో నవంబరు 27న ఒక డిబేట్ నిర్వహించాలని నిర్ణయించింది. ఆ చర్చకు.. "పాకిస్థాన్ పట్ల భారత్ అనుసరిస్తున్నది.. భద్రతా విధానంగా చెబుతున్న ప్రజాకర్షక వ్యూహం" అని భారత్ పట్ల ప్రతికూల ధోరణితో కూడిన పేరు పెట్టింది. దీని వెనుక ఉన్నది ఆక్స్‌ఫర్డ్ యూనియన్ అధ్యక్షుడు మూసా హర్రాజ్, కోశాధికారి రజా నాజర్. వీరిలో మూసా హర్రాజ్.. పాకిస్థాన్ రక్షణ ఉత్పత్తుల మంత్రి ముహమ్మద్ రజా కుమారుడు. రజా నాజర్ కూడా పాకిస్థానీయే. ఈ చర్చలో పాల్గొనేందుకు భారత్ నుంచి సుప్రీంకోర్టు న్యాయవాది జె.సాయిదీపక్, మరో ఇద్దరు సిద్ధమయ్యారు. కానీ.. చర్చ ప్రారంభం కావడానికి మూడు గంటల ముందు.. సాయిదీపక్‌కు మూసా ఫోన్ చేసి.. 'పాకిస్థాన్ బృందం ఇంకా రానందున, చర్చను రద్దు చేస్తున్నాం' అని చెప్పాడు. దీంతో మన బృందం.. హోటల్‌లోనే ఉండిపోయింది. అనంతరం.. "భారత బృందం చివరినిమిషంలో ఉపసంహరించుకుని, మాకు విజయాన్ని కట్టబెట్టింది" అంటూ లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. వెంటనే సాయిదీపక్ అదే 'ఎక్స్' వేదికగా.. పాకిస్థానీల అసలు స్వరూపాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారు. 16 వరుస పోస్టుల్లో పాక్ కుయుక్తిని ఎండగట్టారు. తాము ఈ చర్చకు పాల్గొనేందుకు లండన్‌కు వచ్చామని.. కానీ, మూసా ఫోన్ చేసి డిబేట్ రద్దయినట్లు చెప్పాడని పేర్కొన్నారు. అతడి ఫోన్ కాల్ లాగ్స్‌ను సైతం తన పోస్టుకు జత చేశారు. ఇప్పటికీ తాము లండన్‌లోనే ఉన్నామని.. పాకిస్థానీ బృందం కూడా లండన్‌లోనే ఉందన్న విషయం తమకు తెలిసిందని.. వారికి బృందానికి వెన్నెముక ఉంటే తమతో చర్చకు రావాలని సవాల్ చేశారు. ప్రతిష్ఠాత్మక 'ఆక్స్‌ఫర్డ్ యూనియన్'ను సైతం పాక్ తన కుట్రలకు వేదికగా చేసుకోవడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనిపై శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ ప్రియాంక చతుర్వేది కూడా స్పందించారు. ఈ చర్చకు తనను కూడా ఈ ఏడాది జూలైలోనే ఆహ్వానించారని.. ఆ సమయానికి పార్లమెంట్ సమావేశాలు లేకపోతే తాను వస్తానని చెప్పానని.. కానీ, ఆ తర్వాత వారు తనతో ఎలాంటి సంప్రదింపులూ జరపలేదని.. చర్చకు సరిగ్గా రెండు రోజుల ముందు వారు తనను సంప్రదించారని.. దీంతో వారి నిర్వహణ సామర్థ్యంపై నమ్మకం లేక తాను రానని చెప్పేశానని ఆమె వివరించారు.

గగనయానం గందరగోళం

» ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యలు

» నిలిచిపోయిన 6 వేల విమానాలు



న్యూఢిల్లీ, నవంబరు 29: ఎయిర్‌బస్ ఏ320 రకం విమానాల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యలు ప్రపంచవ్యాప్తంగా పౌర విమానయాన రంగంలో తీవ్ర అలజడి సృష్టించాయి. ఏ318, ఏ319, ఏ320, ఏ321 రకం విమానాల్లో సౌర రేడియో ధార్మికత వల్ల సమస్యలు వచ్చాయని, వెంటనే వాటిలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలని విమానయాన కంపెనీలు, పౌర విమానయాన నియంత్రణ సంస్థలకు ఆ విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ శుక్రవారం అత్యవసర అడ్వయిజరీ జారీచేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి 6,000 విమానాలు నిలిచిపోయాయి. అడ్వయిజరీ జారీచేసిన సమయంలో ఈ రకానికి చెందిన దాదాపు 3,600 విమానాలు గాల్లో ఎగురుతున్నాయి. అవి గమ్యస్థానాలకు చేరిన వెంటనే, వాటి తర్వాతి ప్రయాణాలను రద్దుచేసి సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ కోసం తరలించారు. భారత్‌లోనూ 200 నుంచి 250 విమానాలు నిలిచిపోయాయి. దీంతో చాలాకంపెనీలు ప్రయాణాలను వాయిదా వేయటమో రీషెడ్యూల్ చేయటమో, రద్దు చేయటమో చేశాయి. అయితే, తమ విమానాల షెడ్యూళ్లలో ఏ మార్పూ లేదని ఎయిర్ ఇండియా తెలిపింది. ఎయిర్‌బస్ కంపెనీ 55 ఏళ్ల చరిత్రలో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రభావం ఇదేనని ఏవియేషన్ వర్గాలు తెలిపాయి. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ తర్వాత కూడా ఈ విమానాలను పూర్తిగా చెక్ చేసిన తర్వాతే వినియోగంలోకి తేవాలని డీజీసీఏ ఆదేశాలు జారీచేసింది.

అసలేం జరిగింది?

గత నెల 30వ తేదీన మెక్సికోలోని కాన్‌కన్ నుంచి అమెరికాలోని న్యూజెర్సీలో ఉన్న నెవార్క్‌కు వెళ్తున్న జెట్‌బ్లూ సంస్థకు చెందిన ఏ320 విమానం గాల్లో ఉన్నట్లుండి తన మార్గం నుంచి కిందికి పడిపోయింది. పైలట్ ప్రమేయం లేకుండానే ఎలివేటర్ అండ్ ఎయిలెరాన్ కంప్యూటర్ (ఈఎల్ఏసీ) యూనిట్ విమాన ఎలివేటర్లకు ఆదేశాలు ఇవ్వటం మొదలుపెట్టింది. అయితే, పైలట్లు విమానాన్ని నియంత్రించి యథాస్థానానికి తెచ్చారు. ఈ ఘటనతో విమానంలోని ప్రయాణికులతోపాటు సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. విమానాన్ని వెంటనే ఫ్లోరిడాలోని తంపా విమానాశ్రయంలో దించివేశారు. విమానంలో జరగడానికి అంతరిక్షంలోకి భారీగా వెలువడుతున్న సౌర రేడియో ధార్మికతేనని ఎయిర్‌బస్ సంస్థ శుక్రవారం ప్రకటించింది. విమానాల్లో సాఫ్ట్‌వేర్‌ను అత్యవసరంగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

టీవీ రేటింగ్స్ కోసం.. 100 కోట్ల లంచం!

బార్క్ ఉద్యోగికి క్రిప్టో రూపంలో ముట్టజెప్పిన కేరళ చానల్..

» గుట్టు రట్టుచేసిన మరో చానల్

కేరళలో రూ.100 కోట్ల టీవీ రేటింగ్స్ కుంభకోణం జరిగింది! ఆ రాష్ట్రానికి చెందిన ఒక స్థానిక టీవీ చానల్.. తన రేటింగ్స్‌ను కృత్రిమంగా పెంచుకోవడం కోసం బార్క్ (బ్రాడ్‌కాస్ట్ ఆడియెన్స్ రిసెర్చ్ కౌన్సిల్) ఉద్యోగి ఒకరికి క్రిప్టోకరెన్సీలో రూ.100 కోట్లు లంచంగా ముట్టజెప్పిందంటూ 'ట్వంటీఫోర్ న్యూస్' అనే చానల్ సంచలన వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. బార్క్ ఉద్యోగి ప్రేమ్‌నాథ్ పేరిట ఉన్న 'ట్రస్ట్ వాలెట్' అనే మొబైల్ వాలెట్ యాప్‌లోకి.. స్థానిక చానల్ యజమాన్యం పలు దఫాలుగా యూఎస్‌డీటీ (టెదర్) అనే క్రిప్టో కరెన్సీ రూపంలో రూ.100 కోట్లు పంపినట్లు అందులో ఆరోపించింది. దానికి బదులుగా అతడు సదరు చానల్ యజమానికి.. టీవీ రేటింగ్స్ గురించిన కీలక సమాచారాన్ని ఒకవారం ముందుగానే పంపేవాడని, ఏయే ప్రాంతాల్లో ఏయే ఇళ్లలో బార్క్ రేటింగ్ మీటర్లు అమర్చారో పిన్‌కోడ్‌తో సహా సమాచారం అందించేవాడని పేర్కొంది. దీనికి సంబంధించి వాట్సాప్ చాటింగ్, చెల్లింపుల స్క్రీన్ షాట్లను సైతం 'ట్వంటీఫోర్ న్యూస్' చానల్ బయటపెట్టింది. అయితే.. స్థానిక కేబుల్ ఆపరేటర్ తమ చానల్‌ను 'ల్యాండింగ్ పేజ్ (సెట్ టాప్ బాక్స్ ఆన్ చేయగానే వచ్చే చానల్)'లో పెట్టడం వల్లనే తమ రేటింగ్స్ పెరిగాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న చానల్ బహిరంగ ప్రకటన ద్వారా వెల్లడించింది. కానీ, వారు పేర్కొంటున్న కేబుల్ ఆపరేటర్‌కు 20 వేల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయని.. 85 లక్షల కేబుల్ కనెక్షన్లున్న కేరళలో కేవలం 20 వేల మంది ఉన్నచోట ఎక్కువ మంది చూస్తే రేటింగ్స్ పెరిగిపోతాయా? అని మిగతా చానళ్లు ప్రశ్నిస్తున్నాయి. వాణిజ్య సంస్థలు తమ ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలు ఇవ్వడానికి 'బార్క్' రేటింగ్స్‌నే ప్రామాణికంగా తీసుకుంటాయి. ఎక్కువ రేటింగ్స్ ఉన్న చానళ్లలో వాణిజ్య ప్రకటనలు ఇవ్వడానికి ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అందుకే టీవీ చానళ్లు ఈ రేటింగ్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ఈ కథనంతో అప్రమత్తమైన కేరళ టెలివిజన్ ఫెడరేషన్ (కేటీఎఫ్).. సీఎం విజయన్‌కు ఫిర్యాదు చేసింది. మరోవైపు.. బార్క్ కూడా ఈ వ్యవహారంపై ఓ స్వతంత్ర ఏజెన్సీ ద్వారా ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశించింది.

సిమ్ ఉన్న ఫోన్లోనే వాట్సాప్ లాగిన్!



» వాట్సాప్ లాగిన్‌కు సిమ్ బైండింగ్ నిబంధన

» అదే నంబరు సిమ్ అదే ఫోన్లో ఉండాలి

» సైబర్ నేరాల్ని అరికట్టేందుకు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబరు 29: వాట్సాప్, టెలిగ్రామ్ తదితర మెసేజింగ్ యాప్‌లను స్కామ్‌స్టర్లు దుర్వినియోగం చేయకుండా అరికట్టేందుకు టెలికం శాఖ కొత్త ఆదేశాలను జారీ చేసింది. అందులో ప్రధానమైనది.. సిమ్ బైండింగ్ నిబంధన. ఈ ఫోన్లో సిమ్ ఆ ఫోన్లో వాట్సాప్ ఉంచుకుంటానంటే కుదరదు. ఏ ఫోన్లో అయితే సిమ్ ఉంటుందో అదే ఫోన్లో మాత్రమే సంబంధిత నంబర్ వాట్సాప్ లేదా టెలిగ్రామ్ పని చేస్తుంది. సిమ్ తీసేస్తే వెంటనే మెసేసింగ్ యాప్‌లు కూడా పని చేయడం మానేస్తాయి. కొంతమంది డెస్క్‌టాప్‌లో, లాప్‌ట్యాప్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వెబ్ బ్రౌజర్‌లో వాట్సాప్‌ను ఓపెన్ చేసి, అలాగే మరచిపోతుంటారు. ఆ డెస్క్‌టాప్ తెరిచిన వాళ్లందరికీ అందులో సమాచారం తెలిసిపోతుంటుంది. ఈ పరిస్థితిని నివారించేందుకు టెలికం శాఖ కొత్త నిబంధనను తీసుకొచ్చింది. అలా తెరిచి వదిలేసిన వాట్సాప్ ఆరు గంటల్లో దానంతట అదే లాగౌట్ అయ్యేలా చూడాలని ఆదేశించింది. వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియోచాట్, ఆరాట్టై, జోష్ తదితర మెసేజింగ్ యాప్‌లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. విదేశాల నుంచి భారతీయులకు ఫోన్ల ద్వారా కాల్ చేసి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వారు ఎక్కువగా వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి మెసేజింగ్ యాప్‌లు వాడుతున్నారు. మొదట భారతీయులైన భాగస్వాముల ద్వారా ఇండియా సిమ్‌లు సంపాదిస్తున్నారు. వాటిని భారతదేశంలోనే యాక్టివేట్ చేస్తున్నారు. తాముండే దేశాల్లో మరో ఫోన్‌లో అదే నంబర్‌తో వాట్సాప్‌ను యాక్టివేట్ చేస్తున్నారు. అందుకు అవసరమైన ఓటీపీని భారతదేశంలోనే ఉండే భాగస్వామి ఫోన్ ద్వారా ఇస్తారు. వాట్సాప్ సిద్ధం కాగానే ఇండియాలో ఫోన్ స్విచాఫ్ చేస్తారు. వాట్సాప్‌తో అమాయకులైన భారతీయులకు కాల్స్ చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతుంటారు. తాజా నిబంధనలతో దేశం బయట కోట్ల సంఖ్యలో భారతీయ నంబర్లతో ఉన్న వాట్సాప్‌లు మూగబోతాయి. ఇప్పటికే బ్యాంకుల యాప్‌లు, యూపీఐ పేమెంట్ యాప్‌లు ఈ రూల్‌ను పాటిస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.